సూర్య www.suryaa.com
18 వ వసంతంలోకి ...
visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...


APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్
www.suryaepaper.com
చూడండి.

సంపుటి 18 | సంచిక 167
మంగళవారం | 8 ఏప్రిల్ 2025 | విజయవాడ
| పేజీలు 8+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - వసంత ఋతువు, చైత్ర శుద్ధ ఏకాదశి రా.11.20, ఆశ్లేష ఉ.10.30 వర్జ్యం రా.11.00 నుంచి 12.39 వరకు
రాహుకాలం మ.3.00 నుంచి 4.30 వరకు దుర్ముహూర్తం ఉ.8.24 నుంచి 9.13 వరకు తిరిగి రా.10.52 నుంచి 11.39 వరకు




స్టాక్ మార్కెట్‌కు బ్లాక్ మండే

## మార్కెట్‌లు ఢమాల్

● భారీ నష్టాల్లో సూచీలు - అన్ని రంగాలు భారీగా పతనం ● పెద్దన్న ఆరంభించిన వాణిజ్య యుద్ధం ప్రధాన కారణం ● ట్రంప్ దెబ్బ - గోల్కొండ అబ్బలా ఉందన్న విశ్లేషకులు ● ప్రపంచ వాణిజ్య మార్కెట్లు అన్నింటా తీవ్ర ప్రభావం ● భారత్‌లోనే దాదాపు రూ.12 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

ట్రంప్ వాణిజ్య యుద్ధం కారణంగా దేశీయ స్టాక్ మార్కెట్ సోమవారం అల్లకల్లోలం అయిపోయింది. ఉదయం మార్కెట్ ప్రారంభం కాగానే భారీ నష్టాలతో ప్రారంభమైంది. సూచీలన్నీ భారీగా పతనం అయిపోయాయి.

భారత స్టాక్ మార్కెట్ సహా ఆసియా దేశాల్లో కూడా సూచీలు మొత్తం నష్టాల్లోకి జారుకున్నాయి. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా, భారత స్టాక్ మార్కెట్ ప్రారంభంలోనే తీవ్రమైన అమ్మకాలు పెరిగి, నిఫ్టీ, సెన్సెక్స్ 10 నెలల కనిష్ట స్థాయిలకు చేరుకున్నాయి. మరోవైపు టోక్యో నిక్కీ 225 ఇండెక్స్ 8 శాతం తగ్గిపోగా, ఆస్ట్రేలియా ఎస్అండ్‌పి / ఏఎస్క్ ఎక్స్ 200 6% పడిపోయింది.

5లో

## మరోసారి బిజేపీదే ఫస్ట్‌ప్లేస్



6లో

● రూ.2243 కోట్ల విరాళాలతో తొలి స్థానం ● రూ.281.48 కోట్లతో రెండో స్థానంలో కాంగ్రెస్● పార్టీల విరాళాలపై నివేదిక వెల్లడించిన ఏడీఆర్ ● కాంగ్రెస్, ఆప్, ఎన్‌సిపి, ఎంసిపిఐల విరాళాలలో భారీ తరుగుదల

## మాతృభాషకు పెద్ద పీట వేయాలి




6లో

● శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ● 3 వ ప్రపంచ తెలుగు మహా సభల లోగో ఆవిష్కరణ

# ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధిద్దాం

● ఆహారపు అలవాట్లతో వ్యాధులు తగ్గించుకోవచ్చు ● ఉప్పు, వంటనూనె, చక్కెర వినియోగం తగ్గిస్తే ఆరోగ్యం పదిలం ● క్యాన్సర్ రోగుల్లో మహిళలే అధికం ● రైతులు పురుగుమందుల వినియోగం తగ్గించాలి, ప్రకృతి సాగు పెరగాలి ● ప్రతి నియోజకవర్గంలో 100 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ● అమరావతిలో మెగా మెడిసిటీని నిర్మాణం, హెల్త్ టూరిజానికి ప్రోత్సాహం ● ఏ జిల్లాలో ఏ రకమైన ఆరోగ్య సమస్యలు ఉన్నాయన్నదానిపై సీఎం చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజంటేషన్




2లో

ఆహారపు అలవాట్లు, జీవన విధానం మార్పు ద్వారా ఆరోగ్యంగా ఉండ వచ్చని, ఇందుకోసం ప్రతి రోజూ వ్యాయామం, యోగా, ధ్యానం చేయడంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రోజూ అరగంట వాకింగ్ చేయడం, అలాగే దైవ చింతనతో ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. మన దేశ వారసత్వ సంపద అయిన యోగాను ఇప్పుడు ప్రపంచమంతా అనుసరిస్తోందని తెలి పారు. పొగాకు, డ్రగ్స్, ఆల్కాహాల్‌ను దూరం పెడితే క్యాన్సర్, లివర్, కిడ్నీ సమస్యలు తగ్గుతాయన్నారు. జంక్ ఫుడ్, పాలిష్డ్ బియ్యం తినడం తగ్గించి మిల్లెట్స్, ముడిబియ్యం తీసుకో వడంతో పాటు ఆహారంలో పీచు పదార్థం, కూరగాయలు ఎక్కువగా తినాలని సూచించారు. జిల్లాల వారీగా హెల్త్ రిపోర్టులను సోమవారం సచివాలయంలో ప్రజంటేషన్ ద్వారా ముఖ్యమంత్రి మీడియాకు వివరించారు. ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా రాష్ట్రాన్ని రూపొందించాలన్నది తమ ఆలోచన అన్న సీఎం...హెల్తీ, వెల్దీ, హ్యాపీ ఏపీ సాధనకు ప్రయత్నిస్తున్నామన్నారు.

వివరాలు-2లో

సూర్య వెబ్‌సైట్
సూర్య ఈ - పేపర్

## అమరావతికి రూ.4,285 కోట్లు



2లో

● ప్రపంచ బ్యాంకు, ఏడీబీలు తొలిగా విడుదల చేసిన రుణం ● మొత్తం రూ.15 వేల కోట్ల రుణం ● పనుల ప్రారంభానికి ఊతం ఇవ్వనున్న నిధులు

అమరావతి నిర్మాణ పనులకు ఊతం ఇచ్చేలా కేంద్రం నిధులు విడుదల చేసింది. ఏపీ ప్రభుత్వానికి, అమరావతి నిర్మాణాన్ని కోరుకున్న ప్రజలకు కేంద్రం చెప్పిన గుడ్ న్యూస్ గా దీనిని పరిగణిస్తున్నారు.

## అభివృద్ధి ప్రధాన మంగళగిరి

● భారీ మెజారిటీతో గెలిపించడం వల్లే పెద్దఎత్తున అభివృద్ధి ● జూన్ నుంచి అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు ప్రారంభిస్తాం ● మీరు నా గౌరవం, పరువు నిలబెట్టారు, మీ కోసం అహర్నిశలు శ్రమిస్తా ● 3వ రోజు మన ఇల్లు మన లోకేష్ కార్యక్రమంలో మంత్రి లోకేష్



2లో

భారతదేశంలోనే మంగళగిరిని అభివృద్ధికి చిరునామాగా మారుస్తా, మంగళగిరిని నెం.1గా తీర్చిదిద్దేందుకు ప్రజలందరి సహకారం కావాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మన ఇల్లు మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా యర్రబాలెం డాన్ బాస్కో స్కూలు ఆవరణలో సోమవారం మధ్యాహ్నం తాడేపల్లి మండల పరిధిలోని పెనుమాక, ఉండవల్లి, ఇప్పటం ప్రజలకు పట్టాలను అందజేశారు.

నర్సింగ్ విద్యాసంస్థల ఏర్పాటు నిర్వహణను

## ప్రక్షాళన చేయాలి

● నూతన హెచ్.పి.సి చైర్మన్‌కు మంత్రి శ్రీసత్యకుమార్ యాదవ్ సూచన ● అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి



2లో

రాష్ట్రంలో నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటు మరియు వాటి నిర్వహణను నియమాలక నుగుణంగా పూర్తిగా ప్రక్షాళన చేయాలని ఆరోగ్య శాఖా మంత్రి శ్రీసత్యకుమార్ యాదవ్ ఆకాంక్షించారు. ఈ విషయాలను పర్యవేక్షించే హైపవర్ కమిటీ కొత్త చైర్మన్, మాజీ హైకోర్టు జడ్జి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావుకు మంత్రి ఈ మేరకు సూచించారు. నూతన చైర్మన్ గా ఆదివారం నాడు బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ దుర్గాప్రసాదరావు సోమవారం నాడు మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు పలు విషయాలను చర్చించారు.


## ఏపీకి మరో మిస్సైల్ సెంటర్



3లో

భారతదేశ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో దేశంలో మరో మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ నిర్మాణానికి కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం అనువైన ప్రాంతంగా ఆంధ్రప్రదేశ్ను ఎంచుకుంది. ఇందులో భాగంగానే 2011లో ఏపీకి ఈ ప్రాజెక్టును కేటాయించింది. అప్పట్లోనే ఈ మిస్సైల్ సెంటర్ నిర్మాణానికి కృష్ణా జిల్లాలోని నాగాయలంక మండలం గుల్లలమోద గ్రామం అనువైన ప్రాంతంగా కేంద్రప్రభుత్వం గుర్తించింది.

## అంతా ఇంతే!




కంగారుపడకండి సార్ ఇదంతా ట్రంప్ వల్లేనని చెబుదాం...

అడవి బిడ్డలకు అండగా

# కూటమి ప్రభుత్వం

● ఓట్లు, సీట్లు మాకు ముఖ్యం కాదు ● గిరిజనుల సంక్షేమమే మా ప్రభుత్వ ఆశయం ● 2018లో ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు రోడ్ల పరిస్థితి చూసి ఆవేదన చెందా ● మూడు నెలల క్రితం రోడ్ల అభివృద్ధికి మళ్లీ వస్తానన్న మాటతో అడవితల్లి బాటతో మీ ముందుకి వచ్చాను ● పలు అభివృద్ధి కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్




3లో

అడవినే నమ్ముకున్న గిరిపుత్రుల గురించి మనసుతో ఆలోచిస్తాం. వారి అభివృద్ధి, అభ్యున్నతి కోసం నిత్యం తపిస్తాం. మాకు ఓట్లు, సీట్లు ముఖ్యం కాదు. గిరి పుత్రుల సంపూర్ణ అభివృద్ధి, జీవనశైలి పెంపుదల ముఖ్యం అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు అన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో గిరిజనుల అభివృద్ధికి రూ. 92 కోట్లు ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోపే రూ.1005 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఒంటిమిట్ట కోదండరాముడి

## కళ్యాణోత్సవ ఏర్పాట్లు

11న అంగరంగ వైభవంగా మహోత్సవం



3లో

అత్యంత ప్రాచీన విశిష్టత ఉన్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలో ఏప్రిల్ 11న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు.. రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా ఇంచార్జీ మంత్రి ఎస్. సవిత లు సంయుక్తంగా పేర్కొన్నారు. సోమవారం ఒంటిమిట్ట టిటిడి కళ్యాణ మండపం సమీపంలోని పరిపాలన భవన సమావేశ మందిరంలో... జిల్లా కలెక్టర్ స. శ్రీధర్ చెరుకురి, ఎస్పీ అశోక్ కుమార్, జేసీ అదితి సింగ్గిఆర్వో విశ్వేశ్వర నాయుడు లతో కలిసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు, కళ్యాణోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులు, టీటీడీ అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

## పేరు గొప్ప- ఊరు దిబ్బ

● పేదోడి వైద్యానికి భరోసా లేదు ● ఆరోగ్యంపై భరోసా ఇవ్వని కూటమి ప్రభుత్వం ● గొప్పలు పోయే చంద్రబాబుగారు ఆరోగ్య శ్రీకి నిధులు విడుదల చేయండి ● ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందక ఒక్కరు చనిపోయినా అవి కూటమి ప్రభుత్వ హత్యలే ● ధ్వజమెత్తిన షర్మిలా



2లో

ఆరోగ్య శ్రీ సేవలు అందకుండా ఒక్కరు చనిపోయినా, వాటిని కూటమి ప్రభుత్వ హత్యలుగానే భావిస్తామని పీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. సోమ వారం విజయవాడలో విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఆమె మాట్లా డుతూ..ఏపీలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు ఇవాళ్టి నుంచి నిలిచిపోతున్నాయి.

# అమరావతికి రూ.4,285 కోట్లు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : అమరావతి నిర్మాణ పనులకు ఊతం ఇచ్చేలా కేంద్రం నిధులు విడుదల చేసింది. ఏపీ ప్రభుత్వానికి, అమరావతి నిర్మాణాన్ని కోరుకున్న ప్రజలకు కేంద్రం చెప్పిన గుడ్ న్యూస్ గా దీనిని పరిగణిస్తున్నారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం గతంలో ప్రపంచ బ్యాంక్, ఏడీబీ సహా వివిధ సంస్థల నుంచి తీసుకునే రూ.15 వేల కోట్ల రుణాలకు గ్యారంటీ ఇచ్చిన కేంద్రం.. ఇందులో భాగంగా ఇవాళ తొలి విడతగా నిధులు విడుదల చేసింది. దీంతో అమరావతి పనుల పునఃప్రారంభానికి ప్రధాని వస్తున్న వేళ ఏపీ ప్రభుత్వానికి ఊరట దక్కింది. ఏపీలో అమరావతి రాజధాని అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం తొలి విడత నిధులు విడుదల చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వానికి రూ.4,285 కోట్ల నిధులు విడుదల చేసినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రపంచ బ్యాంకు నుండి మొదటి విడతగా 205 మిలియన్ డాలర్లు అందుకున్న తర్వాత కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కు రూ.4285 కోట్ల నిధుల్ని విడుదల చేసింది. అమరావతి రాజధాని నగరంలో ఫేజ్1 అభివృద్ధి కోసం ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు కలిసి 1600 మిలియన్ డాలర్లు (రూ.13,600 కోట్లు) నిధులివ్వనుంది. గతంలోనే అంగీకరించాయి. ఇందులో ఒక్కో బ్యాంక్ 800 మిలియన్ డాలర్ల మేర నిధులు సమకూర్చడానికి అంగీకరించాయి. అయితే అమరావతి తొలి దశ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 15,000 కోట్ల రూపాయలను కేటాయించగా.. మరో రూ.1,400 కోట్లను తన నిధుల నుంచి కేంద్రం కేటాయిస్తోంది. ప్రపంచ బ్యాంకు అందించిన వివరాల ప్రకారం అమరావతి రాజధాని ప్రాజెక్ట్ ఈ ఏడాది జనవరి 22న అమల్లోకి వచ్చింది.

ఇందులో భాగంగా తొలి విడతగా 205 మిలియన్ డాలర్ల నిధుల్ని గత నెలలో విడుదల చేశారు. దీంతో కేంద్రం కూడా ఇందులో నుంచి అమరావతి రాజధానికి ఈ నిధులు విడుదల చేసింది. దీంతో అమరావతిలో నిర్మాణాల పునఃప్రారంభానికి ఊతం లభించబోతోంది.

# ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధిద్దాం

● ఆహారపు అలవాట్లతో వ్యాధులు తగ్గించుకోవచ్చు ● ఉప్పు, వంటనూనె, చక్కెర వినియోగం తగ్గిస్తే ఆరోగ్యం పదిలం ● క్యాన్సర్ రోగుల్లో మహిళలే అధికం ● రైతులు పురుగుమందుల వినియోగం తగ్గించాలి, ప్రకృతి సాగు పెరగాలి ● ప్రతి నియోజకవర్గంలో 100 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ● అమరావతిలో మెగా మెడిసిటీని నిర్మాణం, హెల్త్ టూరిజానికి ప్రోత్సాహం ● ఏ జిల్లాలో ఏ రకమైన ఆరోగ్య సమస్యలు ఉన్నాయన్నదానిపై సీఎం చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆహారపు అలవాట్లు, జీవన విధానం మార్పు ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని, ఇందుకోసం ప్రతి రోజూ వ్యాయామం, యోగా, ధ్యానం చేయడంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రోజూ అరగంట వాకింగ్ చేయడం, అలాగే దైవ చింతనతో ఒత్తిడి తగ్గించుకోవచ్చని అన్నారు. మన దేశ వారసత్వ సంపద అయిన యోగాను ఇప్పుడు ప్రపంచమంతా అనుసరిస్తోందని తెలిపారు. పొగాకు, డ్రగ్స్, ఆల్కాహాల్‌ను దూరం పెడితే క్యాన్సర్, లివర్, కిడ్నీ సమస్యలు తగ్గుతాయన్నారు. జంక్ ఫుడ్, పాలిష్ బియ్యం తినడం తగ్గించి మిల్లెట్స్, మొదలైనవి తీసుకోవడంతో పాటు ఆహారంలో పీచు పదార్థం, కూరగాయలు ఎక్కువగా తినాలని సూచించారు. జిల్లాల వారీగా హెల్త్ రిపోర్టులను సోమవారం సచివాలయంలో ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రి మీడియాకు వివరించారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని రూపొందించాలన్నది తమ ఆలోచన అన్న సీఎం...హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ సాధనకు ప్రయత్నిస్తున్నామన్నారు.

**ఉప్పు, నూనె, చక్కెర తగ్గించాలి**

నలుగురు ఉన్న కుటుంబంలో నెలకు 600 గ్రాముల ఉప్పు వాడితే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది. వంటనూనె నెలకు 2 లీటర్లు, చక్కెర 3 కేజీల కన్నా ఎక్కువ వినియోగించకుండా చూసుకోవాలి. వీటిని అధిక మొత్తంలో తీసుకుంటే ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రతి ఒక్కరూ తక్కువ ఆహారం ఎక్కువ సార్లు తీసుకోవాలని ప్రయత్నించాలి. ఉప్పు వినియోగం తగ్గిస్తే 40 శాతం మేర గుండెపోట్లు తగ్గుతాయి. కేరళ ప్రభుత్వం షుగర్ ఫ్రీ స్కూల్ మీల్స్ ప్రకటించింది. తమిళనాడులో రేషన్ షాపుల్లో గ్లూకోజ్ టెస్టులకు స్ట్రిప్స్ ఉచితంగా ఇస్తున్నారు. ఏపీలో క్లీన్ కుక్ స్టవ్ పథకం కింద అందరికీ ఉచితంగా గ్యాస్ స్టవ్ ఇచ్చాం. డెంగ్యూ ప్రూఫ్ హౌసింగ్ మోడల్ కింద సింగపూర్‌లో అక్కడి ప్రభుత్వం ఇళ్లకు ప్రత్యేక పెయింట్ వేసి దోమల బెడద లేకుండా చేస్తోంది. దోమలను నివారిస్తే వ్యాధులను నియంత్రించవచ్చు. ఎన్టీఆర్ ట్రస్ట్ తరఫున న్యూట్రిఫుల్ యాప్ డెవలప్ చేశాం. దీనికి స్కాచ్ అవార్డు కూడా వచ్చింది. ప్రస్తుతం 4 లక్షల మంది ఈ యాప్‌ను అనుసరిస్తున్నారు.

**ఎరువుల మందుల వినియోగం తగ్గాలి**

రైతులు పంటలకు ఎరువులు మందుల వినియోగం తగ్గించాలి. వీటి వాడకం వల్ల పంజాబ్ రాష్ట్రం క్యాన్సర్ కేపిటల్ అయింది. దేశానికి అన్నం పెట్టిన రాష్ట్రం నేడు ఎరువుల మందుల వినియోగంతో అనారోగ్యంపాలైంది. అందుకే మన రాష్ట్రంలోని రైతుల్లో చైతన్యం తెచ్చి ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. పాఠశాల విద్య నుంచే ఆహారపు అలవాట్లపై చైతన్యం తెచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నాం.

**డిజి లాకర్‌లో హెల్త్ రికార్డులు**

ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ల జారీలో ఏపీ ముందంజలో ఉంది. రాష్ట్ర జనాభాలో దాదాపు 88 శాతం మంది ప్రజలకు హెల్త్ అకౌంట్లు రూపొందించాం. కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా డిజిటల్ నెర్వ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. ఫేజ్ 2 లో చిత్తూరు జిల్లా, ఫేజ్ 3లో రాష్ట్రం మొత్తం ఈ విధానాన్ని అమలు చేస్తాం. 26 నెలల్లో ఈ వర్చువల్ ఆసుపత్రులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. హెల్త్ రికార్డులు రూపొందించి డిజిటల్ లాకర్‌లో పెడతాం. ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని నిరంతరం ట్రాకింగ్ చేస్తాం. కాలాన్ని బట్టి వ్యాధులు ఎప్పుడు వస్తాయో ప్రజలకు అలర్ట్ సందేశాలు పంపేలా రూపకల్పన చేస్తాం. మొబైల్ వైద్య వాహనాల ద్వారా ఇంటివద్దే పరీక్షలు చేయిస్తాం. డాక్టర్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా సేవలందిస్తారు. టాటా, గేట్స్ ఫౌండేషన్ సహకారంతో వైద్య రంగంలో ముందుకెళ్తాం. ప్రపంచస్థాయి టెక్నాలజీ, ప్రొఫెసర్లను ఇక్కడికి తీసుకొస్తాం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 100 నుంచి 300 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులను నిర్మిస్తాం. 175 నియోజకవర్గాలకుగాను 70 నియోజకవర్గాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉన్నాయి. లేని 105 నియోజకవర్గాల్లో 100 నుంచి 300 పడకల ఆసుపత్రులను పీపీపీ విధానంలో నిర్మిస్తాం. ఆరోగ్య సేవలను ప్రజలకు దగ్గర చేయడానికి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులను నియోజకవర్గాల్లో నిర్మిస్తాం. పీపీపీ విధానంలో నిర్మించి వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ అందిస్తాం. ఆసుపత్రుల నిర్మాణానికి స్థలంతో పాటు, కొంత రాయితీ ఇస్తాం. మధ్యప్రదేశ్, ఒడిస్సా, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల్లో దీనిపై అధ్యయనం చేసి ఉత్తమ విధానాన్ని తీసుకొస్తాం. దీంతో ప్రతి నియోజకవర్గంలో హెల్త్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఏర్పాటవుతుంది. వ్యాధులకు సంబంధించి దేశ, విదేశాల్లో ఉండే నిపుణులను ప్రభుత్వ సలహాదారులుగా పెట్టుకుంటాం. రాష్ట్రంలోని ఉత్తమ డాక్టర్లను వారికి అనుసంధానం చేసి ప్రతి మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాదికి ఒకసారి సమీక్ష చేస్తాం.



**అమరావతిలో మెగా మెడిసిటీ ఏర్పాటు**

రాజధాని అమరావతిలో పీపీపీ విధానంలో మెగా గ్లోబల్ మెడిసిటీని ఏర్పాటు చేస్తాం. కేంద్రం దేశంలో 25 మెడిసిటీలను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది. అమరావతిలో మెడిసిటీ నిర్మాణంపై కేంద్రంతో సంప్రదిస్తున్నాం. దీనికి 200 ఎకరాలను కేటాయించి అందులో 100 ఎకరాలు హెల్త్ కేర్, సేవలకు 40 ఎకరాలు, రెసిడెన్షియల్‌కు 40 ఎకరాలు, కమర్షియల్‌కు 20 ఎకరాలు ఇచ్చే విధంగా విధానాలు రూపొందించారు. మెడిసిటీ ఏర్పాటుపై ఆరోగ్య శాఖ, సీఆర్డీఏ కలిసి పని చేస్తాయి. హెల్త్ టూరిజానికి కూడా ఈ మెగా మెడిసిటీ ఉపయోగపడుతుంది.

**మహిళల్లోనే హైపర్ టెన్షన్ ఎక్కువ**

హైపర్ టెన్షన్, హార్ట్ స్ట్రోక్‌లు, గుండె వ్యాధుల విషయంలో... తూర్పుగోదావరి, విశాఖపట్నం, గుంటూరు జిల్లాల్లో అత్యంత ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. జీవన విధానం వల్ల వ్యాప్తి చెందే వ్యాధులు ఎక్కువగా కృష్ణా, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో నమోదవుతున్నాయి. వాయు కాలుష్యం, స్మోకింగ్ వంటి కారణాల వల్ల ఆస్తమా, నియోనియో, సీఓపీడీ కేసులు ప్రకాశం, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో అధికంగా ఉన్నాయి. టీబీ, డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు శ్రీకాకుళం, విజయనగరం, కడప జిల్లాల్లో ఎక్కువగా నమోదవుతున్నట్టు గుర్తించారు. హైపర్ టెన్షన్, డయాబెటిస్, తాగునీటిలో టాక్సిన్స్‌తో అనారోగ్యం బారిన పడ్డ వాళ్లు ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలో ఎక్కువగా ఉన్నారు. పొగాకు ఇతర అలవాట్ల కారణంగా సర్వైకల్, బ్రెస్ట్, ఓరల్ క్యాన్సర్ రోగులు గుంటూరు, కృష్ణా, విశాఖపట్నం జిల్లాల్లో ఎక్కువ ఉన్నారు. అనీమియా, ప్రీ టర్మ్ బర్త్, మాల్‌న్యూట్రిషియన్ సమస్యలతో బాధపడేవారు విజయనగరం, శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల్లో ఎక్కువ. ఆల్కహాల్ తీసుకోవడం వల్ల వచ్చే వ్యాధులు, డిప్రెషన్, యాంగ్జయిటీ కేసులు విశాఖపట్నం, విజయవాడ, కడప జిల్లాల్లో ఎక్కువ. వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే చికున్ గున్యా, డెంగ్యూ, మలేరియా కేసులు అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లో ఎక్కువ. అలాగే రోడ్డు ప్రమాదాల వల్ల మరణాలు ఎక్కువగా కృష్ణా, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో చోటు చేసుకుంటున్నాయి.

# పవన్‌కు ఘన స్వాగతం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా డుంబ్రిగూడ మండలం, పోతంగి పంచాయతీ పెదపాడు గ్రామానికి బయలుదేరారు. గిరిజన గ్రామాల అభివృద్ధి నిమిత్తం చేస్తూనే అడవి తల్లి బాట కార్యక్రమానికి పెదపాడు గ్రామంలో శ్రీ పవన్ కళ్యాణ్ శ్రీకారం చుడతారు. అంతకు ముందు విమానాశ్రయంలో విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంద్రప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు, యలమంచిలి శాసన సభ్యులు సుందరపు విజయ్ కుమార్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ కార్పోరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, పార్టీ పీఏసీ సభ్యులు కోన తాతారావు, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ, పార్టీ నేతలు డాక్టర్ సందీప్ పంచకర్ల, శ్రీమతి పసుపులేటి ఉషాకిరణ్, బోడపాటి శివదత్, భీశెట్టి వసంత లక్ష్మి తదితరులు ఘన స్వాగతం పలికారు.

## నర్సింగ్ విద్యాసంస్థల నిర్వహణను
# ప్రక్షాళన చేయాలి

● నూతన హెచ్.పి.సి ఛైర్మన్‌కు మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచన ● అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటు మరియు వాటి నిర్వహణను నియమాలకనుగుణంగా పూర్తిగా ప్రక్షాళన చేయాలని ఆరోగ్య శాఖా మంత్రి శ్రీసత్యకుమార్ యాదవ్ ఆకాంక్షించారు. ఈ విషయాలను పర్యవేక్షించే హైపవర్ కమిటీ కొత్త ఛైర్మన్, మాజీ హైకోర్టు జడ్జి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావుకు మంత్రి ఈ మేరకు సూచించారు. నూతన ఛైర్మన్ గా ఆదివారం నాడు బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ దుర్గాప్రసాదరావు సోమవారం నాడు మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు పలు విషయాలను చర్చించారు. నర్సింగ్ విద్యాసంస్థల ఏర్పాటు మరియు వాటి నిర్వహణకు సంబంధించి పర్యవేక్షణ విషయాల్లో పలు లోపాలు తమ దృష్టికొచ్చాయని మంత్రి వివరించారు. పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగినట్లు ఆరోపణలొచ్చాయని, వాటికి అడ్డుకట్ట వేయాలని మంత్రి శ్రీసత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

**రాష్ట్రంలో దాదావు 560 విద్యా సంస్థల్లో**

ఏడాదికి 30,000 మంది నర్సులు ఉత్తీర్ణులవుతున్నారని, వీరిలో 133 సంస్థలు అనగా మొత్తంలో దాదావు 25 శాతం 2019-2024 కాలంలో ఏర్పాటయ్యాయని మంత్రి వెల్లడించారు. ఈ సమయంలో భారతీయ నర్సింగ్ కౌన్సిల్ నిబంధనలను ఉల్లంఘించి పేరెంట్ హాస్పిటల్ లేకుండానే 28 సంస్థల స్థాపనకు అనుమతించారని, దీని పరిణామాల పట్ల మంత్రి ఆందోళన వ్యక్తంచేశారు. గత పది నెలల కాలంలో కూటమి ప్రభుత్వం కేవలం 15 నర్సింగ్ విద్యాసంస్థల ఏర్పాటుకు మాత్రమే లోతైన పరిశీలన అనంతరం అనుమతించదని తెలిపారు. పేరెంట్ హాస్పిటల్ లేకుండా కొత్త సంస్థల ఏర్పాటు కోసం తనపై ఒత్తిడి వచ్చినా అనుమతించడానికి తిరస్కరించినట్లు మంత్రి శ్రీసత్యకుమార్ యాదవ్ తెలిపారు. చిరునవ్వుతో రోగులకు సేవలందిచాల్సిన నర్సుల పాత్ర ఎంతో ప్రాముఖ్యత కలిగినదని, అటువంటి నర్సులను తయారు చేసే విద్యా సంస్థల ఏర్పాటు, వాటి నిర్వహణలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటే అవాంఛనీయ పరిణామాలు ఎదురువుతాయని, అందువల్ల వాటిని అడ్డుకోవాలని మంత్రి హెచ్.పి.సి. ఛైర్మన్ ను కోరారు. ఈ విషయంలో హెచ్.పి.సికి కూటమి ప్రభుత్వం పూర్తి సహకారాన్నందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. నర్సింగ్ విద్యాసంస్థలలో నాణ్యమైన విద్యను అందించే దిశగా సరైన పర్యవేక్షణ లోపిస్తోందని, ఈ దిశగా పటిష్టమైన చర్యలు చేపట్టాలని మంత్రి శ్రీసత్యకుమార్ యాదవ్ సూచించారు. నర్సింగ్ విద్యాసంస్థల ఏర్పాటు వాటి నిర్వహణకు సంబంధించి హెచ్.పి.సి రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్, డి.యమ్. ఇల మధ్య సరైన సమన్వయంతో మంచి ఫలితాలు సాధించేలా తగు చర్యలు చేపట్టాలని హెచ్.పి.సి. నూతన ఛైర్మన్ కు మంత్రి సూచించారు.

# అభివృద్ధి ప్రధాన మంగళగిరి

● భారీ మెజారిటీతో గెలిపించడం వల్లే పెద్దఎత్తున అభివృద్ధి ● జూన్ నుంచి అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు ప్రారంభిస్తాం ● మీరు నా గౌరవం, పరువు నిలబెట్టారు, మీ కోసం అహర్నిశలు శ్రమిస్తా ● 3వ రోజు మన ఇల్లు మన లోకేష్ కార్యక్రమంలో మంత్రి లోకేష్



మంగళగిరి: భారతదేశంలోనే మంగళగిరిని అభివృద్ధికి చిరునామాగా మారుస్తా, మంగళగిరిని నెం.1గా తీర్చిదిద్దేందుకు ప్రజలందరి సహకారం కావాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మన ఇల్లు మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా యర్రబాలెం డాన్ బాస్కో స్కూలు ఆవరణలో సోమవారం మధ్యాహ్నం తాడేపల్లి మండల పరిధిలోని పెనుమాక, ఉండవల్లి, ఇప్పటం ప్రజలకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... నివసిస్తున్న ప్రాంతంలోనే పట్టాలు ఇవ్వాలన్నది దశాబ్దాలుగా మీ అందరి కల. గతంలో ఒక్కొక్కరికి జిరాక్స్ పేపర్లకే 10వేలకు పైగా ఖర్చయ్యాయి, చెప్పులరిగాయి. ఇవన్నీ చూసి మీకు పట్టాలిప్పిస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చాను. ఇక్కడ మూడురకాల భూములున్నాయి. తొలివిడతలో 3వేలమంది పట్టాలిస్తున్నాం. 2వ విడతలో ఎండోమెంట్, రైల్వే భూముల్లో నివసించేవారికి పట్టాలిస్తాం. అటవీ, ఇరిగేషన్ భూములు టైం పడుతుంది, 3వవిడతలో అందజేస్తాం. ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన 10నెలల్లోనే గౌరవంగా మీకు ఇంటిపట్టాలు అందజేస్తున్నా. ఇచ్చిన మాట ప్రకారం 3వేలమందికి బట్టలుపెట్టి మరీ పట్టాలను అయిదురోజులపాటు నిలబడి ఇస్తున్నా, అది మీపై నాకున్న చిత్తశుద్ధి, కమిట్ మెంట్.

**ఆ నిర్ణయమే నా జీవితాన్ని మార్చేసింది**

ఒక నిర్ణయం జీవితాన్ని మార్చేస్తుందని పెద్దలు అంటారు, నా జీవితాన్ని కూడా ఒక నిర్ణయం మార్చేసింది. ఆ నిర్ణయమే మంగళగిరిలో పోటీచేయడం. 2019 ఎన్నికల్లో 21రోజుల ముందు టిడిపి అభ్యర్థిగా మీ ముందునిలబడ్డా... ఒకరినొకరు అర్థం చేసుకునేలోపే ఎన్నికలైపోయాయి, 5300 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యా... మొదటిరోజు బాధ కలిగింది. రెండోరోజు నుంచి నాలో కసి పెరిగింది. మంగళగిరి ప్రజలకు సేవచేయాలి, మంగళగిరి ప్రజల మనసు గెల్చుకోవాలన్న లక్ష్యంతో ఆనాటి నుంచి పనిచేశా. మీ ఆరోగ్యం కోసం ఎన్టీఆర్ సంజీవని పథకాన్ని ప్రవేశపెట్టాం, ఈరోజుకు కూడా ఉచితంగా మందులు ఇస్తున్నాం. మహిళలు సొంతకాళ్లపై నిలబడేందుకు కుట్టుశిక్షణ ఇచ్చి, మిషన్లు అందజేసి పని కల్పిస్తున్నాం. పిల్లలు ఆడుకునేందుకు సొంత నిధులతో క్రీడాప్రాంగణం ఏర్పాటుచేయడంతోపాటు మంగళగిరి ప్రీమియం లీగ్ కూడా ప్రవేశపెట్టాం. ఊళ్లలో పేద ఇళ్లలో పెళ్లిళ్లకు జరిగితే బట్టలు పెట్టాం. కోవిడ్ సమయంలో ఆక్సిజన్, మందులు అందజేశాం. అమెరికా డాక్టర్లతో టెలిమెడిసిన్ అందజేశాం. ఇలా 26 సంక్షేమ కార్యక్రమాలు చేశాను.

**భారీ మెజారిటీ వల్లే చర్చ లేకుండా ఆమోదం**

రచ్చబండలో మీ అందరికీ చెప్పా, నేను ఓడిపోయిన సంఖ్యలో పదిరెట్ల మెజారిటీ 53వేలతో గెలిపించండి, మీ కోసం పోరాడతాను, మీరిచ్చే మెజారిటీ కొండంత బలం ఇస్తుందని చెప్పా. మంగళగిరి అభివృద్ధి కోసం బాబు, పవనన్న తో పోరాడతానని హామీ ఇచ్చా. భారీ మెజారిటీతో గెలిపించబట్టే ఈరోజు నేను తీసుకెళ్లే ప్రతిపాదనలకు ఎటువంటి చర్చలేకుండా ఆమోదం తెలుపుతున్నారు. 2వ కేబినెట్ మీటింగ్ లోనే వందపడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి అప్రూవల్ వచ్చింది, ఈనెల 13వతేదీన ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నాం.

**మీ దెబ్బకు అవతలి నుంచి సౌండ్ లేదు**

నేను ఓడిపోయినవుడు అందరూ ఎగతాళి చేశారు. ఇటీవల ఎన్నికల్లో మీరు కొట్టిన దెబ్బకు అక్కడనుంచి సౌండ్ లేదు. ఎన్నికలవుడు అందరూ సర్వేలు చేస్తారు. టిడిపిలో సర్వేలో కూడా కుప్పంకంటే మంగళగిరి వెనకబడి ఉంది. ఎన్నికలయ్యాక బాబును కలిశా, మీకన్నా ఒక్క ఓటు అయినాఎక్కువ వస్తుందని చెప్పా. చెప్పినట్లే అత్యధికంగా 91వేల మెజారిటీతో గెలిచా. ఇంటిపట్టాలతో పాటు భూగర్భ డ్రైనేజి, నీరు, భూగర్భ గ్యాస్, కరెంటు కార్యక్రమాలు కూడా చేపట్టాం, టెండర్లు నడుస్తున్నాయి. జూన్ నుంచి పనులు ప్రారంభమవుతాయి. నియోజకవర్గ వ్యాప్తంగా పార్కులు, చెరువులు అభివృద్ధి చేయాలని నిర్ణయించా. 8వతేదీన మొదటి పార్కు మంగళగిరిలో ప్రారంభిస్తున్నా. మంగళగిరి నియోజకవర్గంలో 45 పార్కులు, 35 కమ్యూనిటీ హాళ్లు నిర్మించబోతున్నాం, 6చెరువులు అభివృద్ధి చేయబోతున్నాం. లక్ష్మీనరసింహస్వామి గుడిని కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. మహాప్రస్థానం పేరుతో శ్మశానాలు కూడా అభివృద్ధి చేస్తున్నాం. పద్ధతి ప్రకారం చేయాలనే ఉద్దేశంతో ఆచితూచి అడుగులు వేస్తున్నాం.

**మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా**

మంగళగిరిలో ప్రత్యేకహామీలు ఇచ్చాను, ఒక్కొక హామీ నెరవేరుస్తూ వెళ్తున్నా. మంగళగిరి వృణ్యమా అని రాష్ట్రమంతటా అభివృద్ధి చెందుతోంది. మంగళగిరి కోసం నేను రూపొందించిన శాశ్వత పట్టాల పంపిణీ కార్యక్రమం రాష్ట్రమంతటా అమలుచేసే పరిస్థితి వచ్చింది. అన్ని నియోజకవర్గాల్లో శాసనసభ్యులతో వత్తిడి పెరిగిందని రెవిన్యూ మంత్రి చెప్పారు. మీ పట్టాలు రెగ్యులరైజ్ చేస్తామని నేను చెప్పినవుడు అవుతుందా,లేదా అని మీరు అనుమానపడి ఉండవచ్చు. చిత్తశుద్ధితో మీ కోసం పనిచేశాం. టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, అధికారులు మీ వద్దకు వచ్చి కొలతలు తీసుకున్నారు. ఎవరి వద్దా ఒక్క టీకానీ, ఒక బాటిల్ నీళ్లుకానీ తాగలేదు. ఒక్కరూపాయి తీసుకోకుండా 3వేల కుటుంబాలకు వెయ్యికోట్ల విలువైన భూములకు శాశ్వత హక్కు కల్పిస్తున్నాం. ఇది ఎన్ డిఏ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి. ప్రజలంతా దీనిని గుర్తుపెట్టుకోవాలి. భారీ మెజారిటీతో గెలిపించి నాపై బాధ్యత పెంచారు. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా.

**నెం.1గా మార్చేందుకు ప్రజల సహకారం కావాలి**

స్వచ్ఛ మంగళగిరి పేరుతో కార్యక్రమం చేపట్టాం. ప్రతిరోజు పారిశుద్ధ్య కార్మికులు ప్రతిగడపకు వచ్చి చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. ఎంటిఎంసి పరిధిలో వెయ్యిటన్నుల చెత్త బయటకువచ్చింది. చెత్త రోడ్లపై వేయొద్దని ప్రజలను కోరుతున్నా. స్వచ్ఛతలో మంగళగిరి నెం.1 కావాలి. ఒక ఏడాది ఓపికపడతా., ఆ తర్వాత నేను చెత్తవేసినవారిని ఇంటికివెళ్లి చెత్తఎత్తుతా. అన్నిరంగాల్లో మంగళగిరిని నెం.1గా మార్చేందుకు ప్రజల సహకారం కావాలి. మీకోసం అహర్నిశలు కష్టపడతా, ఆదర్శంగా తీర్చిదిద్దుతా. నా గౌరవం నిలబెట్టారు, పరువు కాపాడారు. అందుకే మంగళగిరి ప్రజలను నా గుండెల్లో పెట్టుకొని చూసుకుంటా, మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడతానని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. మేము ఉండవల్లి కొండవాలు ప్రాంతంలో 22సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాం. ఎన్నికల సమయంలో లోకేష్ బాబు మా ప్రాంతానికి వచ్చినవుడు పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చారు. అయితే ఇంతత్వరగా ఆయన మాకు పట్టాలు ఇస్తారని ఊహించలేదు. కాయకష్టం చేసుకుని జీవించే మాకు లోకేష్ ఒక ఆస్తి కల్పించారు. ఆయన చేసిన సాయాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాం. గతంలో ఎప్పుడు మమ్మల్ని వెళ్లిపొమ్మంటారోనని భయం వేసేది. లోకేష్ మంగళగిరి ఎమ్మెల్యే అయ్యాక ఎంతో మార్పు వచ్చింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్నో మంచి పనులు చేస్తున్నారు. పట్టాల గురించి గతంలో ఎంతోమందిని ఎన్నిసార్లు అడిగినా ప్రయోజనం లేకపోయింది. మా చిరకాల కోరిక నెరవేరినందుకు ఆనందంగా ఉంది. లోకేష్ బాబుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నాం. ఉండవల్లి కొండప్రాంతంలో నివసిస్తున్న మా కుటుంబాలు 40ఏళ్లుగా పట్టాల కోసం ఎదురుచూస్తున్నాయి. మేం నివసించే ప్రాంతంలో పట్టాలు కావాలన్నది చిన్నప్పటి నుంచి మా పెద్దల కల. లోకేష్ బాబు మా చిరకాల కోరిక నెరవేర్చారు. 40ఏళ్లకలను లోకేష్ 10నెలల్లో నెరవేర్చారు. మాకు నోట మాటరావడం లేదు. గతంలో ప్రజాప్రతినిధులను పట్టాలు అడిగితే కొంత ప్రాంతంలో సాధ్యం కాదని చెప్పారు. లోకేష్ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించారు. మాకు స్వయం ఉపాధి కోసం స్త్రీశక్తి పథకం ద్వారా కుట్టు శిక్షణ ఇచ్చి మిషన్లు కూడా అందజేశారు. అన్నివిధాలా లోకేషన్న మాకు అండగా నిలుస్తున్నారు. లోకేష్ లాంటి వ్యక్తి మా ఎమ్మెల్యే కావడం గర్వంగా ఉంది.

# పేరు గొప్ప- ఊరు దిబ్బ



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీలో ఆరోగ్య శ్రీ సేవలు అందకుండా ఒక్కరు చనిపోయినా, వాటిని కూటమి ప్రభుత్వ హత్యలుగానే భావిస్తామని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. సోమవారం విజయవాడలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..ఏపీలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు ఇవాళ్టి నుంచి నిలిచిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు దాదావు రూ.3,500 కోట్లు బకాయిలు పెట్టిందని, దీంతో ఆస్పత్రులు నడపలేక వైద్య సేవలు నిలిపేస్తున్నట్లు ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రకటించిందన్నారు. రూ.3500 కోట్ల బకాయిలపై ఇటీవల జిల్లా కలెక్టర్లకు ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. . ఈ నేపథ్యంలో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు. పేరుకు రైజింగ్ స్టేట్ అని.. కానీ వైద్య సేవలకు దిక్కులేదన్నారు. పేదోడి ఆరోగ్యానికి రాష్ట్రంలో భరోసా లేదని ఆరోపించారు. ప్రజారోగ్యంపై కూటమి ప్రభుత్వానిది అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఆరోగ్య శ్రీ సేవల కింద రూ.3500 కోట్లు పెండింగ్ పెట్టడం నిజంగా సిగ్గుచేటన్నారు. హెచ్ 1బీ, ఎఫ్1 వీసాదారులు, గ్రీన్ కార్డు దరఖాస్తుదారులకు ట్రంప్ మరో షాక్..! గత 9 నెలలుగా పూర్తి స్థాయిలో బకాయిలు విడుదల చేయకుండా.. వైద్య సేవలు ఆపేదాకా చూడటం అంటే.. ఆరోగ్యశ్రీ పై సర్కారుకున్న చిత్తశుద్ధి ఏంటో అర్థమౌతుందన్నారు. పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగమే ఇదంతా అని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుంచే ఆరోగ్యశ్రీ అనారోగ్య శ్రీగా మారిందన్నారు. పేదోడికి వైద్యం అందని ద్రాక్ష అయ్యిందని విమర్శించారు. వైద్య సేవలను విస్తృత పరుస్తామని, వైద్యానికి గ్లోబల్ సిటీగా చేస్తామని గొప్పలు చెప్పే చంద్రబాబు . ముందు ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయాలని ఆమె కోరారు.


# దేశంలోనే అతిపెద్ద రైల్వే స్టేషన్

● అమరావతికి మహర్దశ ● రెండు దశల్లో కొత్త రైల్వే లైన్ ప్లానింగ్

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే అతి పెద్ద రైల్వే స్టేషన్ ప్లాన్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర రాజధాని అమరావతిని ఆధునిక సౌకర్యాలతో నిర్మించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు రూపొందించారు. అమరావతి రైల్వేస్టేషన్‌ను దేశంలో అత్యంత ఆధునికంగా నిర్మించనున్నారు. రెండో దశలో 56.53 కి.మీ. రైల్వేలైన్ నిర్మాణం చేపట్టనున్నారు. రైల్వేశాఖ వచ్చే రెండు నెలల్లో టెండర్లకు ఆహ్వానిస్తుంది. 2024 జూన్ తర్వాత పనులూ్దలవుతాయి.

**అమరావతి కొత్త రైల్వే స్టేషన్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతిలో పనులు చేపట్టేందుకు నిధులతో పాటుగా రోడ్లు, రైల్వే లైన్ సహా అన్ని విధాలుగా కేంద్రం సహకారం తీసుకుంటోంది. ఈ మేరకు అమరావతికి రైల్వే లైన్‌కు కూడా గ్రీన్ సిగ్నల్ రాగా.. ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం నుంచిగుంటూరులోని నంబూరు వరకు 57 కిలోమీటర్ల మేర కొత్త రైలు మార్గం రానుంది. ఈ మేరకు రూ.2,245 కోట్లు ఖర్చు అవుతుంది. ఈ కొత్త రైలు మార్గంతో అమరావతి నగరాన్ని హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, చెన్నై నగరాలతో అనుసంధానం చేస్తారు. అయితే అమరావతికి సంబంధించి కొత్త రైల్వే స్టేషన్‌ను గట్టిగానే ప్లాన్ చేస్తున్నారు. దేశంలోనే అతిపెద్ద రైల్వే స్టేషన్‌ను అమరావతిలో నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. అమరావతి నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడంతో పాటుగా రోడ్డు, రైలు, విమాన మార్గాల ద్వారా అనుసంధానం చేయాలని చూస్తోంది. అన్ని రంగాల్లోనూ ప్రత్యేకత చాటుకునేలా మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్‌ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలనే ఆలోచనలో ఉన్నారు. నెక్కల్లు-పెదపరిమి దగ్గర దేశంలోనే అతిపెద్ద రైల్వే స్టేషన్‌ను నిర్మించాలని భావిస్తున్నారు. దాదావు 1500 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం రైల్వే శాఖకు ఇవ్వాలని భావిస్తోందట. అమరావతి రైల్వే లైన్‌ను రెండు దశల్లో పూర్తి చేయాలని రైల్వేశాఖ నిర్ణయించగా.. తొలి దశలో ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం నుంచి 27 కిలోమీటర్ల లైన్‌ను నిర్మిస్తారు. దీనికోసం రెండు నెలల్లో టెండర్లు పిలవనున్నారు. మొదటి దశలోనే దాములూరు-వైకుంఠవురం మధ్య కృష్ణా నదిపై 3.2 కిలోమీటర్ల రైల్వే బ్రిడ్జిని నిర్మిస్తారు.. దీనికోసం రూ.800 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. తాడికొండ మండలంలో కొందరు రైతులు భూమి ఇవ్వడానికి అభ్యంతరం చెప్పడంతో భూసేకరణ ఆలస్యమవుతోంది. అమరావతి రైల్వే స్టేషన్‌ను అమరావతి నగర శివారులో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారట. దేశంలోనే ఒక మోడల్ రైల్వే స్టేషన్‌గా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించాలని సీఎం చంద్రబాబు ఆలోచన చేస్తున్నారట. దేశంలో ప్రయాగరాజ్, వారణాసి, ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ రైల్వే స్టేషన్లు చాలా అందంగా ఉన్నాయి. వాటికి దీటుగా అమరావతి రైల్వే స్టేషన్ ఉండబోతుంది అంటున్నారు. అలాగే అమరావతికి దగ్గరలోనే ఒక పెద్ద గూడ్స్ యార్డును కూడా ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ ఆలోచిస్తోందట. ఈ రైల్వే లైన్‌లో కొత్తగా ఏర్పడుతున్న ఎన్టీఆర్ జిల్లా పరిటాల స్టేషన్ దగ్గర మల్టీమోడల్ కార్గో టెర్మినల్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తారు. ప్రైవేటు సంస్థల సహాయంతో ఈ టెర్మినల్‌ను అభివృద్ధి చేస్తారని చెబుతున్నారు. దీని ద్వారా చాలా మందికి ఉద్యోగాలు వస్తాయని భావిస్తున్నారు. ఈ లైన్‌లో కవచ్ టెక్నాలజీని



ఏర్పాటు చేస్తారు.. రైళ్లు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో వెళ్లేలా అమరావతి రైల్వే లైన్‌ను ప్లాన్ చేస్తున్నారట. అమరావతి కొత్త రైల్వే లైన్ ఖాజీపేట-విజయవాడ సెక్షన్‌లో ఉన్న ఎర్రుపాలెం నుంచి గుంటూరు-విజయవాడ సెక్షన్ మధ్య ఉన్న నంబూరు వరకు 57 కిలోమీటర్ల మేర కొత్త బ్రాడ్‌గేజ్ సింగిల్ రైల్వే లైన్‌గా నిర్మించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఎర్రుపాలెం-నంబూరు మధ్య పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావూరు స్టేషన్లను కొత్తగా ఏర్పాటు చేస్తారు. వీటిలో పెద్దాపురం, పరిటాల, కొప్పురావూరు పెద్ద స్టేషన్లుగా, అమరావతి స్టేషన్ అతిపెద్దదిగా ఉంటాయి. ఎన్టీఆర్ జిల్లా దాములూరు, గుంటూరు జిల్లా వైకుంఠవురం మధ్య కృష్ణా నదిపై 3.2 కిలోమీటర్ల పొడవున రైల్వే బ్రిడ్జిని నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టును నాలుగేళ్లలో పూర్తి చేయాలని భావిస్తున్నారట.. ఈ రైల్వే లైన్ కోసం ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు మొత్తం 521.22 ఎకరాలను రైల్వేశాఖ సేకరించింది. తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో 24.01 ఎకరాలను, గుంటూరు జిల్లాలో 199.71 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లాలో 297.21 ఎకరాలను 2013 భూసేకరణ చట్టం ప్రకారం సేకరించారు.

# సందర్శకుల కోసం వసతి గృహాలు

ఏపీ, స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిది : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.. విజయవాడలో సరికొత్త ఆలోచనను అమలు చేస్తోంది. ఉపాధి, ఉద్యోగం, ఇతర పనులపై విజయవాడకు వచ్చి ఇబ్బంది పడుతున్న వారి కోసం ప్రభుత్వం మంచి సదుపాయం కల్పిస్తోంది. ఆశ్రయం లేని నిరుద్యోగుల కోసం మున్సిపల్ కార్పొరేషన్ 4 చోట్ల వసతి గృహాలు (హాస్టల్స్ లాంటివి) ఏర్పాటు చేసింది. కేవలం ఆధార్ కార్డు ఉంటే చాలు, రూపాయి ఖర్చు లేకుండా అక్కడ ఆశ్రయం పొందొచ్చు. అక్కడ భోజనం, టీవీ, యోగా లాంటి సౌకర్యాలు కూడా అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ విషయం కొందరికే ఈ తెలుసు అంటున్నారు. సరైన ప్రచారం లేకపోవడంతో చాలా మంది ప్రైవేటు లాడ్జీల్లో డబ్బులు ఖర్చు చేసి మరీ ఉంటున్నారు. ఏపీ ప్రభుత్వం జాతీయ పట్టణ జీవనోపాధుల పథకం కింద ఈ వసతి గృహాలను ఏర్పాటు చేశారు. విజయవాడలోని విద్యాధరవురం, రాణిగారితోట, గాంధీనగర్, వెహికల్ డిపో ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఒక్కో వసతి గృహంలో వంద పడకలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడికి వచ్చిన వారు ఒక్క ఆధార్ కార్డు చూపిస్తే చాలు రూపాయి కూడా తీసుకోకుండానే అక్కడ ఆశ్రయం పొందొచ్చు అని అధికారులు తెలిపారు. అలాగని రోజుల తరబడి అక్కడే ఉంటామంటే కుదరదండోయ్.. ఉపాధి, ఏదైనా ఉద్యోగ దొరికే వరకు మాత్రమే అక్కడ ఉండొచ్చు. ఈ వసతి గృహాల్లో పడుకోవడానికి మంచం, దుప్పట్లు అందజేస్తారు. అక్కడ మరుగుదొడ్లు, స్నానాల గదులు కూడా ఉంటాయి. ఉదయం టిఫిన్, రాత్రి భోజనం కూడా అందిస్తారు. అంతేకాదండోయ్ అక్కడ టీవీ కూడా చూసే అవకాశం ఉంది. ఎవరికైనా ఆసక్తి ఉంటే అక్కడ ధ్యానం, యోగా నేర్పిస్తారు. అక్కడ అవసరమైతే వైద్య పరీక్షలు కూడా నిర్వహిస్తారు.



## ఏపీకి గుడ్ న్యూస్!

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : భారతదేశ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో దేశంలో మరో మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ నిర్మాణానికి కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం అనువైన ప్రాంతంగా ఆంధ్రప్రదేశ్ను ఎంచుకుంది. ఇందులో భాగంగానే 2011లో ఏపీకి ఈ ప్రాజెక్టును కేటాయించింది. అప్పట్లోనే ఈ మిస్సైల్ సెంటర్ నిర్మాణానికి కృష్ణా జిల్లాలోని నాగాయలంక మండలం గుల్లలమోద గ్రామం అనువైన ప్రాంతంగా కేంద్రప్రభుత్వం గుర్తించింది. ఈ గ్రామం సముద్రతీర ప్రాంతంలో ఉండటం, గ్రామం చుట్టుపక్కల 6-8కిలోమీటర్ల మేర ఎలాంటి జనావాసాలు లేకపోవడంతో మిస్సైల్ టెస్టింగ్ ప్రయోగాలకు ఈ గ్రామం అనుకూలంగా ఉంటుందనే భావనకు వచ్చారు. అయితే అప్పుడే ప్రాజెక్టుకు భూమిని కేటాయించాలని డీఆర్డీవో అధికారులు కోరగా ..రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇది కాస్తా ఆలస్యమైంది. ఇక ఏపీ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తర్వాత 2017లో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం 300 ఎకరాలకుపైగా భూమిని డీఆర్డీవో కు కేటాయించింది. అయితే పర్యావరణ అనుమతులు మరియు ఇతర అడ్డంకుల కారణంగా కొన్నేళ్లపాటు ఈ ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యమైంది. దీంతో 2019లో పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు లభించడంతో 2021లో ఆ స్థలాన్ని డీఆర్డీవో స్వాధీనం చేసుకొంది. ప్రాజెక్టుకు కేటాయించిన ప్రాంతం చుట్టూ ప్రహరి గోడను నిర్మించింది. కానీ ఇప్పటి వరకు ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన మాత్రం జరగలేదు. అయితే ఈ ఏడాది జనవరిలోనే ప్రధాని మోదీ విశాఖ పర్యటనలో ఈ కేంద్రానికి వర్చువల్గా శంకుస్థాపన చేయించడానికి అన్ని ఏర్పాట్లు చేయగా.. చివరి నిమిషంలో రద్దైనట్లు అధికారులు తెలిపారు. ఇది ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు కావడంతో ప్రధాని మోదీయే స్వయంగా వచ్చి శంకుస్థాపన చేస్తారని తెలుస్తోంది. అయితే అమరావతి నిర్మాణ పనుల శంకుస్థాపనతో పాటు ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను కూడా మోదీ ప్రారంభించనున్నట్టు సమాచారం. ఇది షార్ట్-రేంజ్ మరియు లాంగ్-రేంజ్ క్షిపణుల పరీక్షలకు సహాయపడుతుంది, దీనివల్ల భారత రక్షణ రంగంలో స్వావలంబన మరియు సాంకేతిక పురోగతి సాధ్యమవుతుంది. ఈ ప్రాజెక్టు స్థానికంగా ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని ఏపీ ప్రజలు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

# అడవి బిడ్డలకు అండగా కూటమి ప్రభుత్వం

**● ఓట్లు, సీట్లు మాకు ముఖ్యం కాదు ● గిరిజనుల సంక్షేమమే మా ప్రభుత్వ ఆశయం ● 2018లో ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు రోడ్ల పరిస్థితి చూసి ఆవేదన చెందా ● మూడు నెలల క్రితం రోడ్ల అభివృద్ధికి మళ్లీ వస్తానన్న మాటతో అడవితల్లి బాటతో మీ ముందుకి వచ్చాను ● వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఏజెన్సీ అభివృద్ధి కోసం రూ. 92 కోట్లు ఖర్చు చేసింది ● కూటమి ప్రభుత్వం ఏడాదిలోపే రూ. 1,005 కోట్లు మంజూరు చేసింది ● అడవితల్లి రుణం తీర్చుకోవడానికి ఏం చేయాలన్న ఆలోచనతోనే అడవితల్లి బాట కార్యక్రమం ● గిరిజన ప్రాంతాల యువత గంజాయి సాగు వీడి పర్యాటకం వైపు దృష్టి పెట్టండి ● గిరిజనులకు అండగా నిలబడే ప్రభుత్వం మాది ● అరకు నియోజకవర్గం, డుంబ్రీగూడలో అడవితల్లి బాట మొదటి దశ కార్యక్రమం ప్రారంభించి, ప్రసంగించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : అడవినే నమ్ముకున్న గిరిపుత్రుల గురించి మనసుతో ఆలోచిస్తాం. వారి అభివృద్ధి, అభ్యున్నతి కోసం నిత్యం తపిస్తాం. మాకు ఓట్లు, సీట్లు ముఖ్యం కాదు. గిరి పుత్రుల సంపూర్ణ అభివృద్ధి, జీవనశైలి పెంపుదల ముఖ్యం అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు అన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో గిరిజనుల అభివృద్ధికి రూ. 92 కోట్లు ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోపే రూ.1005 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కేవలం మాటలు చెప్పి శంకుస్థాపన ఫలకాలు వేసి వెళ్లిపోవడం కాదని, వారం రోజుల్లోనే పనులు మొదలయ్యేలా, సకాలంలో పనులు పూర్తయ్యేలా చూసే బాధ్యతను తీసుకుంటామని పునరుద్ఘాటించారు. ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజన గ్రామాల అనుసంధాన రోడ్లను నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపట్టిన అడవితల్లి బాట కార్యక్రమాన్ని సోమవారం అరకు నియోజకవర్గం, డుంబ్రీగూడలో శ్రీ పవన్ కళ్యాణ్ గారు ప్రారంభించారు. రూ. 1,005 కోట్లతో గిరిజన గ్రామాలను కలుపుతూ నిర్మించబోతున్న 558 రోడ్లకు సంబంధించి మొదటి దశలో పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించారు. అడవితల్లి బాట కార్యక్రమం గిరిజన గ్రామాల రూపురేఖలు మార్చే వరకు నిరంతరం కొనసాగనుంది.

ఈ కార్యక్రమానికి శంకుస్థాపన అనంతరం శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ... నేను మాటమీద నిలబడే మనిషిని. గిరిజనులు అంటే ఓట్లు.. సీట్లు అని ఎప్పుడూ చూడను. అడవి అంటే నాకు ప్రాణం. పచ్చని చెట్లను చూస్తే మనసు పులకిస్తుంది. అడవిని నమ్ముకుని బతికే గిరిబిడ్డల బతుకులను చూస్తే ఆవేదన కలుగుతుంది. 2018 పోరాట యాత్ర సమయంలో అరకులో వారం రోజుల పాటు పర్యటించాను. ఆ సమయంలో అడవి బిడ్డల కోసం ఏదైనా చేయాలని బలంగా సంకల్పించాను. వీరి వెతలు తీర్చేందుకు అధికారం ఉంటే బాగుంటుందని, గిరిపుత్రుల కోసం అధికారం ఇవ్వమని దేవుళ్లను కోరాను. అనుకున్నట్లే ప్రజలు బలమైన నమ్మకంతో 164 సీట్లు కూటమికి కట్టబెట్టి అధికారంలో నిలబెట్టారు. మీరు పెట్టిన ఈ పెద్ద బాధ్యతను అంతే శ్రద్ధతో నిర్వర్తించాలని అనుక్షణం భావిస్తాను. మూడు నెలల క్రితం ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించినపుడు రోడ్ల నిర్మాణం విషయంలో అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళికతో వస్తానని మాటిచ్చాను.

**గత ప్రభుత్వం నిధులను అడ్డగోలుగా వాడేసింది**

గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సరైన రోడ్లు ఉండాలి. గిరిజన గ్రామాలు మారుమూల ప్రాంతాల్లో తక్కువ మంది జనాభాతో ఉంటాయి. వాటిని అనుసంధించాలనే గొప్ప సంకల్పంతో గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జన్ మన్ కార్యక్రమం తీసుకువచ్చింది. 500 జనాభా లోపు ఉన్న గ్రామాలకు కూడా అనుసంధాన రహదారులు వేయాలన్న గొప్ప సంకల్పానికి ప్రధాన మంత్రి జన్ మన్ కార్యక్రమం ఉపయోగపడుతుంది. ప్రభుత్వంలో నిధులు లేని సమయంలో కూడా గత ప్రభుత్వం ఉన్న నిధులను అడ్డగోలుగా వాడేశారు. లెక్కా పత్రం లేకుండా నిధులను పక్కదోవ పట్టించారు.

**అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి గారు**

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి దగ్గరకు వెళ్లి నేను అడిగిన పని పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో గిరిజనుల గ్రామాల అభివృద్ధికి రోడ్లు వేయాలని కోరాను. అడిగిన వెంటనే గౌరవ ముఖ్యమంత్రి రూ. 49 కోట్లు ఇవ్వడం చాలా సంతోషం కలిగించింది. అడవితల్లిబాటకు ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు గారు బలం ఇచ్చారు.

నేను ఓట్ల కోసమో.. రాజకీయం చేయడం కోసమో ఇక్కడికి రాలేదు. ఓట్ల కోసం రాజకీయం కోసం అయితే స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ పేర్లు చెప్పేవాడిని కాదు. పార్టీలు, ప్రభుత్వాలు మారుతూ ఉంటాయి. పార్టీల మధ్య వైరుధ్య భావాలు ఉండడం సహజం. అలా సిద్ధాంత బేధాలు ఉన్నంత మాత్రాన శత్రువులు అయిపోరు. ప్రజల అభివృద్ధి కోసం కూర్చుని మాట్లాడుకుంటే చాలా పనులు అవుతాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రాష్ట్రంలోని 13,326 పంచాయతీలకు జాతీయ పండుగల నిర్వహణకు సంబంధించిన నిధులను పెంచాం. గత ప్రభుత్వంలో ఎన్నికయిన గ్రామాల సర్పంచులు అని చూడకుండా ఆ నిధులను మంచి కోసం వారికి అందించాం. ఇది మా చిత్తశుద్ధికి నిదర్శనం. అరకు వస్తున్న సమయంలో చుట్టూ కొండలు, లోయలు, టేకు మొక్కలు, జీడి తోటలు,రిసార్టులు, గిరిజన గృహాలు, పచ్చదనం చిగురిస్తున్న అందాలు కనిపించాయి. అడివితల్లికి ఏదో చేయాలన్న ఆలోచన నుంచి పుట్టిన కార్యక్రమమే అడవితల్లి బాట కార్యక్రమం. అరకు ప్రాంతం ఒక అద్భుతం. టూరిజం పూర్తి స్థాయిలో ఇక్కడ అభివృద్ధి చెందాలి. దేశం మొత్తం అరకు వైపు చూసేలా ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలి. కూటమి ప్రభుత్వం అడవితల్లిబాటలో చేపట్టిన పనులు వారంలో ప్రారంభం అవుతాయి. అతి త్వరలో పూర్తవుతాయి. మారుమూల గిరిజన గ్రామాలను సైతం అనుసంధానం చేసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. రాష్ట్రంలో 2,605 గిరిజన ఆవాసాలు ఉంటే వాటిలో 1,177 ఆవాసాలకు రోడ్డు కనెక్టివిటీ లేదు. ప్రస్తుతం అడవితల్లిబాట కార్యక్రమంలో 1,069 ఆవాసాలకు రోడ్డు కనెక్టివిటీ చేస్తున్నాం. మిగిలిన గ్రామాలకు కూడా సమీపకాలంలో పూర్తి చేస్తాం.

**మాకు తన మన బేధం లేదు**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా నిధులను ఖర్చు చేయడంలో బాధ్యతగా ఉంటాం. ఎక్కడ నిధులు ఖర్చు చేయాలి. ఎక్కడ లేదు అన్నది పూర్తిగా పరిశీలన చేశాకే ఖర్చు చేస్తాం. మీరు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయం. ఓట్లు వేసిన వారు తరతమ బేధం కూటమి ప్రభుత్వానికి లేదు. మీరు మా వాళ్లు. మిమ్మల్ని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం. పెదపాడు గ్రామానికి వెళ్లిన తర్వాత అక్కడ ప్రజలు కొన్ని సమస్యలు నా దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే వాటికి పరిష్కారంగా 12 పనులను మంజూరు చేశాం. అరకు ప్రాంతంలో యువత గంజాయి సాగు వైపు మళ్లవద్దు. గంజాయి తీసుకోవడానికి అలవాటు పడవద్దు. గంజాయ సమస్యను కూటమి ప్రభుత్వం సామాజిక, ఆర్థిక సమస్యగా భావిస్తోంది. కక్ష సాధింపులు ఏ మాత్రం లేకుండా గంజాయి నిర్మూలనకు నడుం బిగించాం. గంజాయి సాగువల్ల నేరాల్లో ఇరుక్కుంటే, దాన్ని వాడడం వల్ల ఆరోగ్యం నష్టపోతారు. స్థానికంగా ఉన్న యువత పర్యాటకం వైపు దృష్టి సారించండి. దీనిలో అపార అవకాశాలు ఉన్నాయి. చాపరాయి దగ్గర బ్రిడ్జి కావాలని కోరారు. పర్యావరణ అనుకూల బ్రిడ్జిని ఇక్కడ నిర్మించాలి. దానికి ఒక చక్కటి పరిష్కారం వెతుకుదాం. నాకు సమయం ఇవ్వండి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏజెన్సీ ప్రాంతాల్లో డోలీ మోతల కష్టం తప్పుతోంది. అనంతగిరి మండలం, పొలంగూడ గిరిజన గ్రామంలో బీటీ రోడ్డు వేయడంతో ఆ గిరిజన గ్రామంలో అంబులెన్స్ కూత మొదటి సారి వినిపించింది. ఈ అభివృద్ధి కార్యక్రమాల వల్ల మా కూటమి ప్రభుత్వానికి డబ్బులు వస్తాయనో ఓట్లు వస్తాయనో కాదు. మీ కష్టం కూటమి ప్రభుత్వ కష్టంగా భావిస్తోంది. కూటమి ప్రభుత్వం మీకు అండగా నిలబడుతుంది. ప్రజలతో మమేకమై తిరిగితే గిరిజనుల బాధలు, వేదనలు తెలుస్తాయి. నేను కూడా మా నాయకులకు అదే చెబుతాను.

**కాఫీ తోటలు పెరగడం వల్ల ఉపాధి మెండుగా లభిస్తుంది**

అరకు కాఫీ దేశానికి ప్రసిద్ధి. ప్రస్తుతం అరకులో కాఫీ తోటలు 2.25 లక్షల ఎకరాల్లో ఉన్నాయి. మరో లక్ష ఎకరాల్లో కాఫీ తోటలు పెంచేందుకు, ఎత్తయిన ప్రాంతాల్లో ఉద్యానవనాలు పెంచేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి సాయం చేయాలని కలెక్టర్ కోరారు. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి వెంటనే పనులను చేసేందుకు అనుమతులు ఇచ్చేలా ప్రయత్నిస్తాం. ఏ మాత్రం అవకాశం ఉన్నా అరకు ప్రాంతంలో కాఫీ తోటల పెంపుదలకు ప్రోత్సాహం ఇస్తాం. కాఫీ ఉత్పత్తుల సాగు పెరిగితే స్థానిక యువతకు ఉపాధి మెండుగా లభిస్తుంది. దీనివల్ల అరకు ప్రాంతంలో ప్రజల జీవన శైలి మెరుగవుతుంది. కలెక్టర్ గారు ఇచ్చిన సూచనపై దృష్టి సారిస్తాం.

**మూఢ నమ్మకాలు వద్దు.. అడవులను కాపాడండి**

ఇంకా ఏజెన్సీ ప్రాంతాల్లో చేతబడి, చిల్లంగి వంటి మూఢ నమ్మకాలు అధికంగా ఉన్నట్టు పోలీసుల చెబుతున్నారు. మూఢ నమ్మకాలతో ఇటీవల 9 మందిని హత్య చేసినట్టు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఈ కాలంలోనూ మూఢ నమ్మకాలు నమ్మడం సహేతుకం కాదు. మన మనసులో మంచి ఉంటే సాధించాలన్న బలమైన సంకల్పం ఉంటే మనల్ని ఎవరూ అడ్డుకోలేరు. నన్ను అసెంబ్లీలోకి అడుగు పెట్టనివ్వం అన్న వాళ్లే ఇప్పుడు అసెంబ్లీలో అడుగుపెట్టలేకపోతున్నారు. మనసులో మంచి ఉంటే ఎదుటి వాళ్లు చెడు చేసినా మన సంకల్ప బలం మనల్ని కాపాడుతుంది. మనసుకు మెదడుకు మించిన శక్తి మరోకటి లేదు. ఒక మంచిని బలంగా కోరుకుంటే ఖచ్చితంగా అవుతుంది. మూఢ నమ్మకాల వైపు మళ్లవద్దు. పోలీసులు దీనిపై చైతన్యం నింపేలా వికాస్ అనే కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం. చట్టాలను చేతులోకి తీసుకోవద్దు. అడవులపై కూడా నిర్లక్ష్యం వీడండి. సిగిరెట్లు తాగి నిర్లక్ష్యంగా పడవేయడం. అడవుల్లో చిన్న చిన్న మంటలు పెట్టడం వంటిపనులు చేయొద్దు. దీని వల్ల పెను నష్టం జరుగుతుంది.

**బంగారు భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం అవసరం**

ప్రజల మనసులు గెలుచుకోవాలంటే వారికి వారి అవసరాలు, సౌకర్యాలు, వసతులు తీర్చే ప్రభుత్వం కావాలి. అలాంటి ప్రయత్నమే కూటమి ప్రభుత్వం చేస్తుంది. వచ్చే ఎన్నికల నాటికి మన్యం ప్రాంతంలో కూటమి ప్రభుత్వ పతాకాలు రెపరెపలాడాలి. మేము ఓట్ల కోసం ఏ పని చేయడం లేదు. కానీ మేము చేసిన అభివృద్ధి, గిరిజనుల కోసం పడే తపనే మమ్మల్ని ఏజెన్సీ ప్రాంతంలో నిలబెడుతుంది. రాష్ట్రంలో 15 సంవత్సరాల పాటు కూటమి ప్రభుత్వం ఉండాలి. అప్పుడే విభజన గాయల నుంచి, గత ప్రభుత్వం ఏర్పరిచిన దెబ్బల నుంచి బయటపడగలం. దీనికి ప్రజల ఆశీస్సులు కావాలి. చిన్నాభిన్నం అయిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు గారు చక్కదిద్దుతున్నారు. నేను ఎల్లవుడూ మీ మధ్యనే ఉంటూ మీ కష్టాలు వింటూ మీతోనే నడుస్తాను. రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం ఖచ్చితంగా అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఇంఛార్జ్ మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి గారు, శాసన మండలిలో ప్రభుత్వ విప్ శ్రీ పిడుగు హరిప్రసాద్ గారు, ఎమ్మెల్యేలు శ్రీ పంచకర్ల రమేష్ బాబు గారు, శ్రీ సుందరపు విజయ్ కుమార్ గారు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీ శశిభూషణ్ కుమార్ గారు, కమిషనర్ శ్రీ కృష్ణ తేజ గారు, జిల్లా కలెక్టర్ శ్రీ ఎ.ఎస్. దినేష్ కుమార్ గారు, ఎస్పీ శ్రీ అమిత్ బర్దార్ గారు, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ శ్రీ దొన్ను దొరగారు పాల్గొన్నారు.

**అడవితల్లి బాట మొదటి దశ కార్యక్రమం వివరాలు**

ప్రధాన మంత్రి జన్ మన్ పథకం
(206 రహదారులు, 612.72 కిలోమీటర్ల మేర రోడ్లు, 239 అనుసంధాన గ్రామాలు, రూ. 555.61 కోట్ల నిధులు) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (343 రోడ్లు, 367 అనుసంధాన గ్రామాలు, 471.63 కిలోమీటర్ల రోడ్లు, రూ. 399.66 కోట్ల నిధులు) రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ నిధులు (9 రోడ్లు, 19 అనుసంధాన పంచాయతీలు, 48.85 కిలోమీటర్ల మేర రోడ్లు, రూ. 49.73 కోట్ల నిధులు

## ఆర్థిక వృద్ధిలో రాష్ట్రం రెండోస్థానంపై ముఖ్యమంత్రి సంతోషం


**అధికారులకు బహుమతిగా అరకు కాఫీ గిఫ్ట్ ప్యాక్లు**




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆర్థిక వృద్ధి రేటులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో నిలవడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ను, అధికారులను అభినందించారు. అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పడినందుకు ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

ఈ విషయమై ఆర్థిక-ప్రణాళిక శాఖల ఉన్నతాధికారులను సోమవారం సచివాలయంలో ప్రత్యేకంగా ప్రశంసించారు. జిల్లా పర్యటనలో ఉన్న ఆర్థిక శాఖా మంత్రి ముఖ్యమంత్రితో భేటీకి హాజరు కాలేకపోగా... తనను కలిసిన రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, పలువురు ఆర్థిక శాఖ, ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులకు బహుమతిగా అరకు కాఫీ గిఫ్ట్ ప్యాక్లు అందించారు.

## 11న అంగరంగ వైభవంగా.. కోదండరాముడి కళ్యాణోత్సవ ఏర్పాట్లు..



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : అత్యంత ప్రాచీన విశిష్టత ఉన్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలో ఏప్రిల్ 11న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు.. రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా ఇంచార్జీ మంత్రి ఎస్. సవిత లు సంయుక్తంగా పేర్కొన్నారు. సోమవారం ఒంటిమిట్ట టిటిడి కళ్యాణ మండపం సమీపంలోని పరిపాలన భవన సమావేశ మందిరంలో... జిల్లా కలెక్టర్ స. శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్ కుమార్, టీటీడీ జెఈఓ వీరబ్రహ్మం, టిటిడి విజిలెన్స్ ఎస్పీ విష్ణువర్ధన్ రాజు, జేసీ అదితి సింగ్డిఆర్వో విశ్వేశ్వర నాయుడు లతో కలిసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు, కళ్యాణోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులు, టీటీడీ అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ : శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 11వ తేదీన సీతారాముల కల్యాణం మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగనుందని, అందుకు సంబంధించి ఇప్పటికే దాదాపు అన్ని పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని మంత్రులు కోరారు. ముఖ్యంగా రాష్ట్రంలోని ప్రతి ఆలయంలో.. ఆగమ శాస్త్ర ప్రకారం, శాస్త్రోక్తంగా పూజా కైంకర్యాల నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రతి ఆలయంలో ప్రతి రోజూ దీప దీప నైవేద్యాలు నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. అందుకే.. ప్రతి ఆలయంలో దేదీప్యమానంగా పూజలు అందుతున్నాయన్నారు.

# కాంగ్రెస్ ఒక్కటే ఏపీలో ప్రతిపక్షం

**● మిగిలినవన్నీ బీజేపీకి గులాం చేసేవే ● 11 సీట్లతో ప్రజలు బుద్ధి చెప్పినా జగన్ లో మార్పు రాలేదు ● రాష్ట్ర ప్రయోజనాలను మోడీ కాళ్ళ దగ్గర తాకట్టు పెట్టారు ● ఒకరి సేవలో తరించాల్సిన ఖర్మ నాకు లేదు ● నేను పులి బిడ్డను ...ఒకరికి గులాంగిరి చేయను ● పీసీసీ చీఫ్ వైస్ షర్మిల**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వైసీపీ , ఆ పార్టీని మోసే సంస్థలకు ఇంకా పచ్చ కామెర్ల రోగం తగ్గినట్లు లేదని పీసీసీ చీఫ్ వైస్ షర్మిల విమర్శించారు.. కళ్ళకు కమ్మిన పసువు బైర్లు తొలగినట్లు లేదని ఎక్స్ ని వేదికగా చేసుకుని ఆరోపణలు సంధించారు.. ఇప్పటికీ అద్దంలో మోహం చూసుకున్నా చంద్రబాబు కనిపించడం చాలా బాధాకరం. ఏది చేసినా అర్థం, పరమార్థం టీడీపీ అనడం వారి వెర్రితనానికి నిదర్శనమన్నారు. స్వయంశక్తితో ఎదుగుతుంటే, రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంటుంటే, ప్రత్యామ్నాయ పార్టీగా ప్రజల్లో ముద్ర వేసుకుంటుంటే, చూసి ఓర్వలేక, అసత్యపు ఆరోపణలతో నిందలు వేయడం మీ చేతకానితనానికి నిదర్శనమన్నారు.. 11 సీట్లకే పరిమితం చేసి ప్రజలు చెప్పుతో కొట్టినట్లు తీర్పునిచ్చినా... మీ నీచపు చేష్టలు మారలేదు. అసత్యాలు వల్లె వేయడం మానుకోలేదు. నిజాలు జీర్ణించుకోలేని మీరు..ఇక ఈ జన్మకు మారరు అని రాష్ట్ర ప్రజలకు మరోసారి అర్థం అయ్యిందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉద్దేశించి విమర్శలు సంధించారు. ఇంతకాలం ఎవరి సేవలో ఎవరు తరించారో అందరికీ తెలుసు. ఎవరికి ఎవరు దత్తపుత్రుడుగా ఉన్నారో తెలుసు. తండ్రి ఆశయాలకు తూట్లు పొడిచి,రాష్ట్ర ప్రయోజనాలను మోడీ కాళ్ళ దగ్గర తాకట్టు పెట్టి స్వలాభమే పరమావధిగా రాష్ట్రాన్ని దోచుకుతిన్నారు. ప్యాలెస్ లు కట్టుకున్నారు. సొంత ఖజానాలు నింపుకున్నారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ అని తెచ్చి ప్రజల ఆస్తులు కాజేయాలని చూశారు. రిషికొండను కబ్జా చేయాలని చూశారు. మొత్తంగా మోడీ దోస్తులకు రాష్ట్రాన్ని దోచి పెట్టారు. కులమతాల మధ్య చిచ్చు పెట్టే ప్రతి అంశంలో మోడీకి మద్దతుగా నిలిచి 5 ఏళ్ల పాటు మోదాని సేవలో తరించినట్లు ప్రజలకు సర్వం బోధపడిందన్నారు. ఎవరో ఒకరి సేవలో తరించాల్సిన ఖర్మ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి బిడ్డ వైఎస్ షర్మిలా రెడ్డికి పట్టలేదు. పులి బిడ్డ పులిబిడ్డే. ఈ రాష్ట్రంలో బిజెపీ అంటే బాబు, జగన్, పవన్.. అన్ని పార్టీలు బీజేపీకి గులాంగిరి చేసేవే.. ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే ప్రతిపక్షంగా ఒంటరి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

## మన విద్యార్థులకు చేయూతనివ్వండి


**కెనడాలోని తెలుగు సీఈవోలకు ఆచార్య యార్లగడ్డ విజ్ఞప్తి**

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : కెనడాలోని తెలుగు విద్యార్థులు ఉపకార వేతనాలు, ఉద్యోగాల విషయంలో ఎదుర్కొంటున్న సంక్షోభ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వారికి చేయూతనివ్వాలని కెనడాలోని వివిధ సంస్థల తెలుగు సీఈవోలకు విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ విజ్ఞప్తి చేశారు. సోమవారం టొరంటో నగరంలోని బంజారా ఇండియా రెస్టారెంట్లో పలువురు తెలుగు సీఈవోలతో సమావేశమైన యార్లగడ్డ, ట్రంప్ అమెరికా అధ్యక్షుడైన తర్వాత అమెరికా-కెనడా, కెనడా-భారత సంబంధాలలో వచ్చిన మార్పుల కారణంగా తెలుగు విద్యార్థులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. కెనడాలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారని, తెలుగు సంఘాలతో చర్చించి, విద్యార్థులకు ఉపకార వేతనాలు, పార్ట్ టైం ఉద్యోగాలు, అర్హతలున్న వారికి శాశ్వత ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు సమస్యపై అవగాహన ఉందని, విద్యార్థులకు సహాయం చేయడానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. గతంలో చదువుకోసం వచ్చిన తెలుగువారిలో 80 శాతం మంది వర్క్ పర్మిట్ తో ఉద్యోగాలు పొందే వారు ఉండేవారని, అయితే ప్రస్తుతం ఈ సంఖ్య 20 శాతానికి పడిపోయిందని పేర్కొన్నారు. చాలామంది విద్యార్థులు తమ భవిష్యత్తుపై అనిశ్చిత పరిస్థితిలో ఉన్నారని, వారికి సహాయం చేయడానికి తాము ముందుంటామని ఆ సంస్థల ప్రతినిధులు హామీ ఇచ్చారు. భారత సాంస్కృతిక రాయబారిగా కెనడాలో పనిచేసిన సమయంలో ఆచార్య యార్లగడ్డ ఏర్పరచుకున్న సంబంధాల వల్ల ఈ చర్చలు ఫలవంతంగా సాగాయి. ఈ సందర్భంగా నమస్తే కెనడా పత్రిక అధినేత , ప్రముఖ హిందీ సాహితీవేత్త శరణ్ ఘయ్, తెలుగు ఖతులు (ఫాంట్లు) రూపొందించిన తొలి విదేశాంధ్రులలో ఒకరైన రచయిత శ్రీకృష్ణ దేశికాచార్యులను ఆచార్య యార్లగడ్డ విశ్వ హిందీ పరిషత్ తరపున సత్కరించారు. విండ్సర్ నగరంలో కెనడాలో అతిపెద్ద టాక్స్ కన్సల్టింగ్ సంస్థలలో ఒకటైన 8 నగరాలలో కార్యాలయాలు కలిగిన లిబర్టీ టాక్స్ కు చెందిన తెలుగు ప్రముఖులు సూర్య బెజవాడ, విశాల్ బెజవాడలను కలిసి అక్కడి తెలుగు విద్యార్థులకు సహాయంగా నిలవాలని కోరారు. ఈ సమావేశాల నిర్వహణ బాధ్యతలను బంజారా ఇండియా రెస్టారెంట్ అధిపతి వీరెళ్ళ రాజేష్, మారియట్ హోటల్స్లో బాధ్యతలు నిర్వహిస్తున్న పొతకమూరి భానుకుమార్ చేపట్టారు.

## మహిళా విద్యార్థులు అమరావతిలో ఉద్యోగ, వ్యాపార అవకాశాలు అందిపుచ్చుకోవాలి

**● డిగ్రీ ఫైనలియర్ స్టూడెంట్స్తో ఎంపి కేశినేని శివనాథ్ ఇంటరాక్షన్ ● జక్కంపూడిలో ఎలీప్ సంస్థకు లక్ష చదరపుఅడుగుల స్థలం ● ఐదు నెలల్లో లైట్ ఇండస్ట్రీయల్ ఏరియా అభివృద్ధి ● కేశినేని ఫౌండేషన్ ద్వారా కెరియర్ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు ● ది స్కిల్ షాప్ వారితో విద్యార్థులకు కెరియర్ కౌన్సిలింగ్ ● విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచన : ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విజయవాడ: విజయవాడ చాలా మంది లేడీ ఎంటర్ ప్రెన్యూర్స్ ను తయారు చేసింది. కానీ చాలా ఎంటర్ ప్రెన్యూర్స్ అవకాశాలు లేక హైదరాబాద్, అమెరికా, బెంగుళూర్, మద్రాసులోనూ పరిశ్రమలు నడిపిస్తున్నారు. ఇక్కడ వున్న మహిళ విద్యార్థులు ఉద్యోగ,వ్యాపార అవకాశాల కోసం ఎక్కడికో వెళ్లటం ఇష్టం లేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతి రాజధాని ప్రాంతంలో రాబోయే అవకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కోరారు. మేరీస్ స్టెల్లా కాలేజీ లో ఫైనలియర్ స్టూడెంట్స్ కి సోమవారం ఏర్పాటు చేసిన నావిగేట్ ది కెరియర్ ఆఫ్టర్ గ్రాడ్యుయేషన్ ప్రొగ్రామ్ కి ఎంపి కేశినేని శివనాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ విద్యార్థులతో ఇంటరాక్షన్ అయ్యారు. మైక్రో బయోలాజీ చదివే దివ్య, టూరిజం చదివే సిఫ్రా, లైఫ్ సైన్స్ చదివే ప్రియ, అగ్రికల్చర్ బి.యస్సీ చదివే మాధురీ, బి.ఎ చదివే ఐశ్వర్య, బి.ఎ జర్నలిజం చదివే హర్షిణి ఉద్యోగావకాశాలు, ఎంటర్ ప్రెన్యూర్స్ గా కావటానికి ప్రభుత్వం అందించే సహకారం గురించి అడిగిన ప్రశ్నలకు ఎంపి కేశినేని శివనాథ్ సవివరంగా సమాధానాలు ఇచ్చారు. విద్యార్థులకి కెరియర్ గైడెన్స్ అందించే దిస్కిల్ షాప్ కి చెందిన కెరియర్ కౌన్సిలర్ ను పిలిపించి విద్యార్థులకు సందేహాలను నివృత్తి చేయించారు. అలాగే విద్యార్థులు ఏ రంగంలో ఆసక్తి వున్నారో తెలుసుకుని చెప్పాలని, వారికి ఆరంగంలో నైపుణ్యత పెంపొందించేందుకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్స్ ఏర్పాటు చేయిస్తానన్నారు. కేశినేని ఫౌండేషన్ ద్వారా విద్యార్థుల కోసం కెరియర్ కౌన్సిలర్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపి కేశినేని శివనాథ్ విద్యార్థులతో ఇంటరాక్షన్ సందర్భంగా మాట్లాడుతూ అమరావతిలో చదువుకునే యువతీ యువకులు ఉద్యోగాల కోసం, వ్యాపారాల కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. చంద్రబాబు గారు ఆలోచనల్లో 20 ఏళ్ల ముందువుంటారు. దానికి ఉదాహరణ హైదరాబాద్ లో ఐటి విప్లవం అన్నారు. రాబోయే కాలంలో అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ విప్లవం రానుంది. సీఎం చంద్రబాబు నాయుడు అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ ను అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నారన్నారు. ఇక అమరావతిలో ఇంజనీరింగ్ చదివిన వాళ్లకే కాదు...డిగ్రీ చదివిన వాళ్లకు కూడా మంచి ఉద్యోగ అవకాశాలు వుంటాయన్నారు. కాకపోతే కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా ముఖ్యమన్నారు.

ఎపిలో ఎన్నో సంస్థలు మెకానికల్ సంస్థలతో పాటు ఆటోమొబైల్ సంస్థలు, ఆర్టిఫిషియల్ ఇంటిల్ జెన్స్ సంస్థలు, డిఫెన్స్ టెక్నాలజీ పరిశ్రమలు పెట్టబోతున్నట్లు తెలిపారు. వీటికంటే ముందు అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ రాబోతున్నట్లు చెప్పారు. అన్నింటికంటే ముఖ్యంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్స్ పెట్టబోతున్నట్లు వివరించారు. భారతదేశం పురోగతి సాధించాలంటే మహిళలు సాధికారత సాధించాలని, మహిళలు ఒకరిపై ఆధారపడకుండా ఎవరి కాళ్లపై వారు నిలబడాలన్నారు. రాబోయే కాలంలో విద్యార్థులంతా ఉద్యోగాలు సంపాదించటంతో పాటు గుడ్ ఎంటర్ ప్రెన్యూర్ గా నిలబడి విజయం సాధించాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1995లో మహిళ పారిశ్రామిక వేత్తల కోసం ఎలీప్ అనే సంస్థను స్థాపించటం జరిగింది, . ఇటీవల ఎలీప్ సంస్థ విజయవాడ లో మూడు రోజుల పాటు వర్క్ షాప్ నిర్వహించింది. ఆ సంస్థలో దాదావు 1200 మందికి పైగా సభ్యులు వున్నారు. ఒక్కొక్కరి టర్నోవర్ వందల కోట్ల రూపాయాల్లో వుందని వివరించారు. రాజధాని ప్రాంతంలో కూడా లేడీ ఎంటర్ ప్రెన్యూర్స్ ను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను ఒప్పించి జక్కంపూడి లో లక్ష చదరపుఅడుగుల స్థలం ఎలీప్ సంస్థకు ఇప్పించటం జరిగిందన్నారు. ఐదు నెలల్లో ఈ ప్రాంతంలో లైట్ ఇండస్ట్రీయల్ ఏరియా అభివృద్ధి చేయటం జరుగుతుందని యంగ్ ఎంటర్ ప్రెన్యూర్స్ ఈ ఇండస్ట్రీల్ ఏరియాను ఉపయోగించుకోవాలని సూచించారు. ఎలీప్ ద్వారా హైదరాబాద్ లేడీ ఎంటర్ ప్రెన్యూర్స్ ఏ విదంగా అబివృద్ధి చేందారో అదే విధంగా విజయవాడ అమరావతి ప్రాంతంలో మహిళ పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చెందాలనేది తమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. విజయవాడ అర్బన్ ప్రాంతంలో మెప్మా గ్రూప్ సభ్యులుగా మహిళలు ఒక లక్ష నలభై వేల మంది వున్నారని. మహిళలు తమ కాళ్ల నిలబడాలనే ఉద్దేశ్యంతో చంద్రబాబు నాయుడు బ్యాంకుల ద్వారా లోన్లు ఇప్పించటంతో విజయ వాడ లోనే ఈ మహిళలు శారీ మేకింగ్, పచ్చళ్లు తయారీ చేస్తూ ఎంటర్ ప్రెన్యూర్స్గా రాణిస్తున్నారు. విజయవాడలో బ్యాంకులు నడుస్తున్నాయంటే కారణం ఉద్యోగుల వల్ల, వ్యాపారుల వల్ల కాదు...మెప్మా మహిళ వ్యాపారవేత్తల వల్లే బ్యాంకులు నడుస్తు న్నాయన్నారు. సమాజంలో ఎంతో మంది మహిళలు వ్యాపారవేత్తలుగా రాణిస్తున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని మీకు ఆసక్తి గల రంగంలో నైపుణ్యం పెంచుకోవాలన్నారు. అందుకుతగ్గట్లు ఆ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు మహిళ పారిశ్రామికవేత్తలు ఇస్తున్న సబ్సిడీలు వివరించి వాటిని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జెస్సింతా క్వాడ్రాస్, మార్పు ట్రస్ట్ చైర్మన్ సూజీ, కెరియర్ కౌన్సిలర్ సంపత్ తాజ్ మణి, కోమండూరి శేషసాయి రామ్ కౌశిక్, చార్టెడ్ ఎకౌంటెంట్ పర్వేజ్, ఎమ్.ఎస్.ఎమ్. ఈ ఎన్టీజిల్లా ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ మాదిగాని గురునాథం పాల్గొన్నారు.

## ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్గా సుజయ్ రంగారావు

**గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఎన్నిక**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : సోమవారం జరిగిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో మాజీ మంత్రివర్యులు, ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ గా ఎన్నికయ్యారు. త్వరలో జరగనున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆంధ్రా ప్రీమియర్ లీగ్- 2025. నిర్వహణ బాధ్యతలను చైర్మన్ హోదాలో సుజయ్ కృష్ణ రంగారావు గారు చేపట్టనున్నారు. 2025 ఆంధ్రా ప్రీమియర్ లీగ్ చైర్మన్ గా ఎన్నికైన సుజయ్ కృష్ణ రంగారావుకి క్రికెట్ సంఘాలు, అభిమానులు అభినందనలు తెలియజేశారు.

# సంపాదకీయం

suryaeditpage@gmail.com

మోడీ–షా బడ్జెట్ యుగం!

భారతదేశం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆదర్శంగా నిలుస్తూ, అత్యంత విస్తృతమైన శాసనసభ వ్యవస్థను కలిగి ఉంది. ఈ వ్యవస్థలో బడ్జెట్ సమావేశాలు అత్యంత కీలకమైనవి. ఎందుకంటే వీటిలో ప్రభుత్వ వ్యయాలు, ఆదాయాలు, పన్నుల విధానం, సంక్షేమ పథకాల వెనుక ఉన్న ఆర్థిక వ్యూహం మొదలైనవి పార్లమెంట్ ఎదుట ఉంచబడతాయి. బడ్జెట్ సమావేశాల నిర్వహణ సాంకేతికంగా మరియు రాజకీయంగా ఒక సవాల్ గానే ఉంటుంది. ఎందుకంటే ఇది కేవలం సంఖ్యల సమీకరణం మాత్రమే కాకుండా, ప్రజల అవసరాలను తీర్చే సామర్థ్యాన్ని కలిగిన పాలనా పద్ధతిని సూచిస్తుంది. 2014 నుండి భారతదేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోడీ మరియు 2019 తర్వాత హోంశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అమిత్ షా ఈ సమావేశాల నిర్వహణలో ముఖ్యపాత్ర పోషించారనే విషయం నిర్ధారణతో చెప్పవచ్చు.

నరేంద్ర మోడీ ప్రభుత్వం మొదటి సారిగా అధికారంలోకి వచ్చిన 2014 సంవత్సరం నుండి పార్లమెంటరీ వ్యవహారాలకు ప్రాధాన్యతనిస్తూనే వచ్చింది. మోడీ, ఓ కార్యనిర్వాహక నాయకుడిగా పార్లమెంటులో జరిగే చర్చలను క్షుణ్ణంగా పర్యవేక్షించే నాయకుడిగా నిలిచాడు. అమిత్ షా, ముఖ్యంగా రెండవ సారిగా అధికారంలోకి వచ్చిన తరువాత, పార్లమెంటు వ్యవహారాలపై మరింత ప్రభావాన్ని చూపించారు. రాజ్యసభలో బిల్లు ఆమోదం సాధించేందుకు అవసరమైన

## మోడీ-షా బడ్జెట్ యుగం!

వ్యూహాలను అమలుపరచడంలో ఆయన ప్రావీణ్యత చూపారు. బిల్లులు ప్రవేశపెట్టే విధానం, బిల్లులపై చర్చలను సమర్థవంతంగా నడిపించడం, ఓట్ల సమీకరణ, విపక్షాలను ఎదుర్కొనడంలో అమిత్ షా చూపిన కౌశలం ఫ్లోర్ మేనేజ్మెంట్లో కీలకమైంది. మొదటగా గమనించదగిన అంశం ఏమిటంటే, మోడీ–షా ద్వయం నాయకత్వంలో బిల్లుల ఆమోదం వేగంగా జరిగే ప్రక్రియగా మారింది. గతంలో చాలా బిల్లులు పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలకు వెళ్లేవి, విస్తృత చర్చలకు లోనవేవి. కానీ 2019 తరువాత ఈ ప్రక్రియలో వేగం పెరిగింది. ఉదాహరణకు, ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ నిషేధం, సిటిజెన్ అమెండ్మెంట్ యాక్ట్ (సి ఏ ఏ) వంటి కీలక బిల్లులు తీవ్ర విభేదాల మధ్యలోనూ వేగంగా ఆమోదించబడ్డాయి. ఇది వారి ఫ్లోర్ మేనేజ్మెంట్ సామర్థ్యాన్ని సూచించగా, విపక్షాలు ఈ బిల్లుల చర్చకు తగిన సమయం ఇవ్వలేదని విమర్శించాయి. అయినప్పటికీ, ఈ వ్యవస్థలో వేగం, స్పష్టత మరియు కేంద్ర బిందువు నైతిక సమర్థతను మోడీ ప్రభుత్వం విజయవంతంగా ప్రతిష్టించింది. ఇదిలా ఉండగా, బిల్లుల సంఖ్యలో పెరుగుదల కనిపించినప్పటికీ, సమావేశాల వ్యవధిలో తగ్గుదల గమనించదగ్గ అంశం. కొన్ని సార్లు బడ్జెట్ సమావేశాలు మూడవ వారానికి తగ్గిపోతూ, మొత్తం సమావేశ రోజుల సంఖ్య 50 దాటక పోవడం ఒక ఆందోళనకర అంశంగా కనిపిస్తోంది. ఇందుకు కారణాలు రాజకీయ పరిస్థితులు, ఎన్నికల షెడ్యూల్, ఆందోళనలు వంటి వాటి ప్రభావంగా ఉన్నప్పటికీ, పార్లమెంటరీ చర్చలకు తగిన స్థలాన్ని కల్పించకపోవడం ప్రజాస్వామ్యంలో నష్టం కలిగించగలదు. ముఖ్యంగా ప్రజల సమస్యలపై చర్చకు సమయం కేటాయించకపోవడం జాతికి ఓ దౌర్భాగ్యకర ధోరణి. ఇక్కడే ప్రజా సమస్యలపై మనం కాస్త లోతుగా ఆలోచించాలి. బడ్జెట్ సమావేశాల్లో ఆహారం, ఆరోగ్యం, విద్య వంటి అంశాలపై చర్చలు ఉండాలి. బడ్జెట్లో వీటి కోసం కేటాయించిన నిధులపై సమగ్రంగా చర్చ జరిగితేనే వాటి అమలులో నాణ్యత ఉంటుంది. ఉదాహరణకు, మిడ్ డే మీల్స్, ఐ సి డి ఎస్ , ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల నిధు ల కేటాయింపులు సంవత్సరానికొకసారి మాత్రమే కాకుండా, అర్ధవార్షిక సమీక్షలతో కూడినవి కావాలి. అదే విధంగా, గ్రామీణ విద్యావ్యవస్థకు బడ్జెట్లో ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ అంశాలపై పార్లమెంటులో తీవ్రమైన చర్చలు జరగాలి. కానీ నేటి సమావేశాలలో ఈ అంశాలకు కేటాయించే సమయం నిరాశ కలిగించే స్థాయిలో ఉంటుంది.

అలాగే వ్యవసాయ రంగం కూడా బడ్జెట్ చర్చల్లో కీలకంగా ఉండాలి. ఎందుకంటే దేశంలోని 60 శాతానికి పైగా జనాభా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడి ఉంది. రైతు భరోసా, పీఎం కిసాన్, రైతు ఉత్పత్తుల ధరలు, నీటి వనరుల వినియోగం వంటి అంశాలు బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యంగా చర్చించబడాలి. కానీ ఈ అంశాలు చాలావరకు చిన్న సెషన్ల రూపంలో మాత్రమే ప్రస్తావించబడుతున్నాయి. ఈ పరిస్థితి ప్రజాస్వామ్య చింతనలో లోపాలను సూచిస్తుంది. ప్రభుత్వానికి హేతుబద్ధ నిర్ణయాలను తీసుకునే సమర్థత ఉన్నా, సమగ్ర ప్రజా చర్చల ద్వారా వచ్చిన నిర్ణయాలకే దీర్ఘకాలిక స్థిరత్వం ఉంటుంది. అనుసంధానంగా, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం కూడా సమగ్రంగా పెరగాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం పరిమిత సంఖ్యలో ఎంపీలు మాత్రమే చర్చల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. మిగిలిన వారు సభలకు హాజరుకానివారు కావడం, లేక చర్చల్లో పాల్గొనకుండా కూర్చునే ధోరణి ప్రజాస్వామ్యానికి తలవంచే అంశం. ప్రతి బడ్జెట్ చర్చను వారు తమ నియోజకవర్గ అవసరాల ప్రాతిపదికన చూడాలి. స్థానిక స్థాయిలో ఉన్న సమస్యలను రాష్ట్రం స్థాయిలో, ఆపై కేంద్ర బడ్జెట్ చర్చల్లో ప్రస్తావించగలగాలి. కానీ ఇది చాలా కొద్దిమందిలో మాత్రమే కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళా ఎంపీల భాగస్వామ్యం, ఎస్సీ ఎస్టీ ఎంపీల అభిప్రాయాల వినిపింపు వంటి అంశాలపై మరింత నిశితంగా దృష్టి పెట్టాలి.

ఇక బడ్జెట్ సమావేశాల లౌకిక నిర్మాణం కూడా మరింత ఆధునికతతో కూడినదిగా ఉండాలి. ప్రస్తుతం ఉన్న హాల్ నిర్మాణాలు, ఎలక్ట్రానిక్ వ్యవస్థలు, డిజిటల్ వోటింగ్ విధానాలు ఇంకా అభివృద్ధి చెందాలి. ఎంపీలకు డిజిటల్ డాష్బోర్డ్లు అందించాలి. వారి నియోజకవర్గ సమస్యలు, ప్రజల ఫీడ్బ్యాక్, బడ్జెట్ ప్రతిపాదనల విశ్లేషణలు అందించే విధంగా పార్లమెంట్ వేదికను అభివృద్ధి చేయాలి. ఈ మార్పుల వలన సమావేశాల సమర్థత పెరిగి ప్రజల అభిప్రాయాలకు ప్రతినిధ్యం కలుగుతుంది.

మొత్తానికి, భారత బడ్జెట్ సమావేశాలు ఒక ప్రామాణిక ప్రజాస్వామ్య ప్రక్రియ. మోడీ మరియు అమిత్ షా నాయకత్వంలో కొన్ని దశలలో వేగవంతమైన పాలన, చురుకైన బిల్లు ఆమోదం, ఫ్లోర్ మేనేజ్మెంట్లో నైపుణ్యం కనిపించినా, సమగ్ర ప్రజా చర్చ, ప్రజల సమస్యలపై దృష్టి, సమావేశాల వ్యవధిలో పెరుగుదల వంటి అంశాలపై ఇంకా మెరుగుదల అవసరం ఉంది. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇది ఎంతో అవసరం. బడ్జెట్ సమావేశాలు కేవలం ప్రభుత్వ లక్ష్యాలను నొక్కి చెప్పే వేదికగా కాకుండా, ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించే వేదికగా మారాలి. ఈ మార్పే భవిష్యత్ భారత ప్రజాస్వామ్య నిర్మాణానికి బలమైన పునాది అవుతుంది.

# నగరాలకు కొత్త శోభ ఎలా?

- నగరీకరణలో పట్టణాలుగా మారుతున్న అనేక పల్లెలు
- అనేక బస్తీల్లో దశాబ్దాలుగా నివసిస్తూ ఉన్నా లేని అధికారిక అనుమతులు
- ఎప్పుడూ అస్థిరమైన జీవితాలతో కానరాని కనీస సౌకర్యాలు
- వారికి తక్కువ ఖర్చుతో మంచి నాణ్యత కలిగిన ఫాబ్రికేటెడ్ ఇళ్లు ఇవ్వాలి
- అవి శుభ్రతకే కాదు ,మానవ గౌరవానికి ప్రతీకలు



**తేజస్వి**
**హైదరాబాద్**

భారతదేశం గణనీయంగా పట్టణీకరణ దిశగా పయనిస్తున్న దేశం. ఈ వేగవంతమైన నగరీకరణలో భాగంగా అనేక పల్లెలు పట్టణాలుగా మారుతున్నాయి, పట్టణాలు మెట్రో నగరాలుగా ఎదుగుతున్నాయి. కానీ ఈ ప్రగతిలో పొంచి ఉన్న ప్రమాదం కూడా ఉంది %–% అదే అపరిశుభ్రమైన వాతావరణంతో ఉండే బస్తీలు. ముంబయి, హైదరాబాద్, కోల్కతా, చెన్నై వంటి పెద్ద నగరాల్లో లక్షలాది మంది ప్రజలు బస్తీల్లో నివసిస్తున్నారు. పట్టణాల్లో బస్తీల రూపంలో ఏర్పడిన అస్వచ్ఛతకు మూలకారణం %–% స్థిర నివాస హక్కు లేకపోవడమే. ముంబయిలో ధారావి, హైదరాబాద్లో రాయదుర్గం ప్రాంతాలు, చెన్నైలో కూయంబేడు ప్రాంతం వంటి అనేక బస్తీల్లో ప్రజలు దశాబ్దాలుగా నివసిస్తూ ఉన్నప్పటికీ వారి నివాసాలకు ప్రభుత్వ పత్రాలు లేవు. దీనివల్ల వారు ఎప్పుడూ అస్థిరమైన జీవితమే గడుపుతారు. స్థిరత్వం లేకపోవడం వల్ల వారు తమ పరిసరాలను మెరుగుపరచడానికి ఆసక్తి కనబరచరు. కనీసం ఒక గుడిసెకు మెటల్ షీట్ వేసుకోవాలన్నా, సిమెంట్ ఫ్లోర్ వేయాలన్నా, ఏదైనా ఆధునిక సౌకర్యం పొందాలన్నా భయంతో వెనక్కి తగ్గిపోతారు. అందుకే నగరాల్లో ఈ బస్తీలు వల్ల ఎప్పుడూ నగరాల్లో ఎక్కువశాతం అపరిశుభ్రత సమస్య తలెత్తుతూనే ఉంటుంది.

బస్తీలలో ఇలాంటి మాలిన్యం ఉండటానికి మరో ప్రధాన కారణం గుడిసెల నిర్మాణం. ప్లాస్టిక్ షీట్లతో, బురదతో, మట్టి గోడలతో చేసిన ఈ గుడిసెలు వర్షాకాలంలో చెత్త చెదరిపోయి వీధులన్నీ మురికి నిల్వలుగా మారుతాయి. వేసవిలో వేడి, చలికాలంలో చలితో జీవించడం మామూలు విషయం. వీటి ప్రక్కన వంటదినుసులు, మంచి నీరు, పిల్లలు ఉండడంతో అంతా నివాసయోగ్యత లేని ప్రాంతంగా మారిపోతుంది. ఈ పరిస్థితిని శాశ్వతంగా మార్చాలంటే తక్కువ ఖర్చుతో మంచి నాణ్యత కలిగిన ఫాబ్రికేటెడ్ ఇళ్లు నిర్మించాలి. ఇవి టెక్నాలజీ ఆధారంగా ప్రీ–ఫ్యాబ్రికేటెడ్ సిస్టమ్లను ఉపయోగించి నిర్మించేవి. స్వచ్ఛమైన, వేడి నిరోధక, వర్ష నిరోధక గోడలతో, తక్కువ స్థలంలో ఎక్కువ కుటుంబాలకు తగిన ఆధునిక పద్ధతిలో నిర్మించవచ్చు. అలాగే తక్కువ ఖర్చుతోను చేయవచ్చు. ప్రతి ఇంటికి టాయిలెట్, నీటి కనెక్షన్, శుభ్రమైన డ్రైనేజీ వ్యవస్థను కలిపితే, ఇంటి పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా ఉంటుంది. ఇవి మల్టీ–స్టోరీగా నిర్మిస్తే, నగరంలో లభ్యమయ్యే స్థలం తక్కువగా ఉన్నా ఎక్కువ మందికి నివాస అవకాశాలు లభిస్తాయి. ఫాబ్రికేటెడ్ ఇళ్లు కేవలం శుభ్రతకే కాదు ,మానవ గౌరవానికి ప్రతీకగా నిలుస్తాయి. వీటి కోసం ప్రభుత్వాలు భారీగా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు, తక్కువ బడ్జెట్ తో విడుతల వారిగా వందల ఇళ్ళ నిర్మాణంతో మొదలుపెట్టవచ్చు. బస్తీల అస్వచ్ఛత మరొక మూలకారణం – నిరుద్యోగం లేదా అస్థిర ఉపాధి. బస్తీలలో నివసించే ప్రజలలో చాలా మంది రోజువారీ కూలీలు, తాత్కాలిక ఉద్యోగస్తులు. వీరికి స్థిర ఆదాయం లేకపోవడం వల్ల జీవితంలో నిరాశ పుట్టి, పరిసరాల శుభ్రతను పరిరక్షించాలనే భావం కనపడదు. ఒక వ్యక్తి తన జీవనోపాధి స్థిరంగా ఉండదనే అస్థిరతలో ఉండగా, అతనికి పరిసరాల పరిశుభ్రత మీద శ్రద్ధ ఉండదు.

బస్తీల అస్వచ్ఛత మరొక మూలకారణం నిరుద్యోగం లేదా అస్థిర ఉపాధి. బస్తీలలో నివసించే ప్రజలలో చాలా మంది రోజువారీ కూలీలు, తాత్కాలిక ఉద్యోగస్తులు. వీరికి స్థిర ఆదాయం లేకపోవడం వల్ల జీవితంలో నిరాశ పుట్టి, పరిసరాల శుభ్రతను పరిరక్షించాలనే భావం కనపడదు. ఒక వ్యక్తి తన జీవనోపాధి స్థిరంగా ఉండదనే అస్థిరతలో ఉండగా, అతనికి పరిసరాల పరిశుభ్రత మీద శ్రద్ధ ఉండదు. కాబట్టి అస్వచ్ఛత మరియు ఉపాధి అనేవి ఒకదానికొకటి అనుసంధానమై ఉన్న అంశాలు. ఈ సమస్యను పరిష్కరించాలంటే వీరికి ఇళ్ళు ఏర్పాటు చేయడంతో పాటు ,వారిని ఉపాధి కేంద్రాలకు అనుసంధానం చేయాలి. ఒక స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి, యువతకు శిక్షణ ఇవ్వాలి. శుభ్రత ఆధారిత ఉపాధి రంగాలు %–% చెత్త రీసైక్లింగ్, డ్రైనేజీ నిర్వహణ, మురుగు శుద్ధి, వృద్ధ ఉత్పత్తుల ప్రాసెసింగ్ వంటి రంగాల్లో వారు నైపుణ్యం కలిగి ఉంటే, పరిశుభ్రతకే ఒక సంపాదన మార్గం అవుతుంది. మహిళలకు హ్యాండ్మేడ్ ప్రాడక్ట్స్, టెయిలరింగ్, హోం ఫుడ్స్ తయారీ వంటి రంగాల్లో అవకాశాలు ఇవ్వాలి. ఈ ఉపాధి మార్గాలు వారి జీవితాల్లో స్థిరతను తీసుకురావడంతో పాటు, పరిసరాల పరిశుభ్రత మీద శ్రద్ధ కలిగిస్తాయి.

శుభ్రత అనేది వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా సామూహికంగా రూపొందించే ఒక సంస్కృతి. కానీ అది ఏర్పడాలంటే మౌలిక వసతుల ప్రాముఖ్యతను విస్మరించకూడదు. బస్తీలలో నివసించే ప్రజలు చాలా చిన్న స్థలంలో నివసిస్తూ, నీరు, విద్యుత్, టాయిలెట్లు, డ్రెయినేజీ వంటి ప్రాథమిక వసతులకు నిత్యం పోరాడుతున్నారు. నగరాల్లోని చెత్త సమస్యను దాదాపు 40% మేర బస్తీల నుంచి వచ్చే మురికి కారణంగానే ఏర్పడుతోంది. సురక్షితమైన తాగునీటి వ్యవస్థ, శుద్ధ డ్రెయినేజీ వ్యవస్థ, చెత్త నిర్వహణ మెకానిజం, మరియు విద్యుత్, వీధిదీపాల వ్యవస్థ బస్తీల పరిశుభ్రతకు మూలస్థంభాలు. ప్రతి ఇంటికి నీటి కనెక్షన్, ఫ్యాన్, లైట్, టాయిలెట్ కల్పించడం మాత్రమే కాకుండా, ప్రతి 100 ఇళ్లకు ఒక కమ్యూనిటీ హాల్, ఆరోగ్య కేంద్రం, స్కూల్ ఉండే విధంగా మౌలిక రూపకల్పన జరగాలి. చెత్తను వేరు చేసే వ్యవస్థతో పాటు, వ్యర్థాలను రీసైకిల్ చేయగల స్మాల్ స్కేల్ యూనిట్లను బస్తీల వద్దనే ఏర్పాటు చేయాలి. ఇలా చేయడం ద్వారా శుభ్రతకు మౌలిక స్థాయిలో స్థిరత అందుతుంది. కొత్త ఇళ్ళ నిర్మాణంతో పాటు ఇవన్నీ కూడా ఆ నిర్మాణ ప్రక్రియలో భాగమయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

శుభ్రత అనేది ఒక జీవనశైలి. ఇది ఒక్క ప్రభుత్వ పనిచేయటం ద్వారా సాధ్యపడదు. బస్తీ ప్రజలలో ఆ శ్రద్ధ, ఆ స్ఫూర్తి కలిగితేనే అది స్థిరంగా నిలుస్తుంది. అందుకే అవగాహన శిబిరాలు, శిక్షణా కార్యక్రమాలు, మరియు కమ్యూనిటీ భాగస్వామ్యం కీలకం. ప్రతి బస్తీలో శుభ్రత వాలంటీర్ల బృందం ఉండాలి. వీరికి శిక్షణ ఇచ్చి, వారు తాము నివసించే పరిసరాల్లో పరిశుభ్రతను పాటించేందుకు నాయకులుగా ఉండాలి. పిల్లలకు స్కూల్ స్థాయిలో శుభ్రత పాఠాలు నేర్పాలి. మహిళా సంఘాలు శుభ్రత కార్యకలాపాల్లో భాగమవ్వాలి. కొత్తగా నిర్మాణం చేసి ఇచ్చిన తర్వాత , వాటిల్లో మెరుగ్గా ఉన్న వాటిని ఆదర్శంగా గుర్తించి వాటిని మెట్రో నగరాల్లో ఉదాహరణగా చూపించాలి. ప్రతి ఇంటికి ఒక 'క్లీన్ హౌస్' గుర్తింపు ఇవ్వడం ద్వారా, వారు తమ ఇంటిని గౌరవంగా చూసుకునే విధంగా ప్రేరణ కలిగించాలి. శుభ్రతను కేవలం శాసనాల వల్ల కాదు %–% మానసిక మార్పుల ద్వారా సాధించాలి. ఆ మార్పు ప్రజల భాగస్వామ్యం ద్వారానే సాధ్యమవుతుంది. ఈ దిశగా ప్రభుత్వాలు పని చేస్తే, భారత నగరాలు కొత్త శోభతో ముస్తాబవుతాయి.

# డీలిమిటేషన్.. సౌత్ కు డేంజరే!

- ఉత్తరాది రాష్ట్రాలు ఎంతో లాభం
- దక్షిణాది గళం.. తగ్గితే ప్రమాదం
- కలిసికట్టుగా పోరాడితేనే ప్రయోజనం
- లేకుంటే తప్పదు భారీ మూల్యం
- జనగణనను పూర్తి చేసి నియోజకవర్గాలను పునర్విభజిస్తారా?




**-ఫిరోజ్ ఖాన్,**
**9640466464**

సంఖ్యాబలంతో లోక్ సభ, రాజ్యసభలో వక్ఫ్ అమెండ్ మెంట్ బిల్లు–2025ను ఎన్డీఏ ప్రభుత్వం ఆమోదింపజేసుకున్నది. జేడీయూ, తెలుగుదేశం పార్టీ వంటి మిత్రపక్షాల సహకారంతో భారతీయ జనతాపార్టీ రెండు సభల్లోనూ బిల్ పాస్ అయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నది. ఆ తర్వాత రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది. అయితే వక్ఫ్ బిల్లు విషయంలో దూకుడుగా వెళ్లిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ.. డీలిమిటేషన్ విషయంలోనూ అలాగే వ్యవహరించే అవకాశముంది. ఎన్డీఏ, ఇండియా ఏ కూటమిలో ఉన్నా.. సౌత్ స్టేట్స్ కలిసికట్టుగా పోరాడకపోతే… దక్షిణాది రాష్ట్రాలకు, అక్కడి ప్రజలకు తీరని నష్టం జరిగే ప్రమాదముంది. 2011 లేదా 2025లో చేపడుతారని భావిస్తున్న జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన జరిగితే ఎంపీ స్థానాల సంఖ్య 800 నుంచి 1000 వరకు పెరగొచ్చు. అయితే ఈ ప్రక్రియలో ఉత్తరాది రాష్ట్రాలు ఎంతో లాభపడుతుండగా, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదమున్నది. దీంతో భవిష్యత్తులో దక్షిణాది గళానికి విలువలేకుండాపోతుంది.

**సీట్ల సంఖ్య ఇలా..**

1951–52లో దేశ జనాభా 36 కోట్లు. అప్పుడు లోక్ సభ సీట్లు 489. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగిన 1971లో దేశ జనాభా 54 కోట్లు. అప్పుడు సీట్ల సంఖ్యను 545కు పెంచారు. 1976లో కుటుంబ నియంత్రణ కార్యక్రమం జోరుగా సాగుతున్నది. తాము జనాభాను నియంత్రిస్తే లోక్ సభ స్థానాల సంఖ్య తగ్గే ప్రమాదముందని అప్పట్లోనే దక్షిణాది రాష్ట్రాలు అనుమానం వ్యక్తం చేశాయి. దీంతో 1976లో ఎమర్జెన్సీ సమయంలో లోక్ సభ సీట్ల సంఖ్యకు మరో 25 ఏళ్లపాటు 1971 జనాభా లెక్కలనే పరిగణనలోకి తీసుకోవాలని 42వ రాజ్యాంగ సవరణచేశారు. 2001లో నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉన్నా.. అప్పట్లో ప్రధానిగా ఉన్నా వాజ్ పేయి 84వ రాజ్యాంగ సవరణ చేశారు. లోక్సభ స్థానాల సంఖ్యను పెంచకుండా పునర్ వ్యవస్థీకరణ చేశారు. కొన్ని జనరల్ స్థానాలను ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించి.. వారి ప్రాతినిధ్యం పెంచారు. లోక్ సభ సీట్ల సంఖ్య పెంపు అంశాన్ని 2026కి వాయిదా వేశారు. దీంతో మూడో సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ 2026లో ఎలాగైనా నియోజకవర్గాలను పునర్విభజించాలని భావిస్తున్నది. ప్రస్తుతం 2011 సెన్సెస్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కరోనా కారణంగా 2021 జనగణనను వాయిదా వేశారు. కేంద్ర ప్రభుత్వం 2025లో జనగణన చేస్తుందనే ప్రచారం సైతం జరుగుతున్నది. జనగణనకు ఇంకా ఏడాది సమయం ఉన్నందున, 2021లో చేపట్టాల్సిన జనగణనను పూర్తి చేసి నియోజకవర్గాలను పునర్విభజిస్తారా? లేదా 2011 డేటాను పరిగణనలోకి తీసుకొని పునర్విభజన చేస్తారా అనేది కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉన్నది.

**ఉత్తరాది రాష్ట్రాలు లాభపడేది ఇలా..**

ఉత్తర్రప్రదేశ్లో ప్రస్తుతం సీట్ల సంఖ్య 80. పునర్విభజనతో ఆ రాష్ట్రంలో సీట్ల సంఖ్య 160కి పైగా పెరిగే అవకాశముంది. అంటే సీట్ల సంఖ్య దాదాపు రెట్టింపు అవుతుంది. ఆ రాష్ట్ర ప్రాతినిధ్యం 14.7% నుంచి 16 శాతానికి పెరుగుతుంది. రాజస్థాన్ లో ప్రస్తుతం 25 ఎంపీ సీట్లు ఉండగా, అవి కూడా 52కి పెరుగుతాయని అంచనా. ఇక్కడ కూడా సీట్లు రెట్టింపు అవుతున్నాయి. అలాగే బిహార్, ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు కూడా గణనీయస్థాయిలో పెరిగే అవకాశాలున్నాయి.

**దక్షిణాది నష్టపోయేది ఇలా..**

1952లో పార్లమెంట్ స్థానాల సంఖ్య 489 కాగా, ఇందులో దక్షిణాది వాటా 25.35 శాతం. 1967లో సీట్ల సంఖ్య 522కి కాగా, దక్షిణాది వాదా 24.13 శాతానికి పడిపోయింది. 1977లో సీట్ల సంఖ్య 545 కు చేరగా, దక్షిణాది సీట్ల వాటా 23.85 శాతానికి పడిపోయింది. అయితే ప్రస్తుతం డీలిమిటేషన్ తో తెలంగాణ లోక్ సభ సీట్ల సంఖ్య 17 నుంచి 39కి పెరిగే అవకాశముంది. అంటే పెరుగుదల 48 శాతం మాత్రమే. దీని ద్వారా పార్లమెంటులో తెలంగాణ ప్రాతినిధ్యం 3.1 శాతం నుంచి 3.3 శాతానికి చేరుకుంటుంది. అదే ఆంధ్రప్రదేశ్ ను తీసుకుంటే సీట్ల సంఖ్య 25 నుంచి 52కు పెరుగుతుండగా, ఏపీ వాటా మాత్రం 4.6 శాతం నుంచి 4.3 శాతానికి పడిపోతుంది. తమిళనాడులో 28 శాతం సీట్లు పెరుగనుండగా.. కేరళలో కేవలం ఒక్క శాతం మాత్రమే సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఇలా అయితే పార్లమెంటులో తమిళనాడు ప్రాతినిధ్యం 7.2 శాతం నుంచి 6.4 శాతానికి, కేరళ ప్రాతినిధ్యం 3.7 శాతం నుంచి 2.9 శాతానికి పడిపోతుంది.

**ఆందోళనకు కారణాలేమిటి?**

జనాభా ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే ఉత్తరాదిలోని నాలుగైదు రాష్ట్రాల్లో సత్తా చాటగలిగిన పార్టీలు దేశంలో అధికారంలోకి వచ్చే అవకాశాలు ఎక్కువ. దీంతో దక్షిణాది రాష్ట్రాలు తమ హక్కులు కోల్పోయే ప్రమాదముంది. ఇప్పటికే జాతీయ భాష అంటూ హిందీని నెత్తిన రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా నిధుల విషయంలోనూ మొదటి నుంచీ అన్యాయం జరుగుతున్నది. పార్లమెంటులో దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గితే కేంద్రం నుంచి న్యాయం జరిగే అవకాశాలు చాలా తక్కువ.

**పోరాడితేనే..**

డీలిమిటేషన్ తో జరిగే నష్టంపై ఆందోళనలతో దక్షిణాదికి చెందిన మెజార్టీ పార్టీలు ఏకమై జేఏసీగా ఏర్పడి పోరాటానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే తమిళనాడులో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి నిర్వహించారు. తెలంగాణ, కేరళ, పంజాబ్ ముఖ్యమంత్రులు రేవంత్రెడ్డి, పినరయి విజయన్, భగవంత్ మాన్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీ.కె. శివకుమార్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇందులో పాల్గొన్నారు. ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ సైతం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ మీటింగుకు హాజరయ్యారు. ఇక్కడ పలు తీర్మానాలను ఆమోదించి కేంద్రం ముందు ఉంచారు. ఇందులో ముఖ్యమైనది పార్లమెంట్ నియోజకవర్గాల సంఖ్యను మరో 25 ఏళ్లు మార్చకూడదు. అనంతరం డీ లిమిటేషన్ ను వ్యతిరేకిస్తూ తెలంగాణ అసెంబ్లీ సైతం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. జేఏసీ రెండో సమావేశాన్ని తెలంగాణలో నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు. అయితే పార్లమెంట్ లో వక్ఫ్ బిల్లుకు మద్దతు తెలిపిన ఏపీకి చెందిన తెలుగుదేశం, జన సేనతోపాటు అనుకూలంగానో, వ్యతిరేకంగానో ఎలా ఓటు వేశారో తెలియని గందరగోళంలో ఉన్న జగన్ పార్టీ సైతం ఈ జేఏసీలో యాక్టివ్ గా కనిపించడం లేదు. సీట్ల వాటాలో దక్షిణాదికి నష్టం జరిగితే అందులో ఆంధ్రప్రదేశ్ కూడా ఉంటుందని ఆ రాష్ట్ర రాజకీయ పార్టీల నాయకులు గుర్తించాలి. లేకపోతే ఆయా పార్టీల అధినేతలు ప్రజల ముందు ముద్దాయిగా నిలబడాల్సి ఉ

# గ్రామాలలోని సీనియర్ సిటిజన్స్ అవస్థలు అన్నీ ఇన్నీ కాదయా !

ముఖ్యంగా భారతదేశంలోని గ్రామాలలో నివసించే సీనియర్ సిటిజన్స్ పరిస్థితి ఇప్పుడు మరీ దయనీయంగా మారింది. అయితే పట్టణాలలోని వృద్ధుల పరిస్థితి ఈ విషయంలో కాస్తంత మెరుగ్గా వున్న,గ్రామాలలోని వృద్ధుల పరిస్థితి మాత్రం ఎలా తయారు అయ్యింది అంటే వారి సొంత కుటుంబాల నుంచే ఈసడింపులకు ,వేధింపులకు చాలా తీవ్ర స్థాయిలో గురవుతున్నారు. దీనికి ప్రదాన కారణం వారికి ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం,వారు వయస్సు రీత్యా ఎలాంటి పని చేయలేక ఒక జీవచ్ఛవంలా బ్రతుకులు వెల్లదిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో దాదాపు 33 % శాతం మంది వృద్ధ మహిళలకు ఎలాంటి ఆదాయం లేదు,కేవలం 11 శాతం మంది మాత్రమే పెన్షన్ పొందుతున్నారు,ఇక 16.3 శాతం మంది మాత్రం సామాజిక పెన్షన్ పొందుతున్నారు. మిగతా శాతం వృద్ధులంతా ఎలాంటి ఆదాయం లేక తిని తిన గానక పస్తులుంటూ, వారికి భరోసా గా, ఆసరాగా నిలిచేవారు కరువై వాళ్ళ జీవితం దిన దిన గండంగా, కడు దుర్భరంగా మారిపోయింది అనే మాట ఎవరు కాదనలేని వాస్తవం. ఇక ఇండియా ఏజింగ్ రిపోర్టు 2023 ప్రకారం 60 ఏళ్ళు అంతకంటే ఎక్కువ వయస్సు గల వారు దాదాపు 15 కోట్ల మంది వున్నారు,ఈ సంఖ్య 2050 నాటికీ అయితే మరింత పెరిగే అవకాశం వుంది. కాబట్టి వృద్ధుల గురించి మన ప్రభుత్వాలు ఎంతో బాధ్యతగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది అన్న మాట. అయితే ఇప్పటి వరకు వృద్ధులకు ఓల్డ్ ఏజ్ హోమ్స్ తప్ప మరో మార్గం లేదు,అయితే ఇవి సమకూర్చేవి తినడానికి తిండి, ఉండటానికి కాసింత నీడను ఇస్తాయి తప్ప ఒంటరితనం నుంచి మాత్రం బయటపడే మార్గాన్ని మాత్రం ఇవి చూపించలేవు. అందుకే ఇలాంటి వారికి రీ మ్యారేజ్ ద్వారా స్వాంతన పొందేందుకు ఒక మంచి అవకాశం వుంది,లేకపోతే వృద్ధులు ప్రమాదాలకు, దోపిడీలకు గురయ్యే ప్రమాదం పొంచి వుంది. దీనికి మరో పరిష్కార మార్గం నలుగురు వృద్ధులు కలిసి ఒక చోట ఉండవచ్చు,దీనివల్ల ఒంటరితనం పోగొట్టుకొని ఉన్నంతలో వారంతా ఎలాంటి లోటు లేకుండా సుఖంగా జీవించడానికి ఒక సువర్ణ అవకాశం ఏర్పడుతుంది. అంతేకాదు ఇటీవల సీనియర్ కేర్ సంస్కరణలపై ' నీతి అయోగ్ ' సమర్పించిన నివేదిక ప్రకారం వృద్ధుల ఆర్థిక సాధికారతను నిర్ధారించడానికి ప్రభుత్వ నిధుల కవరేజిని పెంచడం,తిరిగి పని నైపుణ్యాల వైపు మళ్ళించడం,తప్పనిసరి పొదుపు ప్రణాళికలు, రివర్స్ మార్టిగేజ్ మెకానిజమ్స్,పన్ను,జీ ఎస్టీ సంస్కరణలు వంటి అనేక చర్యలు చేపట్టడం మూలాన వారి ఆర్థిక స్థితి మెరుగయ్యే అవకాశం వుంది అనే విషయాన్ని అత్యంత క్లుప్తంగా ఆ నివేదిక తెలియజేసిన విధానం ఎంతైనా హర్షణీయం. ఒక విధంగా అవన్నీ కూడా అమలుపరచి ఓ మంచి ఫలితాన్ని రాబట్టే మంత్రదండం అని కూడా నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఏదిఏమైన 60 ఏళ్ళు పై బడిన వృద్ధులు మన భారతదేశంలో ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ ఇన్నీ కావు. ఒక వైపు సొంత ఇంటి వారి నుంచే అవమానాలు,అవహేళనలు,అపహాస్యాలు,మరో వైపు ఈ సమాజంలోని ప్రజలు వారిపై చిన్నచూపు చూడటం,ఇక ప్రభుత్వాలు సైతం యువతపై చూపే శ్రద్ధ,ఆసక్తి, జీవనోపాధి విషయంలో వారికి కలిగించే ఎనలేని భరోసా ఈ వృద్ధులపై చూపకపోవడంతో అది మొదటికే మోసం వచ్చే పరిస్థితికి దాపురించడం తథ్యం. ఏమైనా ఇప్పటికయినా మన రాజకీయ,మేధావి రంగాల వారు,మానవ హక్కుల సంఘాల వారు,మన ప్రభుత్వాలు ప్రత్యేకించి ఎలాంటి ఆర్థిక తోడ్పాటు లేని 60 ఏళ్ళు దాటిన పేద వృద్ధుల సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రికరించి వారిని ఈ సమస్యల సుడిగుండం నుంచి గట్టెకించే మార్గాలను అన్వేషించక పోతే మాత్రం మన భారతదేశంలోని 15 కోట్ల మంది వృద్ధుల పరిస్థితి నానాటికి తీసికట్టుగా మారి వారికి మరణం తప్ప మరో మార్గం లేక వారంతా ఆత్మహత్యల వైపు సైతం పయనించే ప్రమాదం రానున్న భవిష్యత్ లో పొంచి వుంది. తద్వారా ఆ దుష్పరిణామం మన భారతదేశం యొక్క కీర్తి, ప్రతిష్టలకు ఒక మాయని మచ్చను చేకూర్చే అవకాశం లేకపోలేదు. తస్మాత్ జాగ్రత్త!

**– బుగ్గన మధుసూదనరెడ్డి**

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

## నంబర్ 1 ఈవీ తయారీ సంస్థగా నిల్చిన మహీంద్రా లాస్ట్ మైల్




ముంబై: భారతదేశపు దిగ్గజ కమర్షియల్ ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ సంస్థ మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ లిమిటెడ్ (ఎంఎల్ఎంఎంఎల్) వరుసగా నాలుగోసారి, 2025 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్పై ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది
. కంపెనీ ఫ్లాగ్షిప్ బ్రాండ్లు అయిన ట్రియో, జోర్ గ్రాండ్ వాహనాలు, ఎల్5 కేటగిరీలో ఈవీల సెగ్మెంట్ వాటా 24.2 శాతం పెరిగేందుకు దోహదపడ్డాయి.
2024 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 16.9 శాతంతో పోలిస్తే ఇది గణనీయమైన వృద్ధి.ఇతర సంస్థల నుంచి గట్టి పోటీ నెలకొన్నప్పటికీ ఎల్5 కేటగిరీలో 37.3 శాతం మార్కెట్ వాటాతో మహీంద్రా లాస్ట్ మైల్ లిమిటెడ్ పటిష్టంగా ఉంది.– 2 లక్షల పైగా కమర్షియల్ ఈవీలు విక్రయించిన తొలి సంస్థ – భారతదేశపు నంబర్ 1 ఎలక్ట్రిక్ ఆటో అయిన ట్రియో వాహనాలు 1 లక్ష పైగా విక్రయం
2025 ఆర్థిక సంవత్సరంలో మెటల్ బాడీతో ట్రియోను, తొలి 4 వీలర్ ఎలక్ట్రిక్ ఎస్సీవీ అయిన మహీంద్రా ను ఆవిష్కరించడం ద్వారా మహీంద్రా లాస్ట్ మైల్ లిమిటెడ్తమ ప్రోడక్ట్ పోర్ట్ఫోలియోను మరింతగా విస్తరించింది. ఇతర సహచర ఎలక్ట్రిక్ 3 వీలర్లతో కలిసి మహీంద్రా జీఈఓ, 4 వీలర్ కార్గో విభాగాన్ని విద్యుదీకరించే ప్రస్థానాన్ని ప్రారంభించింది.

## 500 కోట్లు సేకరించనున్న ఐ ఐ ఎఫ్ ఎల్ ఫినాన్స్

ఐ ఐ ఎఫ్ ఎల్ ఫినాన్స్ లిమిటెడ్ అనేది ఒక అగ్ర నాన్ బ్యాంకింగ్ ఫినాన్షియల్ కంపెనీ( ఎన్ బి ఎఫ్ సి). అది ఈరోజు 500 కోట్ల రూపాయలను బాండ్స్ యొక్క జారీ ద్వారా 10.25 % కూపన్ లను సంవత్సరానికి ఒకసారి సేకరిస్తాను అని చెప్పింది. ఈ ఫండ్స్ ని రాబోయే ఫండింగ్ కోసం మరియు ఇవ్వబోయే అప్పు, ఫైనాన్సింగ్ మరియు సాధారణ కార్పొరేట్ అవసరాలకు ఉపయగిస్తుంది. ఎన్ సి డి లను క్రిసిల్ ఏ ఏ / నిలకడ ద్వారా క్రిసిల్ రేటింగ్ లిమిటెడ్ మరియు "%ళి%ఐ సి ఆర్ ఏ%రి% ఏ ఏ (నిలకడ)" ద్వారా రేట్ చేయబడుతుంది. ఈ రేటింగ్ ల తో ఉండే అప్పులను ఆర్థిక ఇబ్బందులతో సమయానికి తగ్గ సేవలను ఎక్కువ రక్షణ తో అందిస్తాయి. అలాంటి అప్పులు తక్కువ క్రెడిట్ రిస్క్ ని కలిగి ఉంటాయి. ఆఅ ఇబ్బంది ఏప్రెల్ 7, 2025 సోమవారం నాడు మొదలయ్యింది మరియు ఏప్రెల్ 23, 2025 బుధవారం నాడు ముగుస్తుంది. ఐ ఐ ఎఫ్ ఎల్ ఫినాన్స్ ఎన్ సి డి లను 100 కోట్ల("బేసిక్ ఇష్యూ పరిమాణం) వరకు జారీ చేస్తుంది. అది 400 కోట్ల వరకు ఓవర్ సబ్స్క్రిప్షన్ ని అందిస్తుంది( గ్రీన్ షూ ఎంపిక) మరియు అది సుమారు 500 కోట్ల రూపాయల వరకు ఉంటుంది. తొమ్మిదవ సిరీస్ కింద ఉన్న ఎన్ సి డి లు వార్షికంగా 10.24% అత్యధిక ఎన్ సి డి లను అందిస్తుంది మరియు అది 60 నెలలు వరకు ఉంటుంది. ఎన్ సి డి లు 15 నెలలకు, 24 నెలలకు, 36 నెలలకు మరియు 60 నెలల వరకు అందుబాటులో ఉంటాయి. వడ్డీ రేటు యొక్క ఫ్రీక్వెన్సీ నెలవారీ గా, వార్షికంగా మరియు క్రమానుగుణంగా అందుబాటులో ఉంటుంది.

# మార్కెట్లు ఢమాల్



**స్టాక్ మార్కెట్ కు 'బ్లాక్ మండే' - భారీ నష్టాల్లో సూచీలు - అన్ని రంగాలు భారీగా పతనం**
**పెద్దన్న ఆరంభించిన వాణిజ్య యుద్ధం ప్రధాన కారణం - ట్రంప్ దెబ్బ - గోల్మెండ్ అబ్బల ఉందన్న విశ్లేషకులు**
**ప్రపంచ వాణిజ్య మార్కెట్లు అన్నింటా తీవ్ర ప్రభావం - భారత్ లోనే దాదాపు రూ.12 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి**

ముంబైః ట్రంప్ వాణిజ్య యుద్ధం కారణంగా దేశీయ స్టాక్ మార్కెట్ సోమవారం అల్లకల్లోలం అయిపోయింది. ఉదయం మార్కెట్ ప్రారంభం కాగానే భారీ నష్టాలతో ప్రారంభమైంది. సూచీలన్నీ భారీగా పతనం అయిపోయాయి. దీంతో ప్రస్తుతం మార్కెట్ అంతా అస్తవ్యస్థంగా మారిపోయింది. మార్కెట్లు ప్రారంభమైన పావుగంటలోనే బీఎస్ఈలో దాదాపు రూ.12 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది.
సోమవారం భారత స్టాక్ మార్కెట్ సహా ఆసియా దేశాల్లో కూడా సూచీలు మొత్తం నష్టాల్లోకి జారుకున్నాయి. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా, భారత స్టాక్ మార్కెట్ ప్రారంభంలోనే తీవ్రమైన అమ్మకాలు పెరిగి, నిఫ్టీ, సెన్సెక్స్ 10 నెలల కనిష్ఠ స్థాయిలకు చేరుకున్నాయి. మరోవైపు టోక్యో నిక్కీ 225 ఇండెక్స్ 8 శాతం తగ్గిపోగా, ఆస్ట్రేలియా ఎస్ అండ్ పి / ఏఎస్క ఎక్స్ 200 6% పడిపోయింది. తైవాన్ సూచీలు కూడా 6 శాతం, దక్షిణ కొరియాలోని కోస్పి 4.4% నష్టపోయింది. ఇండియా వోలాటిలిటీ ఇండెక్స్ 55%కి చేరుకుంది. ఇది పెట్టుబడిదారుల్లో భయాన్ని పెంచింది.
**ప్రధాన కారణాలు :** ప్రముఖ ఫైనాన్స్ సంస్థ గోల్డ్మన్ సాచ్స్.. ట్రంప్ టారిఫ్ విధించిన తర్వాత అమెరికాలో మాంద్యం వచ్చే అవకాశాలను 45%కు పెంచింది. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై మరింత తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని తెలిపింది. దీంతో భయాందోళన చెందిన మదుపర్లు అమ్మకాలు చేశారు. తద్వారా, నిఫ్టీ, సెన్సెక్స్, వృద్ధి, అమ్మకాల ఒత్తిడితో అనేక మార్కెట్లలో నష్టాలు ఏర్పడ్డాయి. ట్రంప్ టారిఫ్ విధించిన చర్యల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెరిగిన అనిశ్చితి, ద్రవ్యోల్బణం, అమెరికా, చైనా వాణిజ్య విభేదాలు, వృద్ధి తగ్గిపోవడం సహా పలు కారణాలు ఈ నష్టాలకు ప్రధాన కారణాలని నిపుణులు చెబుతున్నారు.
**వేచి ఉండాలి..** ని ప్రపంచ మార్కెట్లలో పెరిగిన అనిశ్చితి కారణంగానే మార్కెట్లు పడిపోయాయని ఐసిఐసిఐ సెక్యూరిటీస్ విశ్లేషకులు అన్నారు. ఈ క్రమంలో నిఫ్టీ సూచిక 22,800 పాయింట్ల స్థాయికి చేరే వరకు పెట్టుబడులను వేచి ఉంచాలని ఇన్వెస్టర్లకు సూచించారు. దీంతోపాటు పలు అనిశ్చితుల మధ్య, 22,000 పాయింట్ల దగ్గర సపోర్ట్ లభించవచ్చన్నారు. అయితే, ప్రస్తుతం ప్రపంచ మార్కెట్లు క్షీణంగా ఉంటే, వీటిలో పెట్టుబడులు పెట్టడం మిగిలిన రిస్కు పరిగణలోకి తీసుకోవడం కూడా కీలకం కానుంది.
**సర్వీసెస్ సూచనలు :** ప్రస్తుతం మార్కెట్లో పెరిగిన భయాందోళన నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రధాన పెట్టుబడి వ్యూహకర్త వి.కె. విజయకుమార్ అన్నారు. ఈ క్రమంలో వాణిజ్య యుద్ధం మాత్రమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లలో మరో సమస్యలు కూడా ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. వాణిజ్య ఒప్పందాలను దృష్టిలో ఉంచుకుని తర్వాత భారతదేశం వృద్ధి దిశగా కొనసాగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

**ప్రపంచ వ్యాప్తంగా వివిధ స్టాక్ మార్కెట్లు లో నష్టాలు**

| | |
|---|---|
| హాంకాంగ్: -13.6% | నెదర్లాండ్స్: -6.2% |
| తైవాన్: -9.6% | ఆస్ట్రేలియా: -6.2% |
| జపాన్: -9.5% | ఫ్రాన్స్: -6.1% |
| ఇటలీ: -8.4% | యుకె: -5.2% |
| సింగపూర్: -8% | మలేషియా: -4.5% |
| స్వీడన్: -7% | ఫిలిప్పీన్స్: -4.3% |
| చైనా: -7% | భారతదేశం: -4.1% |
| స్విట్జర్లాండ్: -7% | రష్యా: -3.8% |
| జర్మనీ: -6.8% | సౌదీ: -3.3% |
| స్పెయిన్: -6.4% | టర్కీ: -2.8% |

**ఏ రంగాలు పెట్టుబడులకు అనుకూలం :** ఈ మార్కెట్ భయాందోళన నేపథ్యంలో సందర్భంలో దేశీయ వినియోగ రంగాలు, ఆర్థిక, విమానయాన, హోటల్స్, ఆటోలు, సిమెంట్, రక్షణ రంగాలు, డిజిటల్ ప్లాట్ఫామ్స్ వంటి రంగాలు సంక్షోభం నుంచి సురక్షితంగా ఉండే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ట్రంప్ సుంకాలు ఎక్కువకాలం కొనసాగవని భావించినప్పటికీ, ఈ రంగాల్లో పెరుగుతున్న డిమాండ్ వల్ల పెట్టుబడిదారులకు సానుకూల ఫలితాలు వచ్చే అవకాశాలు ఉన్నట్లు అభిప్రాయపడుతున్నారు.
ట్రంప్ దెబ్బ టాటా మోటార్స్ గట్టిగా తగిలింది. ఆటోమొబైల్ దిగుమతులపై 25శాతం టారిఫ్ అని ట్రంప్ ప్రకటించగానే.. అమెరికాకు ల్యాండ్ రోవర్, జాగ్వార్ ఎగుమతులను తాత్కాలికంగా నిలిపేసింది టాటా మోటార్స్. ఇక ఖతం. ఈ న్యూస్తో సోమవారం ఇంట్రాడేలో షేర్ వాల్యూ 10శాతం క్షీణించి లోయర్ సర్క్యూట్ను తాకింది. టాటా గ్రూపునకు చెందిన రిటైల్ సంస్థ ట్రెంట్ ఏకంగా 19శాతం డౌన్ ఫాల్ అయింది. టీసీఎస్, టాటా స్టీల్, టైటాన్, టాటా కన్జూమర్ అన్నీ పతనమయ్యాయి. 1.28 లక్షల కోట్ల మార్కెట్ విలువను కోల్పోయింది టాటా కంపెనీ.
**అన్ని షేర్లు ఫసక్..** అదానీ పోర్ట్స్, ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టీ, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఆటో, దాబర్ ఇండియా తదితర షేర్లు భారీగా పతనమయ్యాయి. బీఎస్ఈ ఇండెక్స్ ఏకంగా 517 కంపెనీల షేర్లు లోయర్ సర్క్యూట్లు టచ్ చేశాయంటే మార్కెట్లు ఎంత దారుణంగా పడిపోయాయో తెలుస్తోంది.
**క్రొకొడైల్ ఫెస్టివల్ :** ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయినప్పటి నుంచీ ఇదే దుస్థితి. ఇండియన్ స్టాక్ మార్కెట్లలోనే ఇప్పటి వరకు సుమారు 45 లక్షల కోట్ల మార్కెట్ వాల్యూ కరిగిపోయింది. సోమవారం ఒక్కరోజే 20 లక్షల కోట్ల సంపద ఖతం. ముందుముందు ఇంకెంత పతనం చూడాల్సి వస్తుందో అనే టెన్షన్ అందరిలోనూ నెలకొంది. బ్లాక్ మండేతో మనోళ్ల మటాష్ అన్నారు

## హైదరాబాద్లో ది బేర్ హౌస్ స్టోర్!




హైదరాబాద్: ఇటీవల ప్రసారమైన షార్క్ ట్యాంక్ సీజన్ 4 ఎపిసోడ్ తర్వాత చర్చనీయాంశమైన స్మార్ట్ కాజువల్స్ ప్రత్యేకత కలిగిన సమకాలీన పురుషుల దుస్తులు మరియు ఉపకరణాల బ్రాండ్ అయిన ది బేర్ హౌస్, ఇప్పుడు హైదరాబాద్లోని బంజారా హిల్స్లో తమ రెండవ ప్రత్యేకమైన ఆఫ్లైన్ స్టోర్ను ప్రారంభించింది. ఈ బ్రాండ్ నగరంలోని బ్రాడ్వే లో కూడా తమ స్టోర్ ను కలిగి ఉంది.ఈ స్టోర్ బ్రాండ్ యొక్క మొట్టమొదటి హై స్ట్రీట్-కమ్ మాల్ రిటైల్ అవుట్లెట్, ఇది వ్యూహాత్మకంగా హైదరాబాద్లోని అత్యంత ప్రీమియం షాపింగ్ గమ్యస్థానాలలో ఒకటైన - బంజారా హిల్స్లో ఏర్పాటు చేయబడింది.వ్యూహాత్మకంగా బయటి నుండి నేరుగా మాల్లో ఉన్న స్టోర్ కు చేరుకునేలా ఏర్పాట్లు కలిగిన, 1200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టోర్ , ది బేర్ హౌస్ యొక్క సిగ్నేచర్ బేర్ కేవ్ డిజైన్ను కలిగి ఉంది, ఇది దాని బెంగళూరు స్టోర్ లో అద్భుతంగా ప్రతిబింబిస్తుంది. ఎలుగుబంటి గుహ నుండి ప్రేరణ పొందిన ఈ స్టోర్ మట్టి సువాసనలు మరియు ఆహ్లాదకరమైన రంగులతో ఆకట్టుకొనుంది." ది బేర్ హౌస్ యొక్క ఆఫ్లైన్ అమ్మకాలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన మార్కెట్లలో హైదరాబాద్ ఒకటి, ఈ ఆఫ్లైన్ విస్తరణ బ్రాండ్కు సహజమైన పురోగతి. నగర ప్రజలు మా సిగ్నేచర్ షర్టులు, ఆకర్షణీయమైన లినెన్ మరియు డెనిమ్ షేడ్ లను కలిగి ఉన్న బ్రాండ్ యొక్క తాజా కలెక్షన్ ను ప్రత్యక్షంగా వీక్షించి , అనుభూతులను పొందగలరని ఆశిస్తున్నాము. ఎల్లప్పుడూ ప్రయాణాలలో వుండే , సౌకర్యం , శైలి రెండింటినీ కోరుకునే పురుషుల కోసం ఈ కలెక్షన్ రూపొందించబడింది, "అని ది బేర్ హౌస్ సహ వ్యవస్థాపకుడు హర్ష్ సోమయ్య అన్నారు.

## విజయ్ సేల్స్ బ్రాండ్ అంబాసిడర్గా విజయ్ దేవరకొండ




హైదరాబాద్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ రిటైల్ చైన్ న విజయ్ సేల్స్, దక్షిణ భారత మార్కెట్లో కంపెనీ నటుడు విజయ్ దేవరకొండతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ సహకారం బ్రాండ్ మరియు నటులు ఇద్దరికీ పరస్పర వృద్ధిని మరియు అపూర్వమైన మార్కెట్ చొచ్చుకుపోవడాన్ని వాగ్దానం చేసే అద్భుతమైన కూటమిని సూచిస్తుంది.ఈ భాగస్వామ్యం దక్షిణ భారత మార్కెట్లో తన పాదముద్రను విస్తరించడంలో సహాయపడుతుంది. విజయ్ దేవరకొండ యొక్క అపారమైన ప్రజాదరణను మరియు తెలుగు మాట్లాడే రాష్ట్రాలు మరియు వెలుపల ఉన్న యువ వినియోగదారులతో బలమైన అనుబంధాన్ని పెంచుతుంది. విపరీతమైన అభిమానుల ఫాలోయింగ్ మరియు ట్రెండ్సెట్టింగ్కు ఖ్యాతి ఉన్న దేవరకొండ కేవలం స్టార్ పవర్ను మాత్రమే కాకుండా, విజయ్ సేల్స్ బ్రాండ్ మార్కెట్లో ప్రధానమైన సాంకేతిక పరిజ్ఞానం ఉన్న యువ జనాభాతో నిజమైన ప్రతిధ్వనిని తెస్తుంది."ఈ సహకారం కేవలం బ్రాండ్ ఎండార్స్మెంట్ కంటే ఎక్కువలే ఇది అత్యాధునిక సాంకేతికత మరియు ఆకాంక్షాత్మక జీవనశైలి మధ్య అంతరాన్ని తగ్గించడానికి ఒక వ్యూహాత్మక దృష్టి" అని విజయ్ సేల్స్ డైరెక్టర్ నీలేష్ గుప్తా అన్నారు. "విజయ్ దేవరకొండ యువత, ఆవిష్కరణ మరియు ప్రామాణికతకు సంబంధించిన యొక్క పరిపూర్ణ సంగమానికి ప్రాతినిధ్యం వహిస్తాడు. సాంకేతికత జీవనశైలికి అనుగుణంగా ఉండే ఒక ప్రత్యేకమైన పర్యావరణ వ్యవస్థను రూపొందించడానికి మా భాగస్వామ్యం రూపొందించబడింది, ఇక్కడ ప్రతి వినియోగదారుడు తమ డైనమిక్ జీవితాలను పూర్తి చేసే అత్యుత్తమ ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను ఎంచుకునే అధికారం కలిగి ఉంటాడు. ఈ భాగస్వామ్యం మా లావాదేవీలను మించిన కథనాన్ని రూపొందించడం మరియు మా కస్టమర్లతో అనుబంధాన్ని ఏర్పరుస్తుంది."విజయ్ దేవరకొండతో, ఈ భాగస్వామ్యం తన బ్రాండ్ను సినిమాకి మించి టెక్నాలజీ మరియు రిటైల్ రంగానికి విస్తరించే అవకాశాన్ని అందిస్తుంది. అన్నారు.

## గొప్ప డీల్స్తో అమెజాన్ నేషనల్ పెట్ డే




బెంగళూరు : ఈ జాతీయ పెట్ దినోత్సవం (నేషనల్ పెట్ డే) సందర్భంగా, గొప్ప విలువకు ప్రత్యేకంగా కూర్చిన పెంపుడు జంతువులకు అవసరమైన వస్తువుల కలెక్షన్ను అందిస్తూ, ఏప్రిల్ 11 నుండి 14 తేదీల మధ్య నడిచే అమెజాన్.ఒక ప్రత్యేకమైన స్టోర్ ఫ్రంట్ తో మీ పెంపుడు జంతువులను మరింత ముద్దు చేసేందుకు వీలు కల్పిస్తుంది. ఒకటే చోట వివిధ విభాగాలకు చెందిన విస్తృత శ్రేణి ఉత్పత్తులను పొందగలుగుతారు %-% తద్వారా శ్రమ లేకుండా, సౌకర్యవంతంగా పెట్ కేర్ చేయగలుగుతారు. పోషకవంతమైన ట్రీట్స్ మొదలుకుని, వినోదంగా ఉండే బొమ్మలు, అగ్రశ్రేణి గ్రూమింగ్ ఉత్పత్తులు, పెంపుడు జంతువులు ఉండేందుకు ముచ్చటగా ఉండే అవసరమైన ఉత్పత్తుల కోసం స్టోర్ఫ్రంట్, పెడిగ్రీ, డ్రూల్స్, రాయల్ కెనైన్, మూలీ, ఫర్మినా, హిమాలయా, ఇంకా మరెన్నో అగ్రశ్రేణి ఉత్పత్తులను అందిస్తోంది. వేగంగా, విశ్వసనీయమైన డెలివరీ కూడా లభిస్తుంది కనుక, పెట్ కోసం షాపింగ్ ఇంత ఆనందదాయకంగా, సౌకర్యవంతంగా మునుపెన్నడూ ఉండి ఉండదు. అమెజాన్ పేతో కస్టమర్లకు గొప్ప సేవింగ్స్ కూడా లభిస్తాయి. వేగాది పెట్ ఉత్పత్తులకు సేమ్-డే (అదే రోజు) డెలివరీ అవకాశం అందుబాటులో ఉండటంతో, ప్రైమ్ మెంబర్లకు షాపింగ్ మరింత సులభం అవుతుంది. రూ 5000ల కనీస ఆర్డర్ కు %ఐసీఐ% క్రెడిట్ కార్డుతో జరిపే చెల్లింపు పై 10% తగ్గింపు సౌకర్యాన్ని కస్టమర్లు పొందగలుగుతారు.

## హ్యుందాయ్ ఎక్స్టర్ హై సిఎన్జి కొత్త ఎక్స్ వేరియంట్




గురుగ్రామ్, : హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్కు ఠ్ర మరియు యాక్సెస్ చేయగల మొబిలిటీ సొల్యూషన్లను అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉంది ఎక్స్టర్ హై సిఎన్జి డ్యూ లైనప్లో కొత్త ఈఎక్స్ వేరియంట్ను పరిచయం చేసింది. జెన్ ఎంజెడ్ కస్టమర్ల కోసం రూపొందించబడిన, హ్యుందాయ్ ఎక్స్టర్ హై సిఎన్జి డ్యూ వినియోగదారులకు సరసమైన మరియు సమర్థవంతమైన ద్వి-ఇంధన ఎంపికను అందిస్తుంది. ఎక్స్టర్ హై సిఎన్జి డ్యూ ఎక్స్ వేరియంట్ హ్యుందాయ్ డిజైన్, నమ్మకం, ఆవిష్కరణ మరియు పనితీరు యొక్క ఖచ్చితమైన కలయిక. హ్యుందాయ్ ఎక్స్టర్ హై-సిఎన్జి ద్యుయో కస్టమర్లకు అసాధారణమైన డ్రైవింగ్ అనుభవాన్ని అందించడానికి రూపొందించబడింది, వారు స్టైల్ మరియు ఎఫిషియన్సీపై రాజీ పడకుండా.
ఈ కొత్త వేరియంట్ పరిచయంపై వ్యాఖ్యానిస్తూ, హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ యొక్క హోల్-టైమ్ డైరెక్టర్ మరియు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీ తరుణ్ గార్గ్ మాట్లాడుతూ, " దమా కస్టమర్ల అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చే స్మార్ట్ మొబిలిటీ సొల్యూషన్లను అందించడానికి మేము కట్టుబడి ఉన్నాము. మా ఎక్స్ వేరియంట్ పరిచయం చేయడం హ్యుందాయ్ సి ఎక్స్ శ్రేణి. కస్టమర్-సెంట్రిక్ విధానం, దాని సమర్థవంతమైన ద్వి-ఇంధన సాంకేతికత, మెరుగైన భద్రతా ఫీచర్లు మరియు హ్యుందాయ్ యొక్క సిగ్నేచర్ విశ్వసనీయతతో విస్తృత ప్రేక్షకులకు అందుబాటులో ఉండేలా చూసేందుకు, ఎక్స్టర్ హై సిఎన్జి డ్యూ ఎక్స్ వేరియంట్ మా గ్రీన్ మొబిలిటీ పోర్ట్ఫోలియోను విస్తరింపజేస్తున్నది. ఉంది. అన్నారు. హ్యుందాయ్ ఎక్స్టర్ హై-సిఎన్జి డుయో అత్యాధునిక సాంకేతికత మరియు అధునాతన భద్రతా లక్షణాలను అందిస్తుంది, విశాలమైన ఇంటీరియర్స్ అనుభవించబడుతుంది, ఇది నగర ప్రయాణాలకు మరియు హైవే ప్రయాణాలకు అన-ువైన ఎంపిక. ద్వంద్వ-సిలిండర్ సెటప్ బూట్ స్పేస్ను పెంచుతుంది, అసాధారణమైన పనితీరును

## అధునాతన ఫీచర్ లతో అర్బన్ క్రూయిజర్ హైరైడర్



బెంగళూరు : టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) ఈరోజు అర్బన్ క్రూయిజర్ హైరైడర్లో భద్రత, సౌకర్యం మరియు సౌలభ్యాన్ని పునర్నిర్వచించే ఫీచర్ అప్డేట్లను ప్రకటించినట్లు వెల్లడించింది. భారతదేశపు మొట్టమొదటి సెల్ఫ్-ఛార్జింగ్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ %ఖ్లు%గా గుర్తింపు పొందిన అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఇప్పటికే 1 లక్ష వాహనాల అమ్మకాల మైలురాయిని దాటింది. ఇది దాని వినూత్న సాంకేతికత, అసాధారణమైన ఇంధన సామర్థ్యం, శక్తివంతమైన పనితీరు, ప్రీమియం డ్రైవింగ్ అనుభవంతో హృదయాలను గెలుచుకుంటునే ఉంది.
అర్బన్ క్రూయిజర్ హైరైడర్ లో ఇప్పుడు ప్రధానంగా మెరుగైన భద్రత ఫీచర్లు జోడించబడ్డాయి. ప్రయాణీకుల భద్రతను నిర్ధారిస్తూ 6 ఎయిర్బ్యాగ్లు ఇపుడు అన్ని వేరియంట్లలో ప్రామాణికంగా ఉన్నాయి. అలాగే ఆటోమేటిక్ ట్రాన్స్మిషన్ ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ (%ఐఆర్%) జోడించబడింది. సౌకర్యం కోసం 8-వే అడ్జస్టబుల్ పవర్ డ్రైవర్ సీట్, యాంబియంట్ లైటింగ్, క్యాబిన్ లోపల మెరుగైన గాలి నాణ్యత పర్యవేక్షణను నిర్ధారిస్తూ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ డిస్ప్లే జోడించబడింది.
అర్బన్ క్రూయిజర్ హైరైడర్ పరిచయం గురించి సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ వరీందర్ వాధ్వా మాట్లాడుతూ, "ఎస్యూవీసెగ్మెంట్ అభివృద్ధి చెందుతున్న కొద్దీ, మేము మా శ్రేణిని మెరుగు పరుస్తూనే ఉన్నాము. తాజా అర్బన్ క్రూయిజర్ హైరైడర్ అనేది అత్యుత్తమ సాంకేతికత, అధునాతన భద్రత , ఉన్నతమైన సౌకర్యం అందించాలనే మా నిబద్ధతకు నిదర్శనం. ఈ తాజా అప్డేట్తో, హైరైడర్ మరింతమంది వినియోగదారులను ఆకర్షిస్తుందని, భారతదేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న "ఎస్యువి లలో ఒకటిగా దాని స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంటుందని విశ్వసిస్తున్నాము" అని అన్నారు.

## లాయిడ్ లగ్జూరియా కలెక్షన్స్ ఆవిష్కరణ



హావెల్స్ ఇండియాకు చెందిన ప్రముఖ కన్స్యూమర్ డ్యూరబుల్స్ బ్రాండ్ లాయిడ్ లక్జూరియా కలెక్షన్ విడుదలతో లగ్జరీ కూలింగ్ సొల్యూషన్స్ యొక్క కొత్త లైనప్ తో తన ఉత్పత్తి ఆఫర్ ను పెంచుతోంది. ఈ ఉత్తేజకరమైన విస్తరణలో వినూత్న స్ప్లైటర్ పరిచయం మరియు ఇప్పటికే ప్రాచుర్యం పొందిన స్ప్లైటర్ %ఒ% స్ప్లైన్ మోడళ్ల విస్తరణ ఉన్నాయి. దీనితో లాయిడ్ తన ప్రీమియం ఎయిర్ కండిషనర్ ఆఫర్లను పెంచుతోంది. హై-ఎండ్ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్ కు ప్రతిస్పందిస్తోంది. అదనంగా వినియోగదారుల డిమాండ్ లో ఊహించిన పెరుగుదలను తీర్చడానికి కంపెనీ గత సంవత్సరం విజయవంతమైన ప్రయోగాన్ని నిర్మించడానికి లాయిడ్ తన ఫిలోక్ మరియు శ్రీ సిటీ ప్లాంట్ల ఉమ్మడి తయారీ సామర్థ్యాన్ని సంవత్సరానికి 3 మిలియన్ ఎసిలకు పెంచింది.
లాయిడ్ లక్జూరియా కలెక్షన్ అత్యున్నత స్థాయి హస్తకళా నైపుణ్యం, సృజనాత్మక సాంకేతిక శక్తి సామర్థ్యం మరియు డిజైన్ ఎలిలను తీసుకువస్తుంది. ప్రీమియం ఎయిర్ కండిషనింగ్ సొల్యూషన్స్ కోసం వినియోగదారుల డిమాండ్ పై లోడైన అసాధారణతో ఈ విస్తరణ జరిగింది. ఈ విభాగంపై దృష్టిని పెంచడం ద్వారా లాయిడ్ కేవలం అంచనాలను అందుకోవడమే కాక ఇది సౌకర్యం మరియు సృజనాత్మకత కోసం బార్ ను పెంచుతోంది.నాణ్యత, పనితీరు మరియు శైలికి ప్రాధాన్యత ఇచ్చే వినియోగదారుల అవసరాలను అందిస్తోంది.
ఆవిష్కరణపై హావెల్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యోగేష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, "లాయిడ్ ఎల్లప్పుడూ ఆవిష్కరణలలో ముందంజలో ఉంటుంది. మరియు గత సంవత్సరం లైనప్ అసాధారణంగా మంచి ఆదరణ పొందింది. ఇది ప్రీమియం ఎసి మార్కెట్ లో మా స్థానాన్ని నిజంగా బలోపేతం చేసింది. లక్జూరియా సేకరణను ప్రారంభించడం ఆ విజయాన్ని నిర్మించడానికి మరియు ఆలోచనాత్మకంగా క్యూరేటెడ్ శీతలీకరణ పరిష్కారాలకు పెరుగుతున్న డిమాండ్ కు ప్రతిస్పందించడానికి మా మార్గం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కూలింగ్, వాయిస్ కమాండ్స్ వంటి ఫీచర్లతో స్ప్లైటర్ ఎయిర్ మా పోర్ట్ఫోలియోను వేరు చేస్తుంది. ఎయిర్ కండిషనింగ్ లో లగ్జరీ వైపు అడుగులు వేయడం అంటే హై ఎండ్ ఫీచర్లను జోడించడం మాత్రమే కాదు ఇది పూర్తి అనుభవాన్ని సృష్టించడం గురించి స్ప్లైటర్, స్లైటర్, స్లైన్ లతో కంఫర్ట్ అంటే ఏంటో రీడిజైనింగ్ చేస్తున్నాం. శ్రీసిటీలో మా ఉత్పాదక సామర్థ్యాన్ని విస్తరించడం ఈ దార్శనికతకు మా విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది మరియు నాణ్యమైన మా ఉన్నత ప్రమాణాలకు కట్టుబడి ఉంటూనే అద్భుతమైన విలువను అందించడానికి మా నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. అన్నారు.

## మొబిల్ డెల్వాక్ 100 ఏళ్ల వేడుక




భారత్ – ఈ సంవత్సరం, మొబిల్ డెల్వాక్™ బ్రాండ్ డీజిల్ ఇంజిన్ లూబ్రికేషన్లో ఒక శతాబ్దపు ఆవిష్కరణలను సూచిస్తూ తన 100వ వార్షికోత్సవాన్ని వేడుక చేసుకుంటోంది. ఇంజిన్ పనితీరు, ఎండ్యూరెన్స్ పరిమితులను నిరంతరం ముందుకు తీసుకెళ్లడానికి సంబంధించి మొబిల్ డెల్వాక్™ బ్రాండ్ ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందింది.
ఈ మైలురాయిని వేడుక చేసుకునేందుకు, తరాలుగా విశ్వసిస్తూ వచ్చిన కొనుగోలుదారులను, నిరంతరం కొత్త ప్రమాణాలను సృష్టిస్తూ వచ్చిన ఉద్యోగులను గౌరవించడానికి, మొబిల్ డెల్వాక్™ బృందం ఏడాది పొడవునా బ్రాండ్ చరిత్ర నుండి అత్యంత ముఖ్యమైన కథనాలు చాటిచెప్పనుంది. ఈ కథనాలు అవకాశాలను పునర్నిర్వచించిన మొబిల్ డెల్వాక్™ కొనుగోలుదారులు, ప్రపంచాన్ని అనుసంధానించిన విమానాలు, విప్లవాత్మక సూత్రాలను అభివృద్ధి చేసిన ఇంజనీర్లు మరియు అనేక ఇతర అంశాలను ప్రదర్శిస్తాయి. "మొబిల్ డెల్వాక్™ ఉత్పత్తులు విశ్వసనీయతను అందించేలా రూపొందించబడ్డాయి, ప్రతిరోజూ పనితీరును అందిస్తాయి - వాటిపై ఆధారపడిన కొనుగోలుదారుల మాదిరిగానే", అని ఎక్సాన్ మొబిల్ లూబ్రికెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ లూబ్రికెంట్స్ (సౌత్ ఏషియా పసిఫిక్) మార్కెటింగ్ డైరెక్టర్ వార్విన్ పెరెరా అన్నారు.
"100 సంవత్సరాల వారసత్వంతో, మొబిల్ డెల్వాక్™ ఈ మైలురాయిని దాని సరిశ్రమ నాయకత్వానికి నిదర్శనంగా వేడుక చేసుకుంటోంది. ఈ విజయం రాబోయే సంవత్సరాల్లో పరిశ్రమలు సమర్థవంతంగా ముందుకు సాగడం కోసం సరిహద్దులను అధిగమించడానికి, పురోగతిని నడిపించడానికి మాకు స్ఫూర్తి నిస్తుంది" అని అన్నారు.

సూర్య
విజయవాడ
మంగళవారం
8 ఏప్రియల్ 2025



# మాతృ భాషకు పెద్ద పీట వేయాలి

**-శాసనసభాధిపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు - -3 వ ప్రపంచ తెలుగు మహా సభల లోగో ఆవిష్కరణ.**

విశాఖపట్నం: మాతృ భాషకు పెద్ద పీట వేయడం ప్రభుత్వ, ప్రజల బాధ్యత అని, మాతృ భాషలో మాట్లాడడం ప్రతి ఒక్కరూ గర్వం గా భావించాలని , విద్యా బోధనలో తెలుగుకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని , మాకు రాజకీయ జీవితం ప్రసాదించిన. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు శ్రీ నందమూరి తారకరామారావు తెలుగు భాష, సంస్కృతి, తెలుగు వారి స్వాభిమానం కోసం జీవించి అందరికీ ఆదర్శం గా నిలిచారని శాసనసభాధిపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు తెలుగు సంస్కృతి కి ప్రాధాన్యత నిస్తూ మాతృ భాషను మరింత ముందుకు తీసుకు వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవడం అభినందనీయం అని అయ్యన్న పాత్రుడు అన్నారు.డా.గజల్ శ్రీనివాస్, ఆంధ్ర సారస్వత పరిషత్తు , ఆంధ్ర ప్రదేశ్ ఆధ్యక్షంలో 2026 జనవరి 3,4,5 తేదీలలో అమరావతి రాజధాని ప్రాంతం గుంటూరు శ్రీ సత్య సాయి స్పిరిచువల్ సిటీ గ్రౌండ్స్ లో 3 వ ప్రపంచ తెలుగు మహా సభలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని ప్రశంసించారు.తదుపరి ఆంధ్ర సారస్వత పరషత్తు, ఆంధ్ర ప్రదేశ్ మూడవ ప్రపంచ తెలుగు మహా సభలు – 2026 లోగో ను గోల్ఫ్ క్లబ్ , విశాఖపట్నం లో ఘనంగా ఆవిష్కరించారు..డా. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు భాషాభిమాని ఆత్మీయులు , ఆంధ్ర ప్రదేశ్. శాసన సభ సభాధిపతి అయ్యన పాత్రుడు గారి చేతుల మీదుగా లోగో ఆవిష్కరణ జరగడమంటే ప్రతి తెలుగు బిడ్డ ఈ లోగో ను ఆవిష్కరించి నట్టే అని, ఆంధ్ర మేవ జయతే అన్న నినాదం తో ఆంధ్ర ప్రదేశ్ లో అతి పెద్ద తెలుగు పండుగగా తెలుగు మహా సభలు జరుగుతాయని, ముఖ్య మంత్రులు, గవర్నర్లు, కేంద్ర ప్రముఖులు, దేశాధినేతలు, న్యాయమూర్తులు, చలన చిత్ర, సాహితీ, సాంస్కృతిక ప్రముఖులు ఈ పండుగలో పాల్గొంటారని డా. గజల్ శ్రీనివాస్ తెలిపారు. యువతకు, విద్యార్థినీ విద్యార్థులకు ఈ తెలుగు మహా సభలలో వారి సాంస్కృతిక ప్రదర్శనలకు ప్రాధాన్యత నిస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి ధవేజీ, మేడికొండ శ్రీనివాస్ చౌదరి, తెలుగు మహా సభల ముఖ్య సమన్వయ కర్త పి.రామచంద్ర రాజు, రెడ్ క్రాస్ రాష్ట్ర అధ్యక్షులు వై.డి.రామారావు, కళా భారతి అధ్యక్షులు ఎమ్.ఎస్.ఎన్.రాజు, శ్రీమతి కోడూరి సుశీల గార్లు పాల్గొన్నారు.




# మరోసారి బిజేపీదే ఫస్ట్ ప్లేస్

**- రూ.2243 కోట్ల విరాళాలతో తొలి స్థానం - రూ.281.48 కోట్లతో రెండో స్థానంలో కాంగ్రెస్**

**పార్టీల విరాళాలపై నివేదిక వెల్లడించిన ఏడీఆర్ - కాంగ్రెస్, ఆప్, ఎన్సిపి, ఎంసిపిఐల విరాళాలలో భారీ తరుగుదల**




న్యూఢిల్లీ : విరాళాల విషయంలో బీజేపీ మరోసారి తొలి స్థానంలో నిలిచింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆ పార్టీకి 8,358 విరాళాల నుంచి రూ.2,243 కోట్లకుపైగా సమకూరినట్లు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ ( నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం అత్యధిక విరాళాలను పొందిన రెండో అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్ నిలిచింది. దీనికి 1,994 విరాళాల ద్వారా రూ.281.48 కోట్లు వచ్చాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని జాతీయ పార్టీలకు మొత్తం 12,547 విరాళాల ద్వారా రూ.2,544.28 కోట్లు అందాయి. 2022-2023 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2023-24లో జాతీయ పార్టీలకు విరాళాలు 199 శాతం మేర పెరిగాయి. 2023-24లో జాతీయ పార్టీలకు వచ్చిన మొత్తం విరాళాల్లో 88 శాతం ఒక్క బీజేపీ ఖాతాలోకే చేరాయి.

**కాంగ్రెస్ విరాళాలు 252.18 శాతం జంప్**

2022-23లో బీజేపీకి రూ.719.858 కోట్ల విరాళాలు రాగా, 2023-24లో ఆ పార్టీకి రూ.2,243.94 కోట్ల డొనేషన్లు వచ్చాయి. మొత్తంగా 211.72 శాతం పెరుగుదల నమోదైంది.

2022-23లో కాంగ్రెస్కు రూ.79.924 కోట్ల విరాళాలు రాగా, 2023-24లో రూ.281.48 కోట్ల డొనేషన్లు వచ్చాయి. దీంతో 252.18 శాతం పెరుగుదల నమోదైంది.

ఆమ్ ఆద్మీ పార్టీ ), కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్), నేషనల్ పీపుల్స్ పార్టీ తమకు వచ్చే విరాళాలు బాగా తగ్గాయని ప్రకటించాయి.

2023-24లో ఆమ్ ఆద్మీ పార్టీ విరాళాలు 70.18 శాతం లేదా రూ. 26.038 కోట్లు, %చీప్రా% విరాళాలు 98.02 శాతం లేదా రూ. 7.331 కోట్లు మేర తగ్గిపోయాయి.

ఎన్నికల విరాళాల వివరాలతో 2024 సెప్టెంబర్ 30లోగా నివేదికలను సమర్పించాలని రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించింది. అయితే బీఎస్పీ, ఆప్ మాత్రమే సకాలంలో నివేదికలు సమర్పించాయి. బీజేపీ 42 రోజులు ఆలస్యంగా నివేదికను సమర్పించింది. సీపీఐ(ఎం), కాంగ్రెస్, ఎన్పీపీలు 43, 27, 23 రోజులు ఆలస్యంగా నివేదికలు ఈసీకి సమర్పించాయి.

రూ.20వేలకు మించిన రేంజులో ఒక్క విరాళం కూడా రాలేదని బీఎస్పీ మరోసారి ప్రకటించింది.

**కార్పొరేట్, వ్యక్తిగత విరాళాల లెక్కలివీ**

2023-24లో కార్పొరేట్/వ్యాపార రంగాల నుంచి జాతీయ పార్టీలకు మొత్తం 3,755 విరాళాలు అందాయి. వీటి మొత్తం విలువ రూ. 2,262.55 కోట్లు. ఇది మొత్తం విరాళాలలో 88.92 శాతానికి సమానం. ఇక 8,493 మంది వ్యక్తిగత దాతల నుంచి రూ. 270.872 కోట్లు పార్టీలకు అందాయి. ఇవి మొత్తం విరాళాలలో 10.64 శాతానికి సమానం.

కార్పొరేట్/వ్యాపార రంగాల నుంచి 3,478 విరాళాల ద్వారా బీజేపీకి రూ. 2,064.58 కోట్లు సమకూరాయి. 4,628 మంది వ్యక్తిగత దాతల నుంచి ఆ పార్టీకి రూ.169.126 కోట్లు అందాయి.

కార్పొరేట్/వ్యాపార రంగాల నుంచి 102 విరాళాల ద్వారా కాంగ్రెస్ పార్టీకి రూ.190.3263 కోట్లు సమకూరాయి. 1,882 మంది వ్యక్తిగత దాతల నుంచి ఆ పార్టీకి రూ. 90.899 కోట్లు అందాయి.

2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇతర జాతీయ పార్టీల కంటే తొమ్మిది రెట్లు ఎక్కువగా బీజేపీకి కార్పొరేట్ విరాళాలు వచ్చాయి.

ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ ఏకంగా రూ.880 కోట్లు

2023-24లో బీజేపీ, కాంగ్రెస్లకు కలిపి ఏకంగా రూ. 880 కోట్ల విరాళం ఇచ్చింది ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్. ఈ ట్రస్ట్ బీజేపీకి రూ.723.675 కోట్లు ఇవ్వగా, మొత్తం విరాళాల్లో 32.25 శాతం ఇవే.

ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్టు కాంగ్రెస్ పార్టీకి రూ.156.4025 కోట్ల విరాళం ఇచ్చింది. ఈ పార్టీ అందుకున్న మొత్తం విరాళాల్లో 55.56 శాతం(సగానికిపైగా) ఇవే.

2023-24లో ట్రయంఫ్ ఎలక్టోరల్ ట్రస్ట్ బీజేపీకి రూ.127.50 కోట్లను విరాళంగా ఇచ్చింది. జైభారత్ ఎలక్టోరల్ ట్రస్టు నుంచి బీజేపీకి రూ.5 కోట్ల విరాళం వచ్చింది. డెరైవ్ ఇన్వెస్ట్మెంట్స్ బీజేపీకి రూ.50 కోట్లు, కాంగ్రెస్కు రూ.3.20 కోట్లను విరాళంగా ఇచ్చింది.

బీజేపీకి ఆక్మే సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.51 కోట్లు, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ రూ.50 కోట్లు, రుంగ్తా సన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.50 కోట్లు, దినేష్ చంద్ర ఆర్ అగర్వాల్ ఇన్ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.30 కోట్లు విరాళంగా ఇచ్చాయి.

# పారిపోవద్దు.. ఉద్యోగాలివ్వండి

**ఎన్ఎస్యూఐ ర్యాలీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**




బెగుసరాయ్ః బిహార్లోని బెగుసరాయ్లో కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఎన్ఎస్యూఐ(నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా) నేషనల్ ఇన్ఛార్జి కన్హయ్య కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ భారీ ర్యాలీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ (%ఝష్ట్రబశ్రీ +ఝఅస్త్రఖ%) పాల్గొన్నారు. ఈసందర్భంగా యువతకు ఉద్యోగాలు ఏవని ప్రశ్నించారు. బిహార్ ప్రభుత్వ అధికారులు, రాజకీయ నేతలు పారిపోవద్దని.. యువతకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాలు విని ప్రజలు ఇకపై మోసపోరన్నారు. తమ భవితవ్యాన్ని తాము రాసుకోవడానికి బిహార్ యువత సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందు ఆదివారం రాహుల్ మీడియాతో మాట్లాడుతూ.. బిహార్లో నిర్వహిస్తున్న 'వైట్ టీ-షర్ట్' ఉద్యమంలో యువత పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. విద్యార్థులు ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లడం ఆపాలని.. అందరం కలిసి రాష్ట్రంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ప్రైవేటీకరణ, పేపర్ లీక్లు మొదలైన సమస్యలపై పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు.

రాహుల్ మాటలపై భాజపా స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీకి మరో పరాజయం రాబోతోందని ఎద్దేవా చేసింది. "ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో రాహుల్ గాంధీ మొత్తం కాంగ్రెస్ ఓడను ముంచేశారు. బిహార్లో కూడా అదే జరుగుతుంది. ఆయన ఎక్కడికి వెళ్తే అక్కడ కాంగ్రెస్ మునిగిపోతుంది. ఛత్తీస్గఢ్, హరియాణా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, దిల్లీ ఎన్నికల్లో ఆ విషయం ఇప్పటికే స్పష్టమయ్యింది. బిహార్లో కూడా కాంగ్రెస్ను ముంచడానికి ఆయన బయల్దేరారు" అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్ దుయ్యబట్టారు. ఈ ఏడాది చివర్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇటీవల రాష్ట్రంలో, 40 సంస్థాగత జిల్లాలకు కొత్త అధ్యక్షులను ప్రకటించింది. బిహార్లో అయినా గెలుపొందాలని కాంగ్రెస్ నేతలు కొత్త వ్యూహాలు రచిస్తున్నారు. మళ్లీ అధికారం దక్కించుకోవడానికి ఎన్డీఏ ప్రభుత్వం సిద్ధమవుతోంది.

# పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ డ్యూటీ పెంపు



**పెట్రోల్ పై రూ13, డీజిల్ పై రూ.10కి పెంచిన కేంద్రం**

**ధరల్లో ఎలాంటి మార్పు ఉండదని క్లారిటీ**

న్యూఢిల్లీః పెట్రోల్, డీజిల్పై ఎక్సైజ్ డ్యూటీని పెంచుతూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. లీటర్పై రూ.2 ఎక్సైజ్ డ్యూటీని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా పెట్రోల్పై ఎక్సైజ్ డ్యూటీ రూ13, డీజిల్పై రూ.10కి చేరింది. సోమవారం అర్ధరాత్రి తర్వాత (ఏప్రిల్ 8 నుంచి) పెంచిన ఎక్సైజ్ డ్యూటీ అమల్లోకి రానున్నట్లు వివరించింది.

మరోవైపు పెట్రో ధరల పెంపుపైనా కేంద్రం స్పష్టత ఇచ్చింది. రిటైల్ ధరల్లో ఎలాంటి మార్పు ఉండబోదని క్లారిటీ ఇచ్చింది. ఈ ఎక్సైజ్ డ్యూటీ పెంపు వల్ల రిటైల్ ధరలపై ఎలాంటి ప్రభావం చూపబోదని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. ఈ నిర్ణయంతో పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరల్లో పెరుగుదల ఉండదని చమురు మార్కెటింగ్ కంపెనీలు సమాచారం ఇచ్చినట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వశాఖ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో ప్రస్తుతం బ్యారెల్ ముడి చమురు ధర 60డాలర్లుగా ఉందని కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ వెల్లడించారు."పెట్రోల్, డీజిల్పై ఎక్సైజ్ డ్యూటీ రూ. 2 పెరుగుతున్నాయని నోటిఫికేషన్ చూసి ఉంటారు. దాని గురించి నేను ముందుగానే స్పష్టం చేస్తాను. ఇది వినియోగదారునికి వర్తించదు. అంతర్జాతీయంగా ముడి చమురు బ్యారెల్ ధర 60 డాలర్లకు తగ్గింది, కానీ మన చమురు మార్కెటింగ్ కంపెనీలు 45 రోజుల వ్యవధిలో నిల్వలను కలిగి ఉన్నాయని గుర్తించుకోవాలి. జనవరిలో ముడి చమురు ధర 83 డాలర్లుగా ఉంది. ఆ తర్వాత 75 డాలర్లకు తగ్గింది. మొత్తానికి ముడి చమురు బ్యారెల్ సగటు ధర 75డాలర్లుగా ఉంది. ప్రపంచ ధరలకు అనుగుణంగా చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని మీరు ఆశించవచ్చు. దానికి నా సమాధానం నియంత్రణ లేని రంగంలో, మార్కెట్ రిటైల్ ధరను తదనుగుణంగా సర్దుబాటు చేస్తారని ఆశించవచ్చు. అలని హర్దీప్ సింగ్, కేంద్రమంత్రి అన్నారు.

కాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న ప్రతీకార సుంకాల కారణంగా ట్రేడ్ వార్ వస్తుందన్న ఆందోళనలు నెలకొన్నాయి. ఫలితంగా అంతర్జాతీయ ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ తరుణంలోనే ఎక్సైజ్ సుంకం పెంపు చోటుచేసుకుంది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినందు వల్ల ఈ అదనపు భారాన్ని చమురు సంస్థలు సర్దుబాటు చేసుకుంటాయని తెలుస్తోంది.


# 26 మంది నక్సలైట్లు లొంగుబాటు



దంతేవాడ: ఛత్తీస్గఢ్లో మావోయిస్టులకు మరో గట్టి దెబ్బ తగిలింది. వచ్చే ఏడాది మార్చిలోగా దేశంలో మావోయిస్టులను పూర్తిగా ఏరివేస్తామని కేంద్ర హోం శాఖ అమిత్షా పదేపదే చేస్తున్న హెచ్చరికలు, రాష్ట్ర ప్రభుత్వ పునరావాసాల చర్యలతో దంతేవాడలో 26 మంది మావోయిస్టులు సోమవారం లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో రివార్డులు ప్రకటించిన పలువురు మావోయిస్టులు కూడా ఉన్నారు.కొద్ది నెలలుగా భద్రతా బలగాలకు, నక్సల్స్కు మధ్య పలు ఎన్కౌంటర్లు చోటుచేసుకున్నాయి. అయితే క్రమంగా నక్సల్స్లో మార్పు కనిపిస్తోంది. లొంగిపోవడానికి ఐచ్ఛికంగా ముందుకు వస్తున్నారు. తాజాగా 26 మంది నక్సలైట్లు లొంగిపోవడంపై దంతేవాడ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గౌరవ్ రాయ్ మాట్లాడుతూ, పోలీస్ సీనియర్ అధికారులు, సీఆర్పీఎఫ్ అధికారుల ముందు వీరంతా లొంగిపోయినట్టు చెప్పారు. అడవుల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అంతర్గత విభేదాలు, మావోయిస్టు సిద్ధాంతాలపై భ్రమలు తొలగిపోవడం వంటివి ఇందుకు కారణాలుగా వారు చెప్పినట్టు తెలిపారు. లొంగిపోయిన వారంతా జన్మిలీషియా, రివల్యూషనరీ పార్టీ కమిటీ (ఆర్పీసీ), మావోయిస్ట్ జనతన సర్కార్ విభాగాలు, దండకారణ్య ఆదివాసి కిసాన్ మజ్దూర్ సంఘటన్ (డీఏకేఎంఎస్), చేతనా నాట్యమండలి (సీఎన్ఎం)కి చెందిన వారని వివరించారు. లొంగిపోయిన మావోయిస్టులలో రాజేష్ కశ్యప్పై రూ.3 లక్షలు, కోసా మాద్విపై రూ.1, ఛోటు కుంజంపై రూ.50 వేలు రివార్డు ఉందని అధికారులు తెలిపారు.కాగా, తాజా లొంగుబాటులతో 2022 జూన్ నుంచి ఇంతవరకూ దంతేవాడలో ఆయుధాలు విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో కలిసిన నక్సలైట్ల సంఖ్య 953కు పెరిగింది. వీరిలో 224 మందిపై రివార్డు ఉంది. ఒక్క 2024లోనే బస్తర్ ప్రాంతం నుంచి 792 మంది నక్సలైట్లు లొంగిపోయారు. బస్తర్లో దంతేవాడతో సహా ఏడు జిల్లాలు ఉన్నాయి.

# రేపు 'నవకర్ మహామంత్ర దివస్'లో ప్రధాని

**జైనమతంలో అత్యంత ప్రముఖ్యత కలగిన లార్డ్ మహావీర్ జయంతి**




న్యూఢిల్లీ : దేశ రాజధానిలోని విజ్ఞాన్ భవన్లో ఏప్రిల్ 9న 'నవకర్ మహామంత్ర దివస్'లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. అధికారిక ప్రకటన ప్రకారం, ఈ సందర్భంగా ప్రధాని మోదీ కూడా సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు.నవ్కర్ మహామంత్ర దివస్ అనేది ఆధ్యాత్మిక సామరస్యం మరియు నైతిక స్పృహ యొక్క ముఖ్యమైన వేడుక, ఇది నవ్కర్ మహామంత్ర యొక్క సామూహిక పఠనం ద్వారా ప్రజలను ఏకం చేయడానికి ప్రయత్నిస్తుంది - జైనమతంలో అత్యంత గౌరవనీయమైన మరియు సార్వత్రిక శ్లోకం.అహింస, వినయం మరియు ఆధ్యాత్మిక ఔన్నత్యం యొక్క సూత్రాలలో పాతుకుపోయిన మంత్రం జ్ఞానోదయ జీవుల సద్గుణాలకు నివాళులర్పిస్తుంది మరియు అంతర్గత పరివర్తనను ప్రేరేపిస్తుంది.దివాస్ స్వీయ-శుద్ధి, సహనం మరియు సామూహిక శ్రేయస్సు యొక్క విలువలను ప్రతిబింబించేలా వ్యక్తులందరినీ ప్రోత్సహిస్తుంది. 108 కంటే ఎక్కువ దేశాల నుండి ప్రజలు శాంతి మరియు ఐక్యత కోసం ప్రపంచ పఠనంలో చేరతారు.615 %దీజ%లో రాజ కుటుంబంలో జన్మించి, బాల్యంలోనే 'వర్ధమాన' అనే పేరు పెట్టుకున్న లార్డ్ మహావీర్ జయంతి సందర్భంగా మహావీర్ జయంతిని జరుపుకుంటారు. మహావీర్ సంవత్ ప్రకారం ఇది ఏప్రిల్ 10 న జరుపుకుంటారు.వర్ధమాన పెద్దయ్యాక, అతను 30 సంవత్సరాల వయస్సులో తన రాచరిక స్థితిని త్యజించాడు మరియు సత్యం మరియు జ్ఞానోదయం కోసం తన ఆధ్యాత్మిక యాత్రను ప్రారంభించాడు. అతను 'కేవల జ్ఞానాన్ని' సాధించడానికి తపస్సును ఆచరించాడు మరియు 12 సంవత్సరాలు అడవిలో ధ్యానం చేశాడు. ఆ తర్వాత జైనమతం అనే ధర్మాన్ని ప్రచారం చేశాడు.ప్రపంచవ్యాప్తంగా జైన సమాజం మహావీరుని జయంతిని ఆనందం మరియు ఉత్సాహంతో జరుపుకుంటుంది. మహావీరుడు జైనమతం యొక్క 24వ తీర్థంకరుడు, మరియు అతని బోధనలు శాంతి మరియు సామరస్యాన్ని వ్యాప్తి చేసాయి. మహావీర్ జయంతి పండుగను ప్రపంచంలో, ముఖ్యంగా భారతదేశంలో జైనమతం యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేయడానికి జరుపుకుంటారు. 'అహింసా పర్మో ధర్మం' లేదా అహింస యొక్క కీలక బోధన నేడు ప్రపంచంలో గొప్ప ప్రాముఖ్యతను కలిగి ఉంది.

# గాజా.. ఇక ఎవరూ ఉండలేరక్కడ!

**భీకర దాడులతో గాజాలోకి చొచ్చుకు పోయిన ఇజ్రాయెల్ సైన్యం**

**సగానికి పైగా భూభాగాన్ని తన అధీనంలోకి తెచ్చుకున్నామని ప్రకట**



గాజా: గాజా లోకి చొచ్చుకుపోతోన్న ఇజ్రాయెల్సైన్యం 50 శాతం భూభాగాన్ని అధీనంలోకి తెచ్చుకుంది. బెంజమిన్ నెతన్యాహు సేనలు గత నెల నుంచి హమాస్పై యుద్ధాన్ని తిరిగి ప్రారంభించడంతో పాలస్తీనా ప్రజలకు నిలువనీడ లేకుండా పోతోంది. ఇళ్లు, పొలాలు, ఇతర మౌలిక సదుపాయాలను మళ్లీ వాడుకోలేని విధంగా ధ్వంసం చేస్తున్నాయని హక్కుల సంఘాలు వెల్లడించాయి. దాంతో మిలిటరీ బఫర్ జోన్ ఇటీవల వారాల్లో రెట్టింపయింది. బందీలను విడిపించేందుకే ఈ స్థాయిలో ఒత్తిడి తీసుకువస్తున్నట్లు ఇజ్రాయెల్ చెప్తోంది. హమాస్ ఓడిపోయిన తర్వాత గాజాలో భద్రతాపరమైన నియంత్రణను కలిగి ఉంటామని ఇటీవల ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే ఈ కూల్చివేతల్లో భాగమైన ఒక సైనికుడు మాట్లాడుతూ.. "వారు ఇక్కడకు తిరిగి రావడానికి ఇంకా ఏమీ మిగల్లేదు. ఇక వారు ఎప్పటికీ తిరిగి రారు" అని పాలస్తీనా ప్రజలను ఉద్దేశించి మీడియాతో మాట్లాడారు. ఆ నేల బంజరు భూమిగా మారిపోతోందని వ్యాఖ్యానించారు. దీనిపై ఇజ్రాయెల్ సైన్యం స్పందించింది. తమ దేశాన్ని రక్షించుకోవడానికి, మరీ ముఖ్యంగా 2023లో హమాస్ దాడితో భయాందోళనల్లో చిక్కుకుపోయిన దక్షిణ ప్రాంతంలో భద్రతను మెరుగుపర్చుకోవడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ను కలవనున్న నేపథ్యంలో గాజాపై టెల్ అవీవ్ వరుస దాడులకు పాల్పడుతుండడం గమనార్హం. ట్రంప్తో భేటీలో భాగంగా నెతన్యాహు హమాస్పై ఇజ్రాయెల్ యుద్ధం, బందీల విడుదల, ఇరాన్ అణుసంక్షోభం, తమ దేశంపై విధించిన 17శాతం టారిఫ్లపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గాజాలో యుద్ధం ప్రారంభమైనప్పటినుంచి నెతన్యాహు వాషింగ్టన్ పర్యటనకు వెళ్లడం ఇది నాలుగోసారి.

కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపుపై చర్చలకు సిద్ధమవుతున్న తరుణంలో గత నెల గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఆ కొనసాగింపునకు హమాస్ అంగీకరించని కారణంగానే దాడులు జరిపినట్లు చెప్పారు. ఈ దాడులతో ఇజ్రాయెల్ తమ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి బందీల ప్రాణాలను ప్రమాదంలో పడేసిందని పేర్కొంది. దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఇక్కడ అప్పటి నుంచి కాల్పుల విరమణ ఒప్పందం పక్కనపడిపోయింది. ఈ క్రమంలో ఇజ్రాయెల్ సైన్యం గాజాలోకి చొచ్చుకుపోతోంది. నెతన్యాహు అమెరికా పర్యటనలో నేపథ్యంలో తాజాగా జరిగిన దాడుల్లో 57 మంది కోల్పోయారు. 137 మంది గాయపడ్డారు. 18 నెలల ఘర్షణలో 50వేల మందికి పైగా గాజా పౌరులు మరణించారని హమాస్ వెల్లడించింది.

**బద్లాపూర్ ఎన్కౌంటర్ కేసులో**

# ముంబై హైకోర్టు సంచలన తీర్పు



ముంబై: మహారాష్ట్రలోని రాణె జిల్లా బద్లాపూర్ లోని ఓ పాఠశాలలో ఇద్దరు చిన్నారులపై గత ఏడాది సెప్టెంబర్లో జరిగిన లైంగిక దాడి కేసు సంచలనమైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన అక్షయ్ షిండే ఆ తర్వాత పోలీసు ఎన్కౌంటర్లో మృతి చెందాడు. దీనిపై ముంబై హైకోర్టు సోమవారంనాడు కీలక ఆదేశాలు జారీ చేసింది. కాల్పుల్లో పాల్గొన్న ఐదుగురు పోలీసులపై రెండ్రోజుల్లోగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎన్కౌంటర్పై దర్యాప్తునకు'సిట్' ఏర్పాటు చేయాలని క్రైం బ్రాంచ్ జాయింట్ పోలీస్ కమిషనర్కు సూచించింది. జస్టిస్ రేవతి మోహిత్ దేరే, డాక్టర్ నీల గోఖలేతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది.ఈ కేసులో ఇంతవరకూ రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. ఇలాంటి చర్యలతో రాష్ట్ర చట్టబద్ధతను, నేర న్యాయ వ్యవస్థపై సామాన్యుల విశ్వాసం దెబ్బతింటుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వం తరఫు న్యాయవాది అమిత్ దేశాయ్ దీనిపై వివరణ ఇస్తూ, ఈ కేసును సీఐడీ ఇప్పటికే దర్యాప్తు చేస్తోందన్నారు. విస్తృత దర్యాప్తునకు అలహాబాద్ హైకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ నేతృత్వంలో ప్రభుత్వం ఒక కమిషన్ కూడా ఏర్పాటు చేసిందన్నారు. హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరారు. ఇందుకు ధర్మాసనం నిరాకరించింది. రెండ్రోజుల్లోగా సిట్కు అన్ని పేపర్లను సీఐడీ అందజేయాలని ఆదేశించింది.

# సౌదీలో అక్రమ వలసదారులపై కొరడా

**వారంలో 18,000 మందికి పైగా అరెస్ట్ - స్వదేశాలకు పంపుతున్నమని ప్రకటించిన సౌది**

గాజాః సౌదీ అరేబియా ప్రభుత్వం అక్రమ వలసదా రులపై కొరడా ఝుళిపించింది. వారం వ్యవధిలో సుమారు 18,407 మంది అక్రమ వలసదారులను అరెస్టు చేసింది. వీరంతా రెసిడెన్సీ, లేబర్, సరిహద్దు భద్రతా నియమాలను ఉల్లంఘించినట్లు అక్కడి ప్రభుత్వం పేర్కొంది. మార్చి 27 నుంచి ఏప్రిల్ 2 వరకు పలు ప్రభుత్వ ఏజెన్సీలు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్లో వీరిని అదుపులోకి తీసుకొన్నారు. ముఖ్యంగా అక్రమంగా నివాసం ఉంటున్నవారు.. సరిహద్దులు దాటి దేశంలోకి చొరబడిన వారిని టార్గెట్ చేసి ఈ కార్యక్రమం జరిగింది. వీరిలో 12,995 మంది అక్కడి నివాస చట్టాలను, 3,512 మంది సరిహద్దు భద్రతా చట్టాలను, 1,900 మంది లేబర్ చట్టాలను ఉల్లంఘించినట్లు ఇంటీరియర్ మినిస్ట్రీ వెల్లడించింది.

అరెస్టు అయినవారిలో అత్యధికంగా 66శాతం మంది ఇథోపియా నుంచి వచ్చినట్లు గుర్తించారు. ఆ తర్వాత 28శాతం మంది యెమన్ వాసులుగా గుర్తించారు. ఇక నిబంధనలు ఉల్లంఘించిన మొత్తం 27,288 మందిపై ఆయా దౌత్య కార్యాలయాలకు సమాచారం అందించారు. ఇక వీరిలో 7,523 మందిని నేరుగా డిపోర్ట్ చేశారు. ఇక అక్రమ వలసదారులకు సాయం చేసే వారిపైనా చర్యలు తీసుకొంటున్నారు. ఈ కోవలోనే 21 మందిని అరెస్టు చేశారు. వీరు ఆశ్రయం ఇవ్వడం, రవాణాకు సహకరించడం వంటివి చేశారు. అక్రమ వలసదారులకు ఎవరు సాయం చేసినా 15 ఏళ్ల జైలు, మిలియన్ సౌదీ రియాల్స్ జరిమానా, ఆస్తులు, వాహనాల సీజ్ను ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొంది.




**కొన్ని దేశాలకు వీసాపై సౌదీ బ్యాన్..**

సౌదీ అరేబియా మొత్తం 14 దేశాలకు చెందిన పౌరులకు కొన్ని రకాల వీసాలను జారీ చేయడంపై నిషేధం విధించింది. ఈ జాబితాలో భారత్, పాక్, బంగ్లాదేశ్ ఉన్నాయి. జూన్ మధ్య వరకు ఉమ్రా, బిజినెస్, ఫ్యామిలీ విజిట్ వీసాలు ప్రభావితం కానున్నాయి. సరైన రిజిస్ట్రేషన్ లేకుండా హజ్ యాత్ర చేసేవారిని అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకొన్నారు. గతంలో చాలామంది ఉమ్రా లేదా విజిట్ వీసాపై సౌదీలోకి ప్రవేశించిన తర్వాత గడువు తీరినా వెళ్లకుండా ఉండిపోయి.. హజ్ యాత్రలో పాల్గొనటం పరిపాటిగా మారింది. దీంతో తీవ్రమైన ఉక్కపోతతో జరిగే హజ్లో తీవ్రమైన రద్దీ పెనుసమస్యగా మారుతోంది. ఇలా 2024లో 1,200మంది యాత్రికులు మృతి చెందారు.

ఇప్పటివరకు హజ్ కోసం సౌదీ అరేబియా ప్రతి దేశానికి కొన్ని స్లాట్లను కేటాయిస్తూ వస్తోంది. కానీ, ముందే దేశంలోకి వచ్చి ఉండిపోయిన వారు ఈ వ్యవస్థను బైపాస్ చేస్తున్నట్లు విమర్శలున్నాయి.




## గ్లోబల్ కాఫీగా

# అరకు కాఫీ

**వింటే భారతమే వినాలి తింటే గారెలే తినాలి. ఇప్పుడు తాగితే అరకు కాఫీనే తాగాలనేది తెలుగు రాష్ట్రాలు సహా దేశ విదేశాల్లోని కాఫీ ప్రియుల అభిప్రాయం. ప్రపంచంలో ఎన్నో కాఫీలు ఉన్నా వాటికి రాని భిన్నమైన ఖ్యాతి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ అరకు కాఫీకి వచ్చింది. ఇప్పటికే లండన్ లాంటి నగరాల్లో అడిగి మరి విదేశీయులు అరకు కాఫీ తాగుతున్నారు. ఇప్పుడు మన అరకు కాఫీ మరిన్ని విదేశాలకు అత్యంత ప్రీతికరమైన పానీయం. అందుకే మన దేశ రాజ్యాంగ దేవాలయంగా చెప్పే పార్లమెంట్ లో సైతం అరకు కాఫీకి ఒక స్థానం ఇచ్చారు. ప్రకృతి సిద్ధంగా పండిన కాఫీ గింజలు అత్యంత నాణ్యత ప్రమాణాలు పాటించి వాటిని కాఫీ గా మార్చే గిరిజనులు కష్టం ఎక్కడికి పోలేదన్నది సుస్పష్టం అరకు కాఫీకి వస్తున్న ప్రఖ్యాతిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మరిన్ని వివరాలలోకి వెళితే...**

### పారిస్ ప్రతిష్టాత్మక ప్రిక్స్ ఎపిక్యూర్ -2018 పోటీల్లో బంగారు పతకం

### కూటమి ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రపంచ ఖ్యాతి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో అరకు కాఫీ మరింత ఖ్యాతిని కీర్తిని తెచ్చేలా చేస్తున్నాయి. ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో ముఖ్యంగా అల్లూరి జిల్లా ప్రాంతంలో గిరిజనులు సహజ సిద్ధంగా ఏ రకమైన ఎరువులు వాడకుండా ఈ కాఫీ పంటను సాగు చేస్తారు. ఈ విధంగా తయారైన కాఫీ గింజల నుంచి చక్కటి ప్రమాణాలను పాటిస్తూ కాఫీ గింజలను ఉత్పత్తి చేయడం, కాఫీ పొడిగా తయారు చేయడం గిరిజన సహకార సంస్థ ఇప్పుడు చేస్తున్న ప్రక్రియ. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజన జీవితాల్లో వెలుగు నింపాలనే సదుద్దేశంతో కాఫీ పంట ద్వారా గిరిజనులకు ఆర్థిక ప్రగతిని కలుగజేయాలని దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోంది.

### అరకు కాఫీకి భౌగోళిక గుర్తింపు:

దేశ విదేశాలకు సేంద్రీయ సాగులో అరకు కాఫీ రైతులకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ సాధించిన ఐదు కాఫీ రకాలలో అరకు కాఫీ ఒకటిగా నిలిచింది. చాలా కాఫీలు ఉన్నా సరే అరకు కాఫీకే ఎందుకు అగ్ర కిరీటం దక్కుతోంది అంటే అరకులో చల్లని వాతావరణం కొండ లోయ ప్రాంతాల్లో మట్టి , కల్లాకపటం తెలియని స్వచ్ఛమైన గిరిజనం పండించే కాఫీలో ఏ రసాయనాలు వినియోగించరు. పిక్కలు కోసి సహజమైన సూర్య వెలుతురులో ఎండపెడతారు .అందుకే రుచిలోనూ ఆ స్వచ్ఛత కన్పిస్తుంది.అరకు పర్యాటకులకు అక్కడి కొండ వాలు ప్రాంతాల్లో ఎత్తైన చెట్ల మధ్య కాఫీ తోటలు చూపరులను పలకరిస్తాయి. ప్రపంచంలో కాఫీ సేవించే వారిని ఆకట్టుకోవడంలో అరకు కాఫీ ముందంజలో ఉంటోంది. రుచిలో మేటిగా నిలు స్తున్న అరకు కాఫీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్కు పేరు తెచ్చి పెడుతోందికొన్నేళ్ల క్రితం జర్మనీకి చెందిన గ్లోబల్ ల్యాండ్ స్కేప్స్ సంస్థ గ్లోబల్ ల్యాండ్ స్కేప్ హీరోస్ కోసం నిర్వహించిన నామినేషన్లలో అరకు రైతులు ప్రథమ స్థానంలో నిలవడం అంతర్జాతీయంగా అరకు కాఫీ ఖ్యాతిని మరింత పెంచింది. అరకు కాఫీని అంతర్జాతీయ బ్రాండింగ్ లో నిలిపేందుకు నాంది అనే సంస్థ గత దశాబ్ద కాలానికి పైగా కృషి చేసింది. ముఖ్యంగా కాఫీ రైతులకు సేంద్రీయ సాగు విధానాన్ని పరిచయం చేయడం విజయంలో తొలి మెట్టుగా చెప్పాలి. విశాఖ మన్యంలో నాంది సంస్థ భాగస్వామ్యంతో 40 వేల మంది వరకు కాఫీ రైతులు సాగు చేస్తున్నారు.

చాలా మంది ఉదయాన్నే లేవగానే కప్పు కాఫీ తాగనిదే ఏ పని కూడా చేయరు. ఓ మంచి కాఫీ తియ్యటి అనుభూతిని అందిస్తుంది. మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. కమ్మగా ఉండే కాఫీ పంట ఎక్కడో కాదు మన ఆంధ్రప్రదేశ్లోనే పండుతోంది. విశాఖ జిల్లాలోని అరకులో పండే కాఫీ ఆకులకు దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగానూ మంచి డిమాండ్ ఉంటోంది. మన కాఫీ బ్రాండ్ను అరకు కాఫీ విదేశీ మార్కెట్లో మరింత సుస్థిరం చేస్తోంది. అంతర్జాతీయంగా కాఫీ తోటలకు అధికంగా సాగు చేసే బ్రెజిల్, మన దేశంలోని కర్ణాటకలో ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో అరకు కాఫీకి డిమాండ్ పెరిగింది. ఏడాది క్రితం వరకు అరకు కాఫీ గింజలకు కిలో రూ.150 నుంచి రూ.180 ధర మాత్రమే పలికేది. గత ఏడాది మాత్రం కిలో కాఫీ గింజలు రూ.350 నుంచి రూ.380 పలకడం విశేషం.

### కప్పు కాఫీ రూ.637

అటు ప్రస్తుతం జపాన్లో అరకు కాఫీ గింజలతో తయారు చేసిన కప్పు కాఫీని రూ.637కు విక్రయిస్తున్నారు. అరకు ఏజెన్సీ వ్యాప్తంగా సుమారు 2 లక్షల 12 వేల ఎకరాల్లో కాఫీ తోటలు ఉన్నాయి. వీటిలో లక్ష ఎకరాల్లోని తోటలు ప్రస్తుతం కాపు కాస్తున్నాయి. సాధారణంగా ఎకరాకు 130 నుంచి 150 కిలోలు దిగుబడి వస్తుంటుంది. ఈ ఏడాది మాత్రం 20 నుంచి 25 శాతం వరకు అధికంగా పంట వస్తుందని గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అటు డిమాండ్ కూడా ఎక్కువగా ఉండటంతో లాభాలు వస్తున్నాయని చెప్తున్నారు. బెంగళూరులోని అనేక ప్రైవేట్ సంస్థలు అరకు కాఫీ గింజలను సేకరించి వాటిని శుద్ధి చేసి ఇన్స్టంట్ కాఫీ పౌడర్గా మార్చి ప్యాకింగ్ చేస్తుం టాయి. చాలా మంది వ్యాపారులు బెంగళూరు కేంద్రంగానే అరకు కాఫీ పొడిని బ్రెజిల్, జపాన్ వంటి పెద్ద దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.ఏటా విశాఖ ఏజెన్సీలో 12 వేల టన్నులకు పైగా కాఫీ గింజలు ఉత్పత్తి అవుతాయి. వీటిని జీసీసీ, నాంది ఫౌండేషన్ తో పాటు కొందరు దళారులు కాఫీ పండ్లు, గింజలను కొనుగోలు చేస్తున్నారు. కాఫీ గింజలకు మంచి ధర కల్పించాలనే ఉద్దేశంతో జీసీసీ కొనుగోలు ప్రారంభించిన తరువాత రైతులకు మరింత దన్ను దొరికినట్లు అయింది. 2016 లో కిలో 130 రూపాయిలు ఉండే కాఫీ ఇప్పుడు 2024 లో కిలో 450 రూపాయిలు ఇచ్చి జిసిసి కొనుగోలు చేస్తోంది. కాఫీ మార్కెట్ లో మంచి ధరను అరకు బ్రాండ్ తీసుకువచ్చే దిశగా జీసీసీ కృషి చేస్తోంది.

## పారిస్లో బంగారు పతకం

వీరంతా సేంద్రీయ పద్ధతిలో కాఫీ తోటను సాగు చేస్తున్నారు. గిరిజనుల కృషితో పెంపొందించిన పచ్చదనం 4.5 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలను పీల్చేస్తూ పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తోంది. 2014-2019 టీడీపీ ప్రభుత్వ హయాంలో మొదట పారిస్ ప్రజలకు అరకు కాఫీ రుచిని చేరువ అయ్యింది. అంతేకాదు పారిస్ లో జరిగిన ప్రతిష్టాత్మక ప్రిక్స్ ఎపిక్యూర్ -2018 పోటీల్లో బంగారు పతకాన్ని మన అరకు కాఫీ సొంతం చేసుకుంది.



"గిరిజన జీవితాల్లో వెలుగు నింపాలనే సదుద్దేశంతో కాఫీ పంట ద్వారా గిరిజనులకు ఆర్థిక ప్రగతి సాధించడమే మా ప్రభుత్వ లక్ష్యం. అరకు కాఫీని బ్రాండింగ్ పెంచే ప్రయత్నం చేస్తాం. పార్లమెంట్లో సైతం దాని ప్రస్తావన రావడం ఎంతో సంతోషంగా ఉంది. అంతే కాకుండా దేశ విదేశాల్లో సైతం దీని ప్రత్యేకతను చాటే ప్రయత్నం చేస్తాం"

**– కలిశెట్టి అప్పలనాయుడు, ఎంపీ**

అరకు కాఫీ ఘుమఘుమలు అంతర్జాతీయ ట్విటర్ వేదికగా విశేష చర్చనీయాంశంగా మారి మరొక సారి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చుకుంది. ప్రపంచంలోనే తొలి గిరిజన సంప్రదాయ కాపీ అయిన అరకు కాఫీ ఇండియన్ గ్రేట్ బ్రాండ్లలో ఒకటి అంటూ నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్ ట్వీట్ చేయగా దానిని స్వాగతిస్తూ మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా రీట్వీట్ చేశారు. దీంతో మరొక సారి అంతర్జాతీయంగా అరకు కాఫీపై ట్విట్టర్ వేదికగా పెద్ద చర్చ జరుగుతోంది.

## ప్రధాని మోదీ ప్రశంసలు



రెండు దశాబ్దాల నుంచి మన్యంలో కాఫీసాగును ఐటీడీఏ ప్రోత్సహిస్తోంది. కాఫీ సాగు చేయడంలో నీడ ఎంతో కీలకం. అందుకోసం అవసరమైన సిల్వర్ ఓక్ మొక్కలను పంపిణీ చేయడం కాఫీ మొక్కలు నాటించడం అది సాగు చేసేందుకు అవసరమైన వనరుల్ని సమకూర్చడం ఇలా వివిధ దశల్లో ఐటీడీఏ అందించిన ప్రోత్సాహం మన్యంలో కాఫీ సాగుకు పునాది వేసింది. ప్రస్తుతం 2.41 లక్షల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో కాఫీ సాగు చేస్తున్నారు. ఇందులో లక్ష ఎకరాలు పైగా గిరిజన రైతులు సొంతంగా సాగు చేస్తున్నదే. మిగిలిన విస్తీర్ణంలో ఏపీఎఫ్డీసీ, కాఫీ బోర్డు ఆధ్వర్యంలో సాగు జరుగుదోంది. జీసీసీ , ఐటీడీఏ అందించిన ప్రోత్సాహానికి గిరిజన రైతులు ముందుకు వచ్చి సేంద్రీయ పద్ధతిని అలవాటు చేయడంతో ఇప్పుడు అరకు కాఫీ ప్రపంచం కాఫీ ప్రేమికుల మన్ననలు పొందుతోంది. అందుకే మన్ కి బాత్ లో సైతం ప్రధాని మోదీ ప్రశంసలు పొందింది.

### బ్రాండింగ్ పెంచే ప్రయత్నం:

అరకు కాఫీని వివిధ ఫ్లేవర్స్ తో మార్కెట్ లోకి తీసుకువచ్చి మంచి గిరాకీ వచ్చేలా చేయడంలోనూ జీసీసీ విజయం సాధిస్తోంది. దీనితో పాటు రాష్ట్రంలోని విమానాశ్రయాలు ప్రముఖ పర్యాటక, వాణిజ్య, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో జీసీసీ స్టాల్స్ ఏర్పాటు చేయడం ద్వారా బ్రాండింగ్ ను మరింత పెంచే ప్రయత్నాన్ని చేస్తున్నారు జీసీసీ అధికారులు. వివిధ దేశాల్లోను అరకు కాఫీ రుచులు పరిచయం చేసే ప్రయత్నాలు సఫలీకృతం అవుతున్నట్టు చెబుతున్నారు.

"ఈ సంవత్సరం జీసీసీ నుంచి ఆర్గానిక్ సర్టిఫికేషన్ వచ్చింది. గత 3 సంవత్సరాలుగా దీని కోసం ప్రయత్నం చేస్తున్నాం. ప్రధానంగా ఈ సర్టిఫికేషన్ వలన ఎగుమతుతి చేయడానికి సులభతరంగా ఉంటుంది. అంతే కాకుండా వివిధ రకాల బ్రాండింగ్ల ద్వారా దీన్ని మరింత పెంచేందుకు అవకాశం ఉంటుంది"-అమితాబ్ కాంత్ అరకు కాఫీని సేంద్రియ సాగు పరీక్షలలో 90 కంటే ఎక్కువ మార్కులను నిలకడగా సాధించి, భారతీయ ప్రధాన కాఫీగా దాని స్థానాన్ని పదిలపరుచుకున్నందుకు ప్రశంసించారు. ఇది ఒక ప్రసిద్ధ బ్రాండ్గా పరిణామం చెందడమే కాకుండా గిరిజన వర్గాల జీవితాలపై సానుకూల ప్రభావం చూపి, వారి పురోగతికి తోడ్పడుతుంది.... కల్పనా కుమారి,ఎండీ,జీసీసీ

### పార్లమెంట్ క్యాంటిన్ లో

లోక్సభ క్యాంటీన్లో అరకు స్టాల్ ను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రారంభించారు. అలాగే రాజ్యసభ క్యాంటీన్లో అరకు కాఫీ స్టాల్ ను వాణిజ్య వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభించారు. అరకు లోయలోని కాఫీ సువాసన పార్లమెంట్ లో గుబాళించబోతోందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ట్వీట్ చేశారు. అలాగే సీఎం చంద్రబాబు కూడా పార్లమెంట్ లో అరకు కాఫీ స్టాల్స్ ప్రారంభాన్ని స్వాగతిస్తూ ట్వీట్ చేశారు. పార్లమెంట్లో కాఫీ ప్రియులకు శుభవార్త! మీరు ఇప్పుడు ఆవరణలోనే తాజాగా తయారుచేసిన అరకు కాఫీ కప్పును ఆస్వాదించవచ్చని చంద్రబాబు తెలిపారు. 'మన్ కీ బాత్'లో అరకు కాఫీని ప్రోత్సహించినందుకు గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్రమోడీకి, ఈ స్టాల్ను ఏర్పాటు చేయడానికి దయతో అనుమతి ఇచ్చినందుకు లోక్సభ స్పీకర్ ఓం బిర్లాకు, హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ మైలురాయిని నిజం చేసిన ప్రతి ఒక్కరికీ, అంకితభావంతో ఉన్న ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. ఇది మనందరికీ, ముఖ్యంగా మన గిరిజన రైతులకు గర్వకారణం, వారి అంకితభావం మరియు కృషి అరకు కాఫీని జాతీయ స్థాయిలో అత్యున్నత స్థాయికి తీసుకువచ్చింది. మనం ప్రతి కప్పును ఆస్వాదిస్తున్నప్పుడు, వారి స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని కూడా గుర్తుంచుకుందామని అన్నారు.



# 'గుడ్ బ్యాడ్ అగ్లీ' పవర్ ఫుల్ హై-ఆక్టేన్ యాక్షన్ ట్రైలర్



ప్రముఖ పాన్-ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ కోలీవుడ్ ఐకాన్ అజిత్ కుమార్ హీరోగా నిర్మించిన మల్టీ లాంగ్వేజ్ ప్రాజెక్ట్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధంగా ఉంది. టి-సిరీస్ గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించిన ఈ హై-ప్రొఫైల్ మూవీ ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ తో సంచలనం సృష్టించింది. తాజాగా మేకర్స్ తెలుగు ట్రైలర్ ని రిలీజ్ చేశారు. హీరో అజిత్‌ను డిఫరెంట్ అవతార్స్ లో నెవర్ బిఫోర్ క్యారెక్టర్ లో ప్రజెంట్ చేసి ట్రైలర్ అదిరిపోయింది. తన కొడుకును కాపాడుకోవడానికి తన వైలెంట్ పాస్ట్ కి తిరిగి వచ్చే పాత్రలో అజిత్ క్యారెక్టరైజేషన్ చాలా క్యురియాసిటీని పెంచింది. భయాన్నే భయపెడతాడనే డైలాగ్ హీరో క్యారెక్టర్ ఎంత పవర్ ఫుల్‌గా వుండబోతోంది సూచిస్తోంది. డైరెక్టర్ అధిక్ రవిచంద్రన్, అజిత్ స్వాగ్‌ని మెస్మరైజింగ్‌గా ప్రజెంట్ చేశారు. ట్రైలర్ అద్భుతమైన విజువల్స్, పవర్ ఫుల్ డైలాగ్స్, యాక్షన్ అజిత్ అభిమానులను కట్టిపడేశాయి. ట్రైలర్ లో త్రిష కృష్ణన్, అర్జున్ దాస్, ప్రభు, ప్రసన్న, సునీల్ కీలక పాత్రల్లో కనిపించారు. అభినందన్ రామానుజం సినిమాటోగ్రఫీ అద్భుతంగా ఉంది, జి.వి. ప్రకాష్ కుమార్ నేపథ్య సంగీతం ఎక్స్‌ట్రార్డినరీగా వుంది. మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ప్రొడక్షన్ వాల్యూస్ చాలా గ్రాండియర్‌గా వున్నాయి.

# 'దండోరా' సెకండ్ షెడ్యూల్ ప్రారంభం



నేషనల్ అవార్డ్ గెలుచుకున్న చిత్రం 'కలర్ ఫోటో'.. బ్లాక్‌బస్టర్ మూవీ 'బెదురులంక 2012' చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్రబెనర్జీ ముప్పానేని రూపొందిస్తోన్న తాజా చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ మూవీ శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోంది. ఇప్పటికే ఫస్ట్ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న ఈ చిత్రం తాజాగా సెకండ్ షెడ్యూల్ చిత్రీకరణను ప్రారంభించింది. 25రోజుల పాటు కంటిన్యూగా జరగనున్న ఈ షెడ్యూల్‌లో విలక్షణ నటుడు శివాజీ పాల్గొంటున్నారు. నైంటీస్, కోర్ట్ వంటి డిఫరెంట్ కంటెంట్‌తో ప్రేక్షకులను అలరించిన ఈ వెర్సటైల్ యాక్టర్ ఇప్పుడు దండోరా చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నారు. రీసెంట్‌గా విడుదలైన ఫస్ట్ బీట్ వీడియోకు సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. అగ్ర వర్ణాలకు చెందిన అమ్మాయిలని ప్రేమించి పెళ్లి చేసుకున్నా, అగ్ర వర్ణాలకు ఎదురు తిరిగినా ఎలాంటి దౌర్జన్యకాండ జరుగుతున్నాయనే అంశాన్ని ఆధారంగా చేసుకుని దండోరా సినిమాను తెరకెక్కిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో మన పురాతన ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూనే వ్యంగ్యం, చక్కటి హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికగా ఈ సినిమాను ఆవిష్కరిస్తున్నారు. విలక్షణ నటుడు శివాజీతో పాటు నవదీప్, నందు, రవి కృష్ణ, మణిక, అనూష, రాధ్య తదితరులు..ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

# రోమ్ కామ్ ఎంటర్‌టైనర్‌గా వర్జిన్ బాయ్స్




ఈ సమ్మర్‌లో ప్రేక్షకులను నవ్వుల వర్షంతో ముంచెత్తేందుకు సిద్ధమైన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'వర్జిన్ బాయ్స్' సినిమా రిలీజ్‌కు సిద్ధమైంది. గీతానంద్-మిత్రా శర్మ హీరో హీరోయిన్లుగా రాజ్ గురు ఫిలిమ్స్ పతాకంపై రాజా దరపునేని నిర్మాతగా, దయానంద్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం యువతను ఆకర్షించే కథాంశంతో హాట్ టాపిక్‌గా మారింది. స్మరణ్ సాయి, మార్తాండ్ కె వెంకటేష్, వెంకట ప్రసాద్ లాంటి టెక్నీషియన్స్ ఈ సినిమాకి పని చేస్తున్నారు. సినిమా పోస్టర్ చూస్తుంటేనే దాని ఫన్ ఎలిమెంట్ ఏంటో అర్థమవుతుంది. ఓ అందమైన అమ్మాయి ముఖం, అందులో ఆమె పెదాలపై ముగ్గురు యువకులు విభిన్న శైలిలో కనిపించడం ఆకర్షణీయంగా ఉంది. పోస్టర్ చూస్తుంటే చాలా క్రేజీ వైబ్స్ వస్తున్నాయి. ఈ పోస్టర్‌లో అమ్మాయి పెదాలపై ఒకరు కలర్‌ఫుల్ షార్ట్స్‌లో, మరొకరు స్కేట్‌బోర్డ్‌తో, మరోకరు మ్యాగజైన్‌తో నవ్వుతూ కనిపించడం ఈ సినిమా యొక్క హాస్య రాగాన్ని సూచిస్తోంది. 'బ్రో.. ఆర్ యు వర్జిన్?' అనే ట్యాగ్‌లైన్‌తో ఈ సినిమా యువతలో ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఈ సినిమా రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైన్‌మెంట్‌గా రూపొందుతోందని తెలుస్తోంది. ఈ చిత్రం భారీ ఎత్తున ప్రమోషన్‌లు చేస్తోంది. ఈ సమ్మర్‌లో విడుదల కానున్న ఈ సినిమా బాక్స్‌ఆఫీస్ వద్ద ఘన విజయం సాధిస్తుందని అంచనా వేస్తున్నారు. యువకుల మధ్య నడిచే రొమాన్స్, కామెడీ, ఎమోషన్స్‌తో కూడిన ఈ సినిమా థియేటర్లలో మరింత ఉత్సాహాన్ని రేకెత్తించే అవకాశం ఉంది.మొత్తానికి పోస్టర్ అంచనాలను పెంచే సింది. పోస్టర్ చూస్తుంటే ఈ సినిమా భారీ హిట్ కానుందని తెలుస్తుంది. త్వరలో రిలీజ్ డేట్ పై క్లారిటీ రానుంది.

# బిగ్ లైనప్‌లో ప్రభాస్



బాహుబలి సిరీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా పేరు తెచ్చుకున్న ప్రభాస్ ఆ క్రేజ్‌కు తగ్గట్టే వరుసగా భారీ పాన్ ఇండియా మూవీస్ చేస్తూ క్షణం తీరికలేకుండా గడిపేస్తున్నాడు. కల్కి తరువాత ప్రభాస్ వరుసగా ఆరు ప్రాజెక్ట్‌లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. ఇందులో మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న కామెడీ హారర్ థ్రిల్లర్ రాజా సాబ్ ఒకటి. గత కొంత కాలంగా ఈ సినిమా షూటింగ్ జరుగుతూనే ఉంది కానీ రిలీజ్ ఎప్పుడనే విషయంపై మాత్రం ఇంత వరకు క్లారిటీ లేదు. ఈ ఏడాది ఖచ్చితంగా ప్రభాస్ నుంచి వచ్చే సినిమా ఇదే అని అంతా భావించారు. అభిమానులు కూడా ఎదురుచూశారు. కానీ రాజా సాబ్ మాత్రం ఈ ఏడాది వచ్చేలా కనిపించడం లేదు. కారణం కొంత భాగం షూటింగ్ పెండింగ్‌గా ఉండటమేనని వార్తలు వినిపిస్తున్నాయి. అంతా అనుకున్నట్టుగా పూర్తయితే వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ చేయాలనే ప్లాన్‌లో మేకర్స్ ఉన్నారని వార్తలు వినిపిస్తున్నాయి. దీని తరువాత ప్రభాస్ అంగీకరించిన మరో భారీ మూవీ సలార్ 2 శౌర్యాంగ పర్వం. ప్రశాంత్ నీల్ డైరెక్ట్ చేయనున్న ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలే ఉన్నాయి. ఫస్ట్ పార్ట్ రిలీజ్‌కు ముందే పార్ట్ 2 టీజర్‌ని రిలీజ్ చేసి ఈ సినిమాపై దర్శకుడు ప్రశాంత్ నిల్ ఎక్స్‌పెక్టేషన్స్‌ని స్కై హైకి చేర్చారు. అయితే సలార్ విడుదలై ఏడాది దాటినా ఈ ప్రాజెక్ట్ గురించి ఎలాంటి సౌండ్ వినిపించడం లేదు. ఎప్పుడు స్టార్ట్ చేస్తారనే దానిపై క్లారిటీ లేదు. ఇదిలా ఉంటే ప్రస్తుతం హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ ఫౌజీ మూవీ చేస్తున్నాడు. దీని షూటింగ్ శరవేగంగా జరుగతోంది. కానీ రాజా సాబ్ రిలీజ్ అయితే కానీ ఈ సినిమా రిలీజ్‌పై క్లారిటీ వచ్చే అవకాశం లేదు. ఇక ఫౌజీ తరువాత ప్రభాస్ ...క్రేజీ వైల్డ్ డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగతో కలిసి స్పిరిట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం తెలిసిందే. దీనితో పాటు కల్కి 2 కూడా లైన్‌లో ఉంది. అయితే దీనికి సంబంధించిన స్క్రిప్ట్ ఇంకా పూర్తి కాకపోవడంతో ఇది ఎప్పటికి మొదలవుతుందన్నది స్పష్టతలేదు. వీటితో పాటు ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్ కూడా ఉంది.

# మెడికల్ యాక్షన్ మిస్టరీగా 'వచ్చిన వాడు గౌతమ్'

డిఫరెంట్ సబ్జెక్ట్స్ తో ప్రేక్షకులని అలరిస్తున్న యంగ్ ట్యాలెంటెడ్ హీరో అశ్విన్ బాబు నుండి వస్తున్న మరో ఎక్సయిటింగ్ మూవీ 'వచ్చినవాడు గౌతమ్'. మెడికల్ యాక్షన్ మిస్టరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మామిడాల ఎం.ఆర్. కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. అరుణశ్రీ ఎంటర్‌టైన్మెంట్స్ ప్రొడక్షన్ నెంబర్ 3 గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని నిర్మాత టి. గణపతి రెడ్డి లావిష్‌గా నిర్మిస్తున్నారు. గోల్డ్ లైన్ క్రియేషన్స్, ప్రవల్లిక యోగి కో -ప్రొడ్యూసర్. బ్లేడ్ అండ్ స్టెత్ తో ఉన్న అశ్విన్‌బాబు లుక్ సినిమాపై క్యురియాసిటీని పెంచింది. ఈ చిత్రంలో సాయి రోణక్ కేమియో పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో అశ్విన్‌బాబుతో పాటు, రియా సుమన్, అయేషా ఖాన్, మురళీ శర్మ, సచిన్, ఖేడేకర్, అభినయ, అజయ్, విటి.వి. గణేష్, యెష్నా చౌదరి, సుదర్శన్, శకలక శంకర్, రాఘవ, అమర దీప్, అభిత్ భూషణ్, నాగి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. గౌర హరి మ్యూజిక్ అందిస్తుండగా, ఎం. ఎన్ బాల్ రెడ్డి డీవోపీ, వర్మా ఎడిటర్. సురేష్ భీమగని ఆర్ట్ డైరెక్టర్ గా పని చేస్తున్నారు. ఈ చిత్రం 90 షూటింగ్ పూర్తి చేసుకుంది. బేలన్స్ షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్, పూర్తి చేసుకుని, త్వరలో మేకర్స్ రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేస్తారు.



# ఉత్కంఠను కలిగించే మర్డర్ మిస్టరీ 'తత్వం'


తత్వం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసిన ప్రముఖ దర్శకుడు మారుతి, కల్ట్ ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్. సినిమా చూస్తున్నంతసేపు వాళ్లని ఎంగేజ్ చేయగలిగితే ఆ సినిమా చిన్నదైనా పెద్ద విజయాన్ని అందిస్తారు ప్రేక్షకులు. ముఖ్యంగా మర్డర్ మిస్టరీ జానర్ సినిమాల్లో ఉండే ఉత్కంఠ, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటుంది. ఇప్పుడు ఇదే కోవలో ఓ వైవిధ్యమైన కథాంశంతో ప్రేక్షకులకు థ్రిల్ కలిగించే అంశాలతో రాబోతున్న చిత్రం 'తత్వం'. దినేష్ తేజ్, దష్మిక.కె హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో వంశీ సీమకుర్తి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ తమ సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి చిత్రబృందానికి ఆల్ ద బెస్ట్ చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ "మా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసిన మారుతి, ఎస్‌కేఎన్‌లకు మా ధన్యవాదాలు. పెళ్లి చూపుల కోసమని ఓ గ్రామానికి వెళ్లిన హీరో, ఆ ఊరిలో జరిగిన హత్యల కేసులో ఎలా ఇరుక్కున్నాడు? ఆ కేసుల నుంచి ఎలా బయటపడ్డాడు? ఈ పరిణామాల మధ్యలో అతను తెలుసుకున్న తత్వం ఏమిటి? అనేది ఈ చిత్ర కథ. ప్రతి సన్నివేశం ఎంతో ఉత్కంఠ భరితంగా, ఆసక్తిగా ఉంటుంది' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "ఈతరం ప్రేక్షకులకు కావాలసిన అంశాలతో పాటు సినిమా చూసేటప్పుడు ఉండే ఉత్కంఠ ఈ చిత్రంలో ఉంటుంది. ముఖ్యంగా ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే హైలైట్‌గా ఉంటుంది. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు మా సినిమా తప్పకుండా నచ్చుతుంది' అన్నారు.



# రచయిత సత్యదేవ్ జంగా పుట్టినరోజు వేడుకలు

టాలెంటెడ్ రైటర్ సత్యదేవ్ జంగా నాని నటించిన శ్యామ్ సింగ రాయ్ సినిమాకు కథను అందించారు. ఏప్రిల్ 6న తన పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి, ఈ కార్యక్రమంలో దర్శకుడు మారుతి, నిర్మాత రాధ మోహన్, సినిమాటోగ్రఫర్ కె.కె. సెంథిల్ కుమార్, రచయితలు డార్లింగ్ స్వామి, లక్ష్మీ భూపాల, బివిఎస్ రవి, సంగీత దర్శకులు ఆర్.పి.పట్నాయక్, ఆర్ ఆర్ ధ్రువన్, సింగర్ శ్రీరామ చంద్ర, నటులు రచ్చ రవి, అశ్విన్ బాబు, సింగర్ కౌసల్య, దర్శకులు వీర శంకర్, రచయిత కాసర్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రచయిత సత్యదేవ్ జంగా నేను ఏ ఫిలిం బై అరవింద్ సినిమా కథ రచయితగా పరిచయం అయ్యారు, ఆ సినిమా తరువాత ఆదిత్య మ్యూజిక్ కంపెనీలో సీనియర్ మేనేజర్‌గా 20 ఏళ్ళు వర్క్ చేశారు. టాప్ సింగర్స్ తో 200 ప్రవేట్ ఆల్బమ్స్ చేశారు. ఆ తరువాత నాని సాయిపల్లవి నటించిన శ్యామ్ సింగా రాయ్ సినిమాకు కథ అందించారు. ఈ సినిమా ద్వారా సత్యదేవ్ జంగా కు రచయితగా మంచి పేరు వచ్చింది. ప్రస్తుతం ఎంఎల్ఏ , నేనే రాజు నేనే మంత్రి నిర్మాత భరత్ చౌదరి కరణ్ సి ప్రొడక్షన్స్‌లో ఆకెళ్ల వంశీ దర్శకత్వంలో ఒక థ్రిల్లర్ సినిమాకు కథ అందించబోతున్నారు. ఆయన అన్ని రకాల జానర్స్‌లో కథలు రెడీ చెయ్యడం జరిగింది, ఈ ఏడాది మంచి సినిమాలతో రాబోతున్నారు, సూపర్ నేచురల్, మైథలాజికల్ థ్రిల్లర్స్, హర్రర్ జానర్స్ తో పాటు ఔట్ అండ్ ఔట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్స్ జానర్స్ కథలు సిద్ధం చెయ్యడం జరిగింది, వాటి వివరాలు త్వరలో తెలియజేయనున్నారు.



# 'గోదారి గట్టుపైన' సుమంత్ ప్రభాస్

మేమ్ ఫేమస్ తో స్ట్రాంగ్ డెబ్యు చేసిన న్యూ ఏజ్ యాక్టర్ సుమంత్ ప్రభాస్, ఒక ఎక్సయిటింగ్ న్యూ ప్రాజెక్ట్ తో రాబోతున్నారు. ఈ చిత్రం రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్‌కు ఫస్ట్ వెంచర్. ఎమ్.ఆర్. ప్రొడక్షన్స్ షార్ట్ ఫిల్మ్‌లతో పాపులరైనా సుభాష్ చంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నిధి ప్రదీప్ కథానాయికగా అరంగేట్రం చేస్తుండగా, జగపతి బాబు ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. నిర్మాతలు ఈ సినిమా టైటిల్ 'గోదారి గట్టుపైన'ను రివీల్ చేశారు, ఇది సంక్రాంతికి వస్తున్నాం లోని హిట్ పాట ద్వారా ఇప్పటికే ప్రజాదరణ పొందిన టైటిల్. టైటిల్ లోగో విజువల్ ఎట్రాక్టివ్ గా వుంది, పోస్టర్ ప్రశాంతమైన గోదావరి ప్రాంతాన్ని అందంగా ప్రజెంట్ చేసింది. టైటిల్, పోస్టర్ రెండింటి డిజైన్ ఫ్లజెంట్ గా వుంది. "ఒక



చల్లని సాయంత్రం వేళ ప్రశాంతమైన గోదావరి నది ఒడ్డున మీ స్నేహితులతో కూర్చుని సమయం గడపడం ఎంత ప్రశాంతంగా ఉంటుందో? మా సినిమా కూడా అంతే ప్రశాంతంగా ఉంటుంది. రిలాక్స్‌గా, అందమైన భావోద్వేగాలతో నిండి ఉంటుంది. గోదావరి జిల్లాల వేల్పూరు, రేలంగి, భీమవరం నేపథ్యంలో సెట్ చేయబడిన స్వచ్ఛమైన చిత్రానికి గోదారి గట్టుపైన అని పేరు పెట్టారు. పశ్చిమ గోదావరి ప్రాంతంలోని సుందరమైన ప్రకృతి దృశ్యాలు సినిమా విజువల్ గ్రాండియర్ లో పెంచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి" అని చిత్ర దర్శకుడు చెప్పారు..

# త్వరలో 'కోర' విడుదల

డిఫరెంట్ కాన్సెప్ట్, హై ఓల్టేజ్ యాక్షన్ మూవీని 'కోర' అనే చిత్రాన్ని సునామీ కిట్టి హీరోగా ఒరాటశ్రీ భారీ ఎత్తున తెరకెక్కించారు. ఈ సినిమాలో చరిష్మా, పి.మూర్తి ప్రధాన పాత్రలను పోషించారు. శ్రీ లక్ష్మీ జ్యోతి క్రియేషన్స్ బ్యానర్ మీద డా.ఎ.బి.నందిని, ఎ.ఎన్.బాలాజీ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే రిలీజ్ చేసిన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్, పాటలు సినిమా మీద అంచనాలు పెంచేశాయి. ఇక తాజాగా ఆస్కారు అవార్డు గ్రహీత చంద్రబోస్ రిలీజ్ చేసిన ఒప్పుకుందిరో అంటూ సాగే ఈ పాట అందర్నీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. తాజాగా సినిమాకి సంబంధించిన ఓ అప్డేట్ వచ్చింది. ఏప్రిల్ నెలలో ఈ మూవీని విడుదల చేయనున్నారు. ఈ మేరకు అన్ని కార్యక్రమాలు పూర్తి చేసే పనిలో చిత్ర యూనిట్ బిజీగా ఉంది. ప్రస్తుతం అయితే సెన్సార్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్ ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సెల్వం మాతప్పన్ సినిమాటోగ్రఫర్‌గా పని చేయగా.. బిఆర్ హేమంత్ కుమార్ సంగీతం అందించారు.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044